


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


జిడిపి వృద్ధి పైకి... విదేశీ పెట్టుబడులు కిందికి

వైట్‌హౌస్‌లో కూర్చునేదెవరు?

గ్రామీణ బ్యాంకుల విలీనానికి కేంద్రం కుట్ర

లోపలి పేజీల్లో

సంపుటి 07, సంచిక: 335 | బుధవారం | 06-11-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



అన్ని ప్రైవేట్ ఆస్తులను

## స్వాధీనం చేసుకోలేరు

సుప్రీంకోర్టు తీర్పు

**న్యూఢిల్లీ:** ప్రైవేటు ఆస్తుల స్వాధీనం విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రైవేటు యాజమాన్యంలోని అన్ని ఆస్తులను ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి వీలులేదని స్పష్టంచేసింది. ఈ మేరకు 8:1 మెజారిటీతో సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. కొన్ని కేసుల్లో మాత్రం మినహాయింపు ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను సమాజ వనరుగా పరిగణించొచ్చా అన్న కీలక కేసుపై కొద్దినెలల క్రితం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఏ ప్రైవేటు ఆస్తి సమాజ వనరు కాదు. అన్ని ప్రైవేటు ఆస్తులూ సమాజ వనరులే. ఈ రెండు పరస్పర భిన్నమైన విధానాలు. వీటిపై ప్రస్తుత ప్రైవేటీకరణ, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమకాలీన వ్యాఖ్యానం చేయాల్సిన అవసరం ఉంది' అని అభిప్రాయపడింది. '1950ల్లో భారతదేశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు వ్యాఖ్యానం చేయకూడదు. అప్పుడు తరువాయి 2లో

## దేశంలో కుల వివక్ష

# వాస్తవమే

## కులగణన జరగాల్సిందే



తెలంగాణలో కులగణన దేశానికే మోడల్

దేశం ఆర్థికంగా ఎదగాలంటే కులవ్యవస్థ నిర్మూలన అత్యవసరం

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేస్తాం

జనాభాను లెక్కిస్తేనే నష్టపోతున్నవారికి ప్రాధాన్యం లభిస్తుంది

ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రకటన

ప్రజాపక్షం / హైదరాబాద్

''దేశ వ్యాప్తంగా కుల గణన జరగాల్సిందే. దేశంలో కుల వివక్ష ఉందనేది వాస్తవం. రిజర్వేషన్‌లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేస్తాం. కుల గణనలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్ కానుంది'' అని ఎఐసిసి అగ్ర నాయకులు, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ''అగ్ర కులాలకు నిమ్న కులాల వారు కనిపించరు. కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం జరుగుతుంది. కులాల వారీగా జనాభా లెక్కిస్తే తరాలుగా నష్టపోతున్న వారికి తగిన ప్రాతినిధ్యం దక్కుతుంది. దేశంలో కుల వ్యవస్థ, కుల వివక్ష ఉందని అంగీకరిద్దాం. కుల వివక్షత వల్ల ఎంత ఇబ్బంది ఉంటుందో అర్థం చేసుకోగలను. దేశం ఆర్థికంగా ఎదగాలంటే కుల వ్యవస్థను నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని ఇదివరకే చెప్పాం. దానిని నెరవేర్చుతాం'' అని ప్రకటించారు. హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో మంగళవారం కుల గణనకు సంబంధించి పౌరహక్కులు, మేధావులతో నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా రాహుల్‌గాంధీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ సహా పలువురు మంత్రులు, మేధావులు పాల్గొన్నారు. సదస్సులో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ ప్రపంచంలోనే అన్ని దేశాల్లో కంటే భారత్ లోనే కుల వివక్ష ఎక్కువగా ఉందని ప్రపంచ నిపుణులు చెబుతున్నారని అన్నారు. వాస్తవాలు బయటకు రావొద్దు అనుకునే వారు మాత్రమే కులగణనకు అడ్డు పడతారని రాహుల్ గాంధీ అన్నారు. భారతదేశంలో కులవ్యవస్థ చాల బలంగా ఉందని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ అనేది కనిపించదని చెప్పారు. కులగణన ద్వారా ఏళ్లుగా నష్టపోతున్న వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. కుల వ్యవస్థ అన్ని రంగాల్లో ఉందని, రాజకీయ, న్యాయ వ్యవస్థలోనూ అది బలంగా పాతుకుపోయిందని అన్నారు. కుల వ్యవస్థ అనేది కొంత మంది ఆత్మ విశ్వాసం దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల యువత సైతం ముందుకు వెళ్ల లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని ఈ కుల వ్యవస్థ భారత్‌లోనే ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. కుల తరువాయి 2లో





నేటి నుంచి

## సమగ్ర కుటుంబ సర్వే

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి కులగణన ప్రారంభం కానుంది. కులగణన పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. స్థానిక సంస్థలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ఆలోచన నేపథ్యంలో ఈ సర్వే కీలకం కావడం, 1931 తర్వాత మళ్లీ ఇప్పుడే కులగణన చేపడుతుండడంతో ఈ ప్రక్రియను ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సర్వేకు సంబంధించి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ రూపకల్పన మొదలు ప్రతి అంశంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. సర్వేకు సంబంధించి అధికారులు, సిబ్బందికి పూర్తి స్తాయిలోశిక్షణ ఇచ్చింది. సిబ్బంది ఒక్కొక్కరికి 150 ఇళ్ల చొప్పున కేటాయించారు. వీరంతా బుధవారం నుంచి వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి దాదాపు 75 ప్రశ్నలకు సంబంధించి వివరాలను సేకరించనున్నారు. కుటుంబ యజమాని, సభ్యుల వివరాలు, ఫోన్ నంబర్లు, వారు చేసే పని, తీసుకున్న రుణాలు, ఆస్తులు వంటి వివరాలను నమోదు చేస్తారు. ఈ నెలాఖరుకు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సర్కార్ భావిస్తోంది. సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్ వేసేలా ఏర్పాట్లు చేసింది.

## 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడి



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారు అయ్యింది. ఈ శీతాకాల సమావేశాలు నవంబరు 25నుంచి ప్రారంభమై, వచ్చేనెల 25తేదీ వరకు కొనసాగనున్నాయి. పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మంగళవారంనాడు ఈ విషయాన్ని తెలియజేశారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 26న 'రాజ్యాంగ దినోత్సవ' ప్రత్యేక వేడుకలు జరుపుకోనున్నట్లు రిజిజు చెప్పారు. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో ఈ ప్రత్యేక వేడుకలు జరుగనున్నట్లు ఆయన తెలియజేశారు. 'భారత ప్రభుత్వం సిఫారసు తరువాయి 2లో




భూదాన్ భూములు

## పేదలకు పంచాల్సిందే

అన్యాక్రాంతమైన వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

ఆ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

అన్యాక్రాంతమైన భూదాన్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. భూదాన్ భూములను సేకరించిందే పేదలకు పంచడం కోసమన్నారు. ఆ లక్ష్యం నెరవేర్చేందుకు ప్రభుత్వం తక్షణమే భూదాన్ భూముల్లో ఇప్పటికే గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వేలాది మంది నిరుపేదలకు 60 గజాల చొప్పున ఇంటి స్థలాలను కేటాయించాలని, వారు ఇళ్లను నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేయాలని కోరారు. 'భూదాన్ భూములను పేదలకు పంచడంతో పాటు అన్యాక్రాంతమైన భూదాన్ భూములను స్వాధీనం చేసుకోవాలి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగింది. సమావేశంలో వక్తలుగా తెలంగాణ రాష్ట్ర మానవహక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ చంద్రయ్య, గ్లోబల్ ఆసుపత్రి ఎథిక్స్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఆవులప్పా, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఆల్ ఇండియా సర్వసేవా సంఘ్ సౌత్ ఇండియా కన్వీనర్ ఎం.కృష్ణప్రసాద్, టిఎస్‌డిఎఫ్ కన్వీనర్ ప్రొఫెసర్ తరువాయి 2లో

ధరలకు అనుగుణంగా ఆటోమీటర్

# చార్జీలు పెంచాలి

తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ జెఎసి డిమాండ్ - ఇందిరాపార్కు వద్ద మహాధర్నా




ప్రజాపక్షం /హైదరాబాద్ / ఖైరతాబాద్

ఆటో రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జీలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జెఎసి నాయకులు బి.వెంకటేశం, ఎండి.ఇమ్రాన్ (ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్, ఎ ఐ టి యు సి), వి.మారయ్య (బిఆర్‌టియు), పి.శ్రీకాంత్ (సిఐటియు), లింగం గౌడ్ (ఐఎఫ్‌టియు), వి.ప్రవీణ్ (టియుసిఐ), డి.శ్రీనివాస్ (జియుటిఎస్), ఎం.ఎ.సలీమ్ (యుటిఎడిడబ్ల్యూఎ), ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్), మీర్జా రఫాత్ బేగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్)తోపాటు పెద్ద ఎత్తున ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ గత పదేండ్లలో అమలు కాని ఆటో డ్రైవర్ల హామీలను నెరవేర్చుతామని కాంగ్రెస్ తరువాయి 2లో

## కెటిఆర్‌కు సెగ

పదేళ్లు మీరేం చేశారని నిలదీత

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడబోతుండగా కార్మిక నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ''పదేళ్లు మీరేం చేశారు.. ఓలా... ఊబర్' తదితర సమస్యలను పట్టించుకున్నారా? అని కెటిఆర్‌ను నిలదీశారు. దీనిపైన కెటిఆర్ స్పందిస్తూ 'తమ్ముడు వాగ్వాదం పెట్టుకోకు.. మీ కోసం వచ్చిన వారిని మీరే అవమానించుకుంటే మీకే నష్టం. నాకు పోయేదేమీ లేదు. ప్రధాన ప్రతిపక్షంగా మద్దతు ఇవ్వడానికి.. మీ తరపున తరువాయి 2లో

## హైదరాబాద్‌లో గ్యాంగ్‌రేప్

పోలీసుల అదుపులో నిందితుడు

పరారీలో మరో ఇద్దరు

ప్రజాపక్షం/హైదరాబాద్

పనిమనిషిపై ముగ్గురు యువకులు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌కు చెందిన ముగ్గురు యువకులు జూబ్లీహిల్స్‌లోని మధురానగర్‌లో అద్దెకు ఉంటున్నారు. వారు నగరంలో కూలీ పనులు చేసుకుంటున్నారు. ఇదిలావుండగా మంగళవారం మధురానగర్‌లో ఇతర ఇండ్లలో పని చేసే మహిళ పని పూర్తయిన తరువాత తన ఇంటికి వెళ్తున్న సమయంలో ముగ్గురు యువకులు వచ్చి ఆమెను ఆపారు. తమ ఇంట్లో బట్టలు ఉతికే పని ఉందని నమ్మించి ఆమెను వారు అద్దెకు ఉంటున్న ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు కేకలు వేయడంతో పక్కింటివాళ్లంతా రావడంతో ముగ్గురు యువకులు పారిపోయేందుకు యత్నించారు. స్థానికులు అందులో ఒక తరువాయి 2లో




మళ్లీ అధికారమే లక్ష్యంగా

# మోదీ ఎత్తులు

జమిలి ఎన్నికల పేరుతో మోసం

కమ్యూనిస్టులతోనే దేశం సుభిక్షం

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

పాలకుర్తిలో సాయుధపోరాట యోధుడు నల్లా నర్సింహులు విగ్రహావిష్కరణ

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి/పాలకుర్తి

జమిలి ఎన్నికల పేరుతో మోదీ మోసం చేస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మండిపడ్డారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే కమ్యూనిస్టుల అవసరం ఉందన్న విషయాన్ని ప్రజలు మేధావులు తరువాయి 12లో

'వక్ఫ్' జెపిసి చైర్మన్

## ఏకపక్ష నిర్ణయాలు

స్పీకర్‌కు ప్రతిపక్ష సభ్యుల ఫిర్యాదు

**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ బిల్లుపై వేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) చైర్మన్, బిజెపి ఎంపి జగదాంబికా పాల్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని లోక్‌సభ స్పీకర్‌కు కమిటీలోని ప్రతిపక్ష సభ్యులు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో మంగళవారం నాడు స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాను ఆయన ఛాంబర్‌లో వారు కలిసారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్పీకర్ తాము చెప్పిన విషయాలను ఓపికతో విన్నారని, అతి త్వరలో నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. టిఎంసి సభ్యుడు తరువాయి 12లో

యుపి మదర్సా విద్యాచట్టం

# 'రాజ్యాంగబద్ధమే'

సుప్రీంకోర్డు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ ధర్మాసనం కీలకతీర్పు

రాజ్యాంగ విరుద్ధమన్న అలహాబాద్ హైకోర్టు తీర్పు 'కొట్టివేత'



**న్యూఢిల్లీ :** ఉత్తర ప్రదేశ్ మదర్సాఎడ్యుకేషన్ చట్టం (2004) రాజ్యాంగబద్ధమే అంటూ సుప్రీంకోర్టు మంగళవారంనాడు కీలకతీర్పు ఇచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో ఉత్తర ప్రదేశ్‌లోని వేలాది మదర్సాలకు ఊరట లభించినట్లయింది. ఉత్తర ప్రదేశ్ మదర్సా విద్యా చట్టం రాజ్యాంగ వ్యతిరేకమైనదని పేర్కొంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు ఆ చట్టాన్ని రద్దు చేసింది.ఈ నేపథ్యంలో ఆ అంశం సుప్రీంకోర్టుకు చేరుకుంది. సుప్రీంకోర్టు తాజాగా అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమైనది అంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2004 ఉత్తరప్రదేశ్ మదర్సా ఎడ్యుకేషన్ చట్టం సెక్యులర్ సూత్రాలకు విరుద్ధమని హైకోర్టు తప్పుపట్టిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ జెబి.పార్థివాలా, తరువాయి 12లో

ప్రజాపక్షం Telugu National Daily బుధవారం 06 నవంబరు, 2024

## చైనాలో మొదటిసారి మయన్మార్ నియంత పర్యటన



**బ్యాంకాక్ :** మయన్మార్ దేశాధికారాన్ని సైన్యం స్వాధీనం చేసుకున్న తర్వాత మొదటిసారిగా ఆ దేశ సైనిక నియంత మిన్ ఆంగ్ హ్లాయింగ్ చైనాలో పర్యటిస్తున్నారు. ఆ దేశాన్ని పాలిస్తున్న సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హ్లాయింగ్ మొదటిసారి పొరుగున ఉన్న చైనాకు మంగళవారంనాడు ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్లారు. ఆయన అక్కడ అనేక ప్రాంతీయ సమావేశాలలో పాల్గొంటారు. ఐతే ఆయనను పర్యటనకు ఆహ్వానించడంపై మయన్మార్ ప్రతిపక్ష నాయకుడు, ప్రజాస్వామ్య అనుకూల నాయకుడు క్యా జా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేషనల్ యూనిటీ ప్రభుత్వానికి ఆయన అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. మయన్మార్ ప్రజలు శాంతి, స్థిరత్వం, ఆర్థిక వృద్ధి కోరుకుంటున్నారని, కానీ సైనిక నియంత మిన్ ఆంగ్ హ్లాయింగ్ ముఠా దేశాన్ని అన్నివిధాలా నాశనం చేసిందని విమర్శించారు. ఈ విధమైన పర్యటన మయన్మార్ ప్రజలలో తప్పుడు అభిప్రాయం కలిగిస్తుందని విమర్శించారు. కాగా మిన్ ఆంగ్ హ్లాయింగ్ బుధవారంనాడు చైనా నగరం కున్మింగ్‌లో పర్యటిస్తారు. గురువారంనాడు మూడు శిఖరాగ్ర సదస్సులలో పాల్గొంటారు. కాంబోడియా, లావోస్, మయన్మార్, వియత్నాం దేశాల ఆర్థిక సహకార మండలి సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. మయన్మార్ సరిహద్దులకు 400 కి.మీ దూరంలో ఉన్న చైనా యున్నన్ రాష్ట్ర రాజధాని కున్మింగ్‌లో ఆయన ఈ సదస్సులలో పాల్గొంటారు. చైనా, మయన్మార్ మధ్య ఆర్థిక సహకారం, సంబంధాల వృద్ధి విషయాలపై చర్చలు జరుపుతారు. మయన్మార్ సైన్యానికి ప్రధానంగా చైనా, రష్యా దేశాలే ఆయుధాలు సరఫరా చేస్తున్నాయి. మయన్మార్‌లో అస్థిర రాజ్యమేలుతోందని చైనా ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో ఈ పర్యటన జరుగుతోంది. ఏడాదికాలంగా మయన్మార్ సైన్యం ప్రజా దళాల చేతుల్లో ఓటమి చవిచూస్తున్నది. 2021 ఫిబ్రవరిలో మయన్మార్‌లో ప్రజాప్రభుత్వాన్ని కూలదోసి సైన్యం అధికారాన్ని స్వాధీనం చేసుకుంది. ప్రజలు ఎన్నుకున్న నాయకురాలు ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని పాలించకుండా అడ్డుకుని ఆమెను గృహనిర్బంధం చేశారు. తర్వాత జైలులో నిర్బంధించారు. ఆమెపై అనేక ఆరోపణలు చేశారు. ఐతే సైనిక జుంటా ముఠా పాలనలో మయన్మార్ ప్రజలు తీవ్ర సమస్యలు, కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఏడాదికాలంగా ఆ దేశంలో ప్రజా దళాలకు, సైన్యానికిమధ్య పరస్పర దాడులు జరుగుతున్నాయి. పరిస్థితి అదుపుతప్పింది. లక్షలమంది ప్రజలు ఇళ్ళు వదిలి పారిపోయారు. భారత్‌కు వలసలు పెరిగాయి. ఈ విషయంపై ఇటీవల చైనా కూడా జోక్యం చేసుకుని ఒక సంధి సమావేశం నిర్వహించింది.

# సిరియా, లెబనాన్‌లలో హిజ్బొల్లాను నిర్మూలిస్తాం: ఐడిఎఫ్

### లెబనాన్‌లో మూడువేలు దాటిన మృతులు





**బీరూట్ :** గడచిన 13 నెలలుగా కొనసాగుతున్న యుద్ధంవల్ల లెబనాన్‌లో మరణాల సంఖ్య 3,000 దాటింది. గాయపడినవారి సంఖ్య 13,492 దాటింది. లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ మంగళవారంనాడు ఈ విషయం చెప్పింది. రెండు దశాబ్దాలక్రితం జరిగిన యుద్ధంలో ఇంతకంటే ఎక్కువమంది మరణించారు. ఇప్పట్లో ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం ఆగేట్టు కనిపించడంలేదు. ఎందుకంటే సరికొత్త లక్ష్యాలకు యుద్ధాన్ని విస్తరిస్తామని ఇజ్రాయెల్‌సైన్యం (ఐడిఎఫ్) తాజాగా ప్రకటించింది. లెబనాన్ అంతటా, సిరియాలో కొన్నిచోట్లా విస్తరించి ఉన్న హిజ్బొల్లా మౌలిక సదుపాయాలను ధ్వంసంచేయడమే లక్ష్యంగా ఇక యుద్ధం సాగుతుందని పేర్కొంది. ఇదిలా ఉండగా, హిజ్బొల్లా ఉగ్రవాదులు ఉత్తర ఇజ్రాయెల్‌లోకి వరుస రాకెట్ దాడులు కొనసాగిస్తున్నారు. హిజ్బొల్లా, హమాస్ సంస్థలు రెండూ ఇరాన్ సృష్టించినవే. ఇరాన్‌తో ఈ సంస్థలకు పూర్తి సంబంధాలున్నాయి. ఏడాదికాలంగా ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో యుద్ధం భీకరంగా సాగుతోంది. ఈ ఏడాది అక్టోబరు 23వ దక్షిణ, తూర్పు లెబనాన్ ప్రాంతాలలో, బీరూట్ దక్షిణ శివారు ప్రాంతాలలో ఇజ్రాయెల్ ఉద్ధృతంగా గగనతల దాడులు చేయడంతో యుద్ధం తీవ్రరూపం దాల్చింది. ఈ దాడుల్లో వందలసంఖ్యలో లెబనాన్ ప్రజలు మరణించారు. దీంతో 10.20 లక్షలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారంతా ఇళ్ళు వదిలి పారిపోయారు. ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీన ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్‌లో భూతల దాడులు ప్రారంభించింది. సరిహద్దు గ్రామాలలో దారుణమైన విధ్వంసం జరిగింది. హిజ్బొల్లా ఆయుధాలను ధ్వంసం చేశామని, సరిహద్దుల్లో ఉన్న కమాండ్ సెంటర్‌ను నాశనం చేశామని ఇజ్రాయెల్ కసైన్యం ప్రకటించింది. హిజ్బొల్లా నిర్మించిన టన్నెల్ వ్యవస్థను కూడా ధ్వంసం చేశామని ఐడిఎఫ్ పేర్కొంది. ఆదివారం ఐడిఎఫ్ దాడుల్లో 16 మంది మరణించారు. మరో 90 మంది గాయపడ్డారు. దీంతో మృతులసంఖ్య 3,002కు చేరింది. కాగా హిజ్బొల్లా చేసిన దాడులవల్ల ఇజ్రాయెల్‌లో 72 మంది మరణించారు. వీరిలో 30 మంది సైనికులున్నారని టెల్‌అవీవ్‌లో ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. హిజ్బొల్లా దాడులవల్ల సుమారు 60,000 మంది ప్రజలు తమ నివాసాలు వదిలి వెళ్ళిపోవాల్సి వచ్చిందని కూడా పేర్కొంది. అదేవిధంగా పాలస్తీనా కాందిశీకులకోసం పనిచేసే ఐక్యరాజ్యసమితి ఏజన్సీ యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ తో సంబంధాలు రద్దుచేసుకుని దాని కార్యకలాపాలు నిషేధిస్తున్నట్లు సోమవారంనాడు ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితితో గతంలో జరిగిన ఒప్పందాన్ని రద్దుచేసుకున్నట్లు ప్రకటించింది. గాజాలోకి ప్రవేశద్వారాలన్నింటిపైనా ఇజ్రాయెల్ నియంత్రణలో ఉన్నాయి. యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ద్వారా కేవలం 13 శాతం సహాయం మాత్రమే గాజాలోకి వస్తోందనీ, ఈ భాగాన్ని ఇతర సేవా సంస్థలు భర్తీచేయగలని ఇజ్రాయెల్ ప్రకటించింది.

**గాజాలో దాడులు : 70 మంది మృతి**

గాజాలో గడచిన 24 గంటల్లో జరిగిన దాడుల్లో కనీసం 70 మంది మరణించారు. మరో 86 మంది గాయపడ్డారు. ఉత్తరగాజాలోని కమల్ అద్వాన్ ఆసుపత్రికపై గాజా సైన్యం దాడులు చేసింది. రాత్రికిరాత్రి ఇజ్రాయెల్ సైన్యం ప్రారంభించిన దాడుల్లో 30 మంది పాలస్తీనియన్లు మరణించారు. మంగళవారం తెల్లవారేవరకూ ఈ దాడులు కొనసాగాయి. తెల్లవారుజామున దాడుల్లో గాజా స్ట్రిప్‌లో మరో పదిమంది మరణించారు. వీరిలో పిల్లలు, మహిళలు ఉన్నారు. ఉత్తరగాజా పట్టణం బెయిట్ లహియాలో కనీసం 20 మంది మరణించారు. వీరిలో ఎనిమిదిమంది మహిళలు, ఆరుగులు పిల్లలు ఉన్నారు.

## నైజీరియా పిల్లలకు ఉరిశిక్ష విచారణ తప్పింది

### 29 మంది విడుదలకు దేశాధ్యక్షుడు ఆదేశం



**అబుజా :** ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా అనేక నెలలుగా నైజీరియాలో జరుగుతున్న నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారనే ఆరోపణలపై అరెస్టుచేసిన 29 మంది పిల్లలను వెంటనే విడుదల చేయాలని నైజీరియా దేశాధ్యక్షుడు బోలా టినుబు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ పిల్లలను ఇప్పటికే అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. గతంలో లేని ఉరిశిక్షను ఇటీవల పునరుద్ధరించడంతో ఈ పిల్లలు కూడా ఉరిశిక్షను ఎదుర్కోవలసి వస్తుందని ప్రపంచవ్యాప్తంగా ఆందోళన చెలరేగడంతో నైజీరియా దేశాధ్యక్షుడు జోక్యం చేసుకుని తక్షణం ఈ 29 పిల్లలను విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. నైజీరియాలో గతంలో ఎన్నడూలేనివిధంగా ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయి. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. జీవన వ్యయాలు భరించలేనంతగా ఉన్నాయి. దీంతో ప్రజలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఈ ప్రదర్శనలలో నాలుగు నెలలక్రితం పిల్లలు కూడా పాల్గొనడంతో అనేకమందిని అరెస్టుచేయడంలో భాగంగా పిల్లలను కూడా అరెస్టు చేశారు. ఈ అరెస్టులు చేయడానికి బాధ్యులైన పోలీసులపై విచారణ జరపాలని కూడా దేశాధ్యక్షుడు ఆదేశించారు. గడచిన ఆగస్టు నెల నుండీ ఈ పిల్లలు జైలులో మగ్గుతున్నారు. వీరంతా 14 నుండి 17 ఏళ్ళ మధ్య వయసుగలవారే. ఐతే ఇంతకుముందు ఈ పిల్లలను విడుదల చేయడానికి స్థానిక న్యాయస్థానం అలవికాని ఆంక్షలు విధించింది. వారిని విడుదల చేయాలంటే 5,900 డాలర్లు పూచీకత్తుగా చెల్లించాలని షరతు విధించడంతో అందరిలో ఆందోళన పెరిగింది.

## బెలారస్‌లో ప్రతిపక్షం నామ్‌కే వాస్తే పోటీ

### ఎన్నికల సంఘం అనుమతి



**తల్లిన్ :** బెలారస్ అధ్యక్షపదవికి జరిగే ఎన్నికల్లో నామ్‌కే వాస్తే పోటీ ఇచ్చేందుకు ఆ దేశ ఎన్నికల సంఘం ప్రతిపక్షానికి చెందిన ఏడుగురు నాయకులకు అనుమతి ఇచ్చింది. ఐతే వీరంతా నియంతపాలన చేస్తున్న దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకోకు విధేయులే. నిర్ణీత ప్రకారం 2025 జనవరి 26న బెలారస్‌లో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయి. ఈ లెక్కన దేశంలో ఎన్నికల ప్రక్రియ నామమాత్రంగానే ఉంటుంది. తూర్పు యూరప్‌లో రష్యా, ఉక్రేన్ సరిహద్దుల్లో ఉన్న దేశం బెలారస్. ఈ దేశంలో 30 సంవత్సరాలుగా నియంత పరిపాలన జరుగుతోంది. మీడియాకు, ప్రతిపక్షానికి ఎలాంటి స్వేచ్ఛాలేదు. ఇంతకుముందు నాలుగున్నర సంవత్సరాల క్రితం 2020లో అధ్యక్ష పదవికి తూతూ మంత్రంగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలను ప్రతిపక్షం తిరస్కరించింది. నిరసన ప్రదర్శకులను ప్రభుత్వం అణచివేసింది. ఆ ఫలితంగా 65,000 మందిని ప్రభుత్వం అరెస్టుచేసి జైలులో ఉంచింది. ప్రధాన ప్రతిపక్ష నాయకులు ఈ అణచివేత భరించలేక దేశం వదలి పారిపోయారు. దేశంలో ఇప్పటివరకూ 1,300 మంది రాజకీయ ఖైదీలు ఉన్నారు. వీరిలో చాలా మందికి తగినంతగా వైద్యసదుపాయాలు అందుబాటులో లేవు. వారి కుటుంబాలతో సంబంధాలను కూడా జైలు అధికారులు తిరస్కరించారు.

## రాజ్యాంగ సవరణపై కోర్టుకెక్కిన పాక్ జడ్జీలు

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లో వివాదాస్పద రాజ్యాంగ సవరణపై విచారణ జరపాలని కోరుతూ ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తికి మంగళవారంనాడు విజ్ఞప్తి చేశారు. ఆ దేశ పార్లమెంటు ఇటీవల 26 వ రాజ్యాంగ సవరణను ఆమోదించింది. ఈ సవరణ ప్రకారం న్యాయవ్యవస్థపై పార్లమెంటరీ వ్యవస్థకు ఆధిపత్యం లభిస్తుంది. న్యాయమూర్తుల నియామకంపై రాజకీయ వ్యవస్థకే అధిపత్యం లభిస్తుంది. జస్టిస్ మన్సూర్ అలీ షా, జస్టిస్ మునిబ్ అఖ్తర్‌లు సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. వెంటనే ఈ రాజ్యాంగ సవరణపై విచారణ జరపాలని కోరారు. జస్టిస్ షా నిర్ణీత ప్రకారం సుప్రీంకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి కావాల్సి ఉంది. కానీ వివాదాస్పద సవరణ ద్వారా ఆయనను కాదని శాసనవ్యవస్థ ద్వారా మరొకరిని నియమించేందుకు వీలు కలిగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అఫ్రిదీ వెంటనే ఈ కేసు విచారణకు తేదీ నిర్ణయించాలని ఆ ఇద్దరు న్యాయమూర్తులూ అక్టోబరు 31న రాసిన ఒక లేఖలో కోరారు.

## క్యూబాకు హరికేన్ హెచ్చరిక

**శాన్‌జువాన్ :** కరీబియన్ సముద్రంలో తుఫాను ‘రఫాయెల్’ ఏర్పడింది. క్యూబాను ఈ తీవ్ర తుఫాను తాకనున్నది. జమైకా, కేమన్ దీవులలో ఈ తుఫానువల్ల భారీవర్షాలు కురుస్తాయి. ఈ వారంతంలో కూడా ఫ్లోరిడాలో, అమెరికా ఆగ్నేయ ప్రాంతాలో భారీవర్షాలు కురుస్తాయని మియామీలో ఉన్న అమెరికా జాతీయ తుఫాను హెచ్చరికల కేంద్రం తెలియజేసింది. ఈ తుఫానువల్ల జమైకాతోపాటు కేమన్ దీవులు క్యూబాలోని పినార్ డెల్ రియో, అర్టెమిసా, లా హబానా, మేయబ్‌క్యూ, మతన్‌జాస్‌లలో భారీగా వర్షాలు కురుస్తాయి.

## అమెరికాలో 9/11 తరహా కుట్ర

### కెన్యా జాతీయుడికి 20 ఏళ్ళ జైలు!

**న్యూయార్క్ :** అమెరికాలో 9/11 తరహా దాడులకు కుట్రచేశారన్న ఆరోపణలపై ఒక కెన్యా జాతీయుడిని ఆ దేశ న్యాయస్థానం విచారిస్తున్నది. వచ్చే ఏడాది మార్చి నెలలో ఈ కెనా జాతీయుడికి 20 సంవత్సరాలు జైలుశిక్ష అమలు చేసే అవకాశం ఉంది. మంగళవారంనాడు మన్‌హట్టన్‌లోని ఫెడరల్ జ్యూరీ కెన్యా జాతీయుడు ఛోలో అబ్ది అబ్దుల్లాను నేరస్తుడుగా ధృవీకరించింది. మొత్తం ఆరు ఆరోపణలపై అతడిని విచారణ చేశారు. ఎయిర్‌క్రాఫ్ట్ హైజాక్ చేశాడని కూడా అతడు ఆరోపణలు ఎదుర్కొన్నాడు. అబ్దుల్లా తన కేసును తనే వాదించుకున్నాడు. ఈ కేసు విచారణ గతవారంలో ప్రారంభమైంది. తాను ఈ దాడిలో పాల్గొనలేదని అతడు వాదించాడు. న్యాయవ్యవస్థపై అతగాడికి విశ్వాసం లేదని, అందువల్ల ఫలితాన్ని అతడు అనుభవించాల్సిందేననీ ప్రాసిక్యూషన్ పేర్కొంది.

నాలుగు సంవత్సరాలపాటు అబ్దుల్లా ఈ కుట్రకు రూపకల్పన చేశాడని ప్రాసిక్యూషన్ పేర్కొంది. పేలుడు పదార్థాలు చేయడంలో, సీక్రెట్ ఆపరేషన్ చేయడంలో బాగా శిక్షణ తీసుకున్నాడని పేర్కొంది.కమర్షియల్ పైలట్‌గా శిక్షణ పొందడానికి అబ్దుల్లా 2017లో ఫిలిప్పైన్‌కు కూడా వెళ్ళాడని పేర్కొంది.ఐతే స్థానికంగా చేసిన ఆరోపణలపై అతడిని 2019లో అరెస్టు చేసేనాటికి అబ్దుల్లా రెండేళ్ళ పైలట్ శిక్షణ కూడా పూర్తిచేశాడు.

## కెటిఆర్‌కు సెగ (మొదటి పేజీ తరువాయి)

గొంతు విప్పి మాట్లాడేందుకు.. మీ బాధ చెప్పడానికే ఇక్కడికి వచ్చా.. వేరే ఉద్దేశంతో ఇక్కడికి రాలేదు’’ అని అన్నారు. ‘తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ (జెఎసి) ఆధ్వర్యంలో హైదరాబాద్, ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మంగళవారం ‘మహాధర్నా’ జరిగింది. ఈ ధర్నాకు జెఎసి ఏ రాజకీయ పార్టీలనూ ఆహ్వానించలేదు. కేవలం ఆటో యూనియన్లకు చెందిన నాయకులు మాత్రమే హాజరయ్యారు. ఆహ్వానం లేకపోయినా కెటిఆర్ మహాధర్నాకు రావడంతో జెఎసి నాయకులు ఆయనకు మాట్లాడేందుకు అవకాశం కల్పించారు.

## గ్యాంగ్‌రేప్ (మొదటి పేజీ తరువాయి)

యువకుడిని పట్టుకోగా మరో ఇద్దరు పారిపోయారు. పట్టుబడిన యువకుడిని పోలీసులకు అప్పగించారు. జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పట్టుబడిన నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు. పారిపోయిన యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## చార్జీలు పెంచాలి (మొదటి పేజీ తరువాయి)

మాటిచ్చి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు చెల్లిస్తామన్న హామీని వెంటనే నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సు వల్ల ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 20వేల కొత్త ఆటో పర్మిట్లు ఇవ్వాలని, ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, యాక్సిడెంట్ బీమాను రూ.10లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బిఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకోలేదన్నారు.

గత పదేండ్లలో రోజుకు దాదాపు రూ.2 వేలు సంపాదించే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రూ.200 నుంచి రూ.300 కూడా రాని పరిస్థితి నెలకొన్నదని ఆటోడ్రైవర్లు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. దాదాపు ఆరున్నర లక్షల మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నదని ఆయన పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా సరే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతామని తెలిపారు. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ధర్నాలో సిహెచ్.జంగయ్య, ఎస్.అశోక్, ఎ.బిక్షపతి యాదవ్ (ఎఐటియుసి)తోపాటు వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## స్వాధీనం చేసుకోలేరు (మొదటి పేజీ తరువాయి)

జాతీయాకరణ జరుగుతోంది. ఇప్పుడు పెట్టుబడుల ఉపసంహరణ జరుగుతోంది. ప్రైవేటు పెట్టుబడులు అనేది ఓ పరివర్తన. అందువల్ల న్యాయస్థానం వ్యాఖ్యానం కొత్తగా ఉండాలి. ప్రస్తుత భారతదేశానికి అనుగుణంగా ఉండాలి. భవిష్యత్తును దష్టిలో ఉంచుకోవాలి’ అని ధర్మాసనం పేర్కొంది. తాజాగా ఈ వ్యాఖ్యలను పునరుద్ఘాటిస్తూ దీనిపై తీర్పు వెలువరించింది. అలాగే కోల్‌కతాలో పార్కు నిర్మాణం కోసమంటూ స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఓ వ్యక్తి ఆస్తిని స్వాధీనం చేసుకున్న కేసులోనూ సుప్రీం తీర్పునిస్తూ ‘చట్టప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ నష్టపరిహారం చెల్లించినా సరైన పద్ధతులు మాత్రం పాటించలేదు. వ్యక్తుల ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించినప్పటికీ రాజ్యాంగం తగిన రక్షణ కల్పించింది. నిర్బంధ స్వాధీనాలు, హడావుడి నిర్ణయాలు, న్యాయబద్ధంగాలేని పరిహారాల కారణంగా పౌరులు నష్టపోవడానికి చట్టం అనుమతించబోదు’ అని ధర్మాసనం తెలిపింది. ఆస్తి స్వాధీనం విషయాన్ని ముందుగా తెలియజేయడం, తగినంత సమయం ఇవ్వడం, అభ్యంతరాలు స్వీకరించడం, వాటిని పరిష్కరించడం, పునరావాసం కల్పించడం, ప్రజాప్రయోజనం కోసమేనని వివరించడం వంటివన్నీ ప్రభుత్వాలు చేయాల్సి ఉంటుందని స్పష్టంచేసింది.

## పేదలకు పంచాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

వినాయక్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నరసింహా, కార్యవర్గ సభ్యులు రవీంద్రచారి, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని, డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ 78 ఏళ్ల స్వతంత్ర్య భారతంలో ఇప్పటికీ పేదరికంపై మాట్లాడుకోవడానికి పాలకుల వైఫల్యాలే కారణమన్నారు. రాజ్యాంగంలో పౌరులకు ఉండటానికి ఇల్లు, తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టతోపాటు స్వేచ్ఛ, సమానత్వం, రక్షణ పొందే హక్కులు కల్పించబడ్డాయని, అయినా ఇప్పటికీ దేశంలో కోట్లాది మందికి కనీసం ఉండడానికి ఇళ్లు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో ఏ ఉద్యమం జరిగినా భూమి కేంద్రంగా జరిగిందన్నారు. నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సైతం భూమి కోసం, భుక్తి కోసమే జరిందని, కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే భూమి పంపిణీని ప్రభుత్వాలు తమ ఎజెండాలో చేర్చుకున్నాయని, ఇది ఎర్రజెండా విజయమన్నారు. ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు తమ పోరాటాల ద్వారా పేదలకు లక్షల ఎకరాల భూమి పంచుతున్న క్రమంలోనే ఈ ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకే గాంధేయవాది వినోబా బావే భూదాన ఉద్యమాన్ని ప్రారంభించారని, అయితే ఆ సేకరించిన ఆ భూములు నేటికీ పేదలకు చెందకపోవడం దుర్మార్గమన్నారు. కమ్యూస్టు పార్టీలన్ని ఐక్యమై బలమైన ఉద్యమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేస్తేనే భూదాన భూములు పేదలకు దక్కుతాయన్నారు. డాక్టర్ ఆవులప్ప మాట్లాడుతూ ఆచార్య వినోభా భావేతో కలిసి ఉద్యమంలో పాల్గొనడం చాలా సంతోషాన్నిచ్చిందని, కాని ఏ లక్ష్యం కోసమైతే ఈ ఉద్యమం జరిగిందో అది నేటికీ నెరవేరకపోవడం బాధకరమని అన్నారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సర్వ సేవా సంఘం ఆశయాలకు పాలకులు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూదాన భూములను చట్టప్రకారం పరిరక్షించి వాటిని తక్షణమే పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ.టి.నరసింహ మాట్లాడుతూ భూదాన భూములను ప్రభుత్వమే స్వయంగా పేదలకు పంచుతుందో లేదో తెల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ భూములు పేదలకు దక్కేవరకే ఎర్రజెండాలతో ఈ భూముల్లోనే ఉంటామన్నారు. ఇందుకు అవసరమైతే కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా జైళ్లకు వెళ్లేందుకు సిద్దమే తప్ప భూములను మాత్రం వదిలివెళ్లే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రవీంద్రచారి మాట్లాడుతూ భూదాన భూముల్లో సిపిఐ ఎర్రజెండాలను పాతి ఇప్పడే ఉద్యమాన్ని ఆరంభించిందని, ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ భూములను ప్రభుత్వం తక్షణమే పేదలకు పంచకపోతే, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న లక్ష ఎకరాల్లో గుడిసెలు, ఆ గుడిసెలకు ఎర్ర జెండాలు వెలుస్తాయన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేండ్ సమావేశంలో సిపిఐ జిల్లా హైదరాబాద్ సహాయ కార్యదర్శి స్టాలిన్, కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాస్తవమే (మొదటి పేజీ తరువాయి)

వివక్షత వల్ల ఎంత ఇబ్బంది ఉంటుందో అర్థం చేసుకోగలనని చెప్పారు. దేశం ఆర్థికంగా ఎదగాలంటే దానిని నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశంలో కుల వ్యవస్థ, కుల వివక్ష ఉందని అంగీకరిద్దాం. నేను దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానని ఆరోపణలు చేస్తున్నారు. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడమా అని ప్రశ్నించారు. కులగణన ద్వారా దళితులు, ఓబిసిలు, మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుందన్నారు. కుల గణన తర్వాత ఎవరి దగ్గర ఎంత ఆర్థిక వనరులున్నాయో తెలుసుకుందామన్నారు. కుల గణన కేవలం లెక్కల కోసమే కాదు భవిష్యత్‌లో దేశం అభివృద్ధి, రాజకీయంగా ఎలా ముందుకు వెళ్ళాలనేందుకు ఒక సాధనం లాంటిదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కుల గణన సర్వేపై తాను ఎంతో సంతోషిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మేధావులు, ప్రొఫెసర్లు కులగణనపై మాట్లాడి సూచనలు చేశారు. ప్రొఫెసర్లు చెప్పిన విషయాలను రాహుల్ గాంధీ స్వయంగా నోట్ చేసుకున్నారు.

**‘కులగణన’ ప్రశ్నలు నిర్ధారించేది సామాన్యులే**

కుల గణన సర్వేలో ఎటువంటి ప్రశ్నలు అడగాలనే విషయాన్ని సామాన్య ప్రజలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీలు, ఒబిసిలు నిర్ధారించాలని రాహుల్ గాంధీ అన్నారు. అధికార యంత్రాంగం చేపట్టే కులగణన తమకు అవసరం లేదని, కుల గణనకు సంబంధించిన ఎటువంటి ప్రశ్నలు అడగాలనే విషయాన్ని అధికార యంత్రాంగం నిర్ణయించొద్దని, అలా చేస్తే ప్రజలను అవమానించినట్టుగా ఉంటుందని రాహుల్ గాంధీ అన్నారు. ఇటీవల తాను ఒక ప్రపంచ ఆర్థిక నిపుణునితో మాట్లాడానని, ప్రపంచ వ్యాప్తంగా కేవలం ఒక భారతదేశంలోనే అధికంగా అసమానతలు ఉన్నాయని ఆయన తెలిపారిన రాహుల్ గాంధీ చెప్పారు. సమాజంలో ఒక వర్గాన్ని అంటరానివారిగా చూస్తున్నారంటేనే వివక్ష ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చన్నారు. కులగణను చేపట్టే క్రమంలో ఒక్కోసారి పొరపాట్లు జరుగొచ్చని, అయితే వాటిని సవరిస్తూ ముందుకెళ్తామన్నారు. జన గణనను తాను ఎక్స్‌రేగా పోలుస్తానని, గాయమైన వ్యక్తికి ఎక్స్‌రే లేకుండా ఏ వైద్యుడూ చికిత్స చేయలేరని రాహుల్ పేర్కొన్నారు. కొందరు వైద్యులు చెయ్యి విరిగిపోయినట్టుగా ఉన్నదని, కానీ ఎక్స్‌రే తీసుకోవాల్సిన అవరంలేదని చెబితే ఆ వైద్యునికి వైద్య రంగం పట్ల ప్రాథమిక అవగాహన కూడా లేనట్టుగా భావించాల్సి వస్తుందని రాహుల్ గాంధీ అన్నారు.

**కులగణనతో బిసిలకు రిజర్వేషన్లు అందిస్తాం: సిఎం రేవంత్‌రెడ్డి**

తెలంగాణ రాష్ట్రంలో కులగణనను ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుందని, సామాజిక బాధ్యత, సమాన అవకాశాలు ఇవ్వాలన్న ఆలోచనతోనే ప్రభుత్వం కుల గణన నిర్ణయం తీసుకుందని, బిసిలకు అందాల్సిన రిజర్వేషన్లు కులగణనతో అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సామాన్య ప్రజల నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్‌గాంధీ నేరుగా రాష్ట్రానికి రావడం గొప్ప విషయమని కొనియాడారు. కులగణన విషయంలో రాహుల్‌గాంధీకి ఇచ్చిన మాట నెరవేర్చడమే తమ కర్తవ్యమని అన్నారు. కుల గణన నిర్ణయం తీసుకోవాలంటే గుండె ధైర్యం కావాలని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 2025లో చేపట్టనున్న జనగణనలో కులగణనను కూడా పరిగణలోకి తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

**సర్వేలో సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వాములు చేయాలి : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మేధావుల సలహాలు, సూచనలు,రాహుల్ గాంధీ ఆలోచనలతో ‘కుల గణన సర్వే’ ద్వారా సమగ్ర సమాచారాన్ని సేకరిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రానుందని, ఇక్కడి నుంచే కులగణనను ప్రారంభిస్తామని రాహుల్ గాంధీ సాధారణ ఎన్నికల సభలో ప్రకటించిన విషయాన్ని భట్టి గుర్తు చేశారు. కులగణన సర్వేలో సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వాములు చేయాలని, అందుకు వారిని ఏ ప్రశ్నలు అడగాలి, ఈ సమాచారం సేకరించాలనే అంశాలపైన రాహుల్ గాంధీ, మేధావులు, సామాజికవేత్తలతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు.

## లండన్‌లో ప్రారంభమైన ప్రపంచ పర్యాటక ప్రదర్శన

### లండన్ టీ ఎక్స్ఛేంజ్ చైర్మన్‌తో భేటి అయిన మంత్రి జూపల్లి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** లండన్ వేదికగా ప్రారంభమైన ప్రపంచ పర్యాటక ప్రదర్శనలో పర్యాటక, సాంస్కృతి కశాఖమంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ని పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్శించేలా తెలంగాణ పర్యాటక అందాలు, చారిత్రక ప్రదేశాల ఛాయచిత్రాలను డిజిటల్ స్కీన్‌లో పర్యాటక శాఖ ప్రదర్శించింది. ఆవిర్భావిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం పర్యాటక రంగానికి మేలు చేసే అవకాశాలు థీమ్‌తో లండన్ వేదికగా ఎక్సెల్ హాల్స్‌లో జరుగుతున్న 44వ వరల్డ్ ట్రావెల్ మార్ట్ (ప్రపంచ పర్యాటక ప్రదర్శన)లో పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ పర్యాటక స్టాల్‌ను యూకేలో భారత హై కమీషనర్ విక్రమ్‌దురై, కేంద్ర పర్యాటక శాఖ డిజి ముగ్ధసిన్హా, గోవా పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖంటే, ఒడిషా డిప్యూటీ సిఎం ప్రవతి ఫరీదా, రామోజీ ఫిల్మ్ సిటీ ఎండీ విజయేశ్వరి, తదితరులు సందర్శించారు. తెలంగాణ టూరిజం ప్రమోషన్‌లో భాగంగా వివిధ దేశాల ప్రతినిధులు, కేంద్ర, ఆయా రాష్ట్రాల పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో మంత్రి జూపల్లి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రతిష్టాత్మక లండన్ టీ ఎక్స్ఛేంజ్ చైర్మన్ ఆల్యూర్ రెహమాన్‌తో మంత్రి జూపల్లి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పర్యాటక శాఖ అభివృద్ధిలో భాగంగా విదేశీ పెట్టుబడులు, హైదరాబాద్‌లో టీ ఎక్స్ఛేంజ్ ఔట్లెట్ ఏర్పాటు, లండన్ ఐ తరహాలో హైదరాబాద్ లో జాయింట్ వీల్ ఏర్పాటు చేయడం, తదితర అంశాల గురించి చర్చించారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. తెలంగాణలో టూరిజం అభివృద్ధికి, పర్యాటకులకు మౌలిక సదుపాయాల కల్పనకు సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో చేపడుతున్న కార్యక్రమాలను, తెలంగాణ పర్యాటక ప్రదేశాల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సియం రేవంత్ రెడ్డి పర్యాటక రంగపై ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రపంచ పర్యాటక రంగంపై తెలంగాణ పర్యాటకం తనదైన ప్రత్యేకతను చాటుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. లండన్ లో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతున్న వరల్ ట్రావెల్ మార్కెట్‌లో ప్రపంచ వ్యాప్తంగా 125 దేశాలు, భారత్ నుంచి 10 పైగా రాష్ట్రాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి.

## ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను మినహాయించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే’లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను మినహాయించాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సిఎం రేవంత్ రెడ్డికి మంగళవారం బహిరంగ లేఖ రాశారు. ‘సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే’లో 36,559 ఎస్‌జిటిలను 3414 మంది ప్రధానోపాధ్యాయులను భాగం చేస్తూ విద్యాశాఖ నిర్ణయించడం విద్య హక్కు చట్టం ఉల్లంఘన అని అన్నారు. కుటుంబ సర్వే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం టీచర్లను, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు.

విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరిత్యాలలో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబంధించిన విధులకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## 25 నుంచి పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)

మేరకు రాష్ట్రపతి 2024 సంవత్సర పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబరు 25నుంచి డిసెంబరు 20వరకు లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలో నిర్వహించాలన్న ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు’ అని మంత్రి రిజిజు చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటు చేసిన జాయింట్ కమిటీ నవంబరు 29న తన నివేదికను సమర్పించే అవకాశం ఉన్నదని వివరించారు. ఈ నిర్ణీత గడువులోగా వారు నివేదికను అందజేయవచ్చన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# శత వార్షికోత్సవాలు వాడవాడలా ఘనంగా జరుపుకోవాలి

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పిలుపు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : భారత కమ్యునిస్టు పార్టీ ఈ ఏడాది తో వంద సంవత్సరాలలో అడుగు పెడుతున్న సంధర్భంగా పార్టీ నాయకత్వం శత దినోత్సవ వార్షికోత్సవాలు వాడవాడలా ఘనంగా జరుపుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పిలుపు ఇచ్చారు. స్థానిక ఐఎంఏ సమావేశం మందిరంలో సిపిఐ పెద్దపల్లి జిల్లా సమితి సమావేశం కామ్రేడ్ గౌతం గోవర్ధన్ అధ్యక్షతన జరుగగా ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్ ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడుతూ పేద ప్రజల పోరాట పోరు పతాక కష్ట జీవులకు అండ సిపిఐ పార్టీ అని వచ్చే డిసెంబర్ 26న సిపిఐ వంద వ సంవత్సములో అడుగు పెడుతున్న సంధర్భంగా పండగల జరగాలని అన్నారు. భారత దేశం లో జమిలి ఎన్నికలు తీసుకురావడం తో పాటు కులాల మధ్య చిచ్చు పెడ్తూ ప్రధాని పాలన కొన సాగిస్తున్నాడని అన్నారు. ఒక్కొక రాష్ట్రం లో ఒక్కో ఎన్నికల విధానం ఉన్నప్పుడు జామిలి ఎన్నికలు ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. అధ్యక్ష తరహా ఎన్నికల ద్వారా అన్ని రాష్ట్రాలను తమ చెప్పు చేతల్లోకి తీసుకుందామని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఉప చట్టం పేరిట తప్పుడు కేసు లు పెట్టి ప్రశ్నించే గొంతు లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ సాయి బాబా మరణం ముమ్మాటికీ రాజ్య హత్యే అని అన్నారు. దేశం లో రోజురోజుకి నిత్యావాసారాల ధరలను పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా సమితి సమావేశం లో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సహాయ కార్యదర్శి గోసిక మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కే. కనకారాజ్, తాళ్లపెల్లి మల్లయ్య, కదరి సునీల్, ఓదెమ్మ, కొడం స్వామి జిల్లా సమితి సభ్యులు అసాల రమ, చంద్రగిరి ఉదయ్, ఇనుముల రాజమౌళి, రాజా రత్నం, గట్టయ్య, అరేపల్లి మానస్ కుమార్, మార్కపురి సూర్య, రేణుకుంట్ల ప్రీతమ్ పాల్గొన్నారు.




### కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా

# 26న దేశవ్యాప్త నిరసనలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల పిలుపునిచ్చారు.

మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్ పశ్యపద్మ అధ్యక్షతన నిరసన కార్యక్రమం సన్నాహక సమావేశంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ఎస్.బాల్‌రాజు(ఏఐటియుసి), కె. కాంతయ్య(బికెఎంయు), పాలడుగు భాస్కర్( సిఐటియు), విజయ్ కుమార్(ఐఎన్‌టియుసి), వేములపల్లి వెంకట్రామయ్య(ఐఎఫ్‌టియు), సూర్యం(టియుసిఐ),శ్రీనివాస్(ఐఎఫ్‌టియు), టి.సాగర్(సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్),విస్సా కిరణ్ కుమార్ ( రైతు స్వరాజ్య వేదిక), డి.అంజద్ (హెచ్ఎంఎస్ యం) పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 75 సంవత్సరాల కాలంలో హిందుత్వ ఎజెండాతో అధికారానికి వచ్చిన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారస్తుల కొమ్ము కాస్తూ వారికి మేలు చేసేందుకు బిజెపి ప్రభుత్వం నోట్ల రద్దు చేసి నెలల తరబడి ప్రజలు తిండికోసం తిప్పలు పడేలా చేసిందన్నారు. ఇంతా చేసిన ప్రధాన మంత్రి మోదీ నల్ల ధనాన్ని ఒక్క రూపాయి కూడా వెలికితీయకపోగా ప్రజలపై కోట్లాది రూపాయల ఆర్థిక భారాన్ని మోపి దేశ స్వాతంత్య్రాన్ని వెనుకకు నెట్టిన చరిత్ర బిజెపిదన్నారు. అంతేకాకుండా అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలలో 29 చట్టాలను సమూలంగా సవరించి 4 కోడ్లు తెచ్చి, కార్మికుల హక్కులను కాలరాయటాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే దేశంలో 27సార్లు దేశవ్యాపితంగా సమ్మెలు చేసి 30 కోట్ల మంది కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నా కేంద్ర ప్రభుత్వం దున్నపోతుపై వర్షం పడ్డట్లుగా వ్యవహరిస్తుందని వారు విమర్శించారు. దేశంలో కోట్లాది మంది రైతులు తమ పొలాలలో పంట పండిరచుకునే హక్కును కాలరాస్తూ, పంటకు గిట్టుబాటు ధర పొందే హక్కు లేకుండా కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పగిస్తూ రైతు వ్యతిరేక 3 నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీ నడివీధిలో సంవత్సరంన్నరం పాటు నిరంతరాయంగా ఆందోళన కార్యక్రమాలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ, కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాపితంగా వివిధ కార్యక్రమాలను చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందని, ఇందులో భాగంగా నవంబర్ 26న దేశవ్యాపితంగా కేంద్ర ప్రభు త్వ కార్మిక రైతు వ్యవసాయ కూలీలకు జరుగుతున్న అన్యాయాలపై కేంద్ర కార్మిక సంఘాల పిలుపును విజయవంతం చేయాలని నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. ఇందులో భాగంగా ఈనెల 18న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల నుండి రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఈ నెల 15న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు, నిర్వహించడంతో పాటు 20 నుండి 25వ తేదీ వరకు ఆటో, ద్విచక్ర వాహనాల ర్యాలీల ద్వారా ప్రచారం చేస్తూ అందరిని నిరసన కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని సమావేశం కోరింది. ఈ సమావేశంలో పి.ప్రేంపావని, ఓరుగంటి యాదయ్య (ఏఐటియుసి), ఎస్.ఎల్.పద్మ (టియుసిఐ), పెద్దారపు రమేష్ (ఏఐకెఎఫ్), జక్కుల నర్సింహ్మా (ఏఐకెకెఎస్), జి.గోపాల్ (తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), కె.ఈశ్వర్ రావు (సిఐటియు), బి.సత్యనారాయణ (ఐఎఫ్టియు), భూమన్న (ఐఎఫ్టియు), ఆకుల పాపయ్య, వి.కోటేశ్వర రావు, ఎం.వెంకన్న (ఏఐకెఎంఎస్), వి.ప్రభాకర్ (ఏఐపికెఎస్), ఆర్.వెంకట్రాములు, బి.ప్రసాద్, (తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం), వంగూరి రాములు (సిఐటియు), టి.అనిల్ కుమార్ (ఏఐసిటియు) తదితరులు పాల్గొని ప్రసంగించారు.




# మతోన్మాదం కట్టడికి ఉద్యమిద్దాం

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ పిలుపు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: దేశంలో చెలరేగిపోతున్న మతోన్మాదం, మనువాదాన్ని కట్టడి చేసేందుకు దేశవ్యాప్తంగా వామపక్షాలు, ప్రజా తంత్ర శక్తులు ఐక్యంగా ఉద్యమిద్దామంటూ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి అధ్యక్షతన నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన బాలమల్లేష్ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం, లౌకిక వాదం ప్రమాదంలో పడిందని వీటి పరిరక్షణకు మరింత సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం తీసుకుంటున్న తిరోగమణ చర్యలతో దేశ అభివృద్ధి కుంటుపడడమేకాకుండా మరో వైపు మతోన్మాదం, మనువాదం పెరిగిపోయిందన్నారు. మోదీ విధానాల కారణంగా దేశంలో సంపన్నుల సంపద అంతకు అంతా పెరిగిపోతుంటే పేదలు మరింత పేదరికంలో నెట్టి వేయబడుతున్నరన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి డి.జి.సాయిలు గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్.దశరథ్,ఆర్.కృష్ణమూర్తి, జె.లక్ష్మి , టి.శంకర్, రచ్చ కిషన్, శంకర్‌రావు, ధర్మేంద్ర, స్వామి, సిపిఐ మండల కార్యదర్శులు కె.సహదేవ్, టి.యాదయ్య, పి.శ్రీనివాస్, సీనియర్ నాయకులు వి.బాల్‌రాజు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులుసల్మాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

**25 నుంచి 30వరకు జనసేవాదళ్ క్యాంప్‌లు :** మతోన్మాద భావజాలం, ప్రజాస్వామిక విలువలు కాపాడడంతోపాటు ఆపద సమయాల్లో పేద ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్న జన సేవాదళ్ శిక్షణ శిబిరాన్ని ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు కీసర మండలంలోని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌ను విజయవంతం కోసం అందరూ సహకారించాలని ఈ సందర్భంగా బాలమల్లేష్ కోరారు.

# ఫుడ్‌పాయిజన్ హాస్టల్ భోజనం వల్ల కాదు..

## విద్యార్థులు తెచ్చుకున్న ఆహారం వల్లే : మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: వాంకిడి గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో చోటుచేసుకున్న ఫుడ్‌ఫైజన్ హాస్టల్ భోజనం వల్ల కాలేదని, విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న తినుబండారాలు తినడం వల్లనే చోటుచేసుకుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నా రు. ఏదో సాకు దొరికిందని బిఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వంపై బురద జల్లడం తగదన్నారు. హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు మహాలక్ష్మి, జ్యోతి, శైలజలను కొండా సురేఖ మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధవహిస్తుందని భరోసా నిచ్చారు. వారిని ఓదార్చారు. విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని నిమ్స్ డైరక్టర్ బీరప్ప, హెడ్ ఆఫ్ ది డిపార్ట్ మెంట్, నెఫ్రాలజీ గంగాధర్ లు మంత్రి గారికి సునిశితంగా వివరించారు. వారికి అందిస్తున్న చికిత్స వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.



పేషెంట్ల కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా వసతి, భోజన సదుపాయాలను కల్పించాలని నిమ్స్ డైరక్టర్ కు మంత్రి సురేఖ సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం స్థిమితపడుతుండగా, మరొక విద్యార్థికి ఇంటెన్సివ్ చికిత్సను అందిస్తున్నారని మంత్రి తెలిపారు. హాస్టల్ ఆహారాన్ని తిన్న సిబ్బంది ఆరోగ్య పరిస్థితి బాగానే వున్నట్లు అధికారులు తెలిపినట్లు మంత్రి సురేఖ వివరించారు. ఏదేమైనప్పటికీ పరీక్షకు పంపిన ఆహారపదార్థాల రిపోర్టులు వచ్చాక ఈ సంఘటనకు బాధ్యులు అధికారులని తేలితే వారి పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని మంత్రి సురేఖ తేల్చి చెప్పారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్‌రావు ఏదో సాకు దొరికింది కదా అని ప్రభుత్వం పై బురదజల్లేలా మాట్లాడారని మంత్రి అన్నారు. వాస్తవావస్తవాలు తెలుసుకోకుండా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హాస్టళ్ళ నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. విద్యారంగ బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలతో కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తున్నదని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి ఒక్కటి చొప్పున ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళ ఏర్పాటులో ఎంతో నిబద్ధతతో ముందుకు వెళుతున్నారని మంత్రి అన్నారు. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమ రంగాల పై కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎంతో కచ్చితమైన ప్రణాళికతో పనిచేస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, అర్థరహితంగా ప్రభుత్వం పై బురద జల్లడమే పనిగా పెట్టుకోవద్దని సూచించారు.

# '2050-విజన్'తో మాస్టర్ ప్లాన్ సిద్ధం

## వరంగల్ అభివృద్ధిపై విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: గొప్ప చారిత్రిక నేపథ్యం ఉన్న వరంగల్ నగర అభివృద్ధికి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050 జనాభాను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకుందని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేస్తారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలు, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వివిధ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళి టెంపుల్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, ఎకో టూరిజం తదితర అంశాలపై సమావేశం లో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో వరంగల్ నగర అభివృద్ధిపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కొలి క్కి తీసుకువచ్చిందని అన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 41 కిలో మీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని మొదటి దశలో 20 కిలో మీటర్లు, రెండవ దశలో 11 కిలోమీటర్లు, మూడవ దశలో 9 కిలోమీటర్లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా ఎయిర్‌పోర్ట్ లేదని, వరంగల్ జిల్లాలో ఎయిర్ పోర్ట్ రానుందని, వీలైనంత త్వరగా ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 382 ఎకరాల పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని, ఇందుకు సంబంధించిన పనులను ఈనెల 6వ తేదీ నుంచే మొదలు పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చెరువును ఖాళీ చేయాలని అధికారులకు సూచించారు. మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కంపెనీలు తప్పనిసరిగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, ఎంఎల్‌ఎలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, నాయిని రాజేందర్, ఎంఎల్‌ఎసి బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, సిఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ఎంఎయుడి ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సత్యశారద, పి.ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.

# సిసిఐ సెంటర్లలో రైతులు పత్తి విక్రయం

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు



ప్రజాపక్షం / హైదరాబాద్: పత్తి రైతులకు భారం కాకుండా పత్తి కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని మార్కెటింగ్ అధికారులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతులందరూ పత్తిని సిసిఐ నిబంధనల ప్రకారం అధిక మద్దతు ధర వచ్చేవిధంగా సిసిఐ సెంటర్లలోనే విక్రయించాలని, ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు అని, రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్న వాట్సాప్ చాట్ యాప్ ద్వారా తెలియజేయాలని రైతులకు మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లపై మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌తోమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.82.44 కోట్ల విలువైన 11,255 టన్నుల పత్తిని 5,251 మంది రైతుల నుండి కొనుగోలు చేయగా, గత సంవత్సరంలో ఇదే సమయానికి కేవలం రూ.3.91 కోట్లతో 560.37 టన్నుల పత్తిని 233 మంది రైతుల నుండి మాత్రమే కొనుగోలు చేశారని వివరించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రతి ఒక్క జిన్నింగ్ మిల్లు పూర్తి స్థాయి సిబ్బందితో పనిచేయాలని, మిల్లులలో ఎంత సమయం వేచిఉండాలో తెలుసుకునే విధంగా యాప్ ను రూపొందించారన్నారు. ఈ యాప్‌ను పూర్తిస్థాయిలో రైతులు ఉపయోగించుకుని రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సులభంగా పత్తిని అధిక మద్దతు ధరకు సిసిఐ సెంటర్లలోనే విక్రయించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, మార్కెటింగ్ అధికారులు విధిగా పర్యవేక్షించాలని, వాట్సాప్ (8897281111) ద్వారా వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదును మార్కెటింగ్ శాఖ సంచాలకులు పరిశీలించి, తిరిగి ఫోన్ ద్వారా రైతుల ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. నేటి వరకు 188 ఫిర్యాదులను స్వీకరించగా, 157 ఫిర్యాదులను పరిష్కరించినట్టు తెలిపారు. ఈ సమయానికి సిసిఐ ఇంతకుముందెన్నడూ లేనంతగా ఎక్కువ పత్తిని కొనుగోలు చేశామని, రానున్న రోజులలో రైతులందరూ పత్తిని ఆరబెట్టుకుని, సిసిఐ నిబంధనలను అనుసరించి తేమ శాతం 8 నుండి 12 శాతం ఉండే విధంగా చూసుకుని, అధిక మద్దతు ధర పొందాలని మంత్రి సూచించారు. ప్రతిపక్ష నాయకులు కోరుతున్నట్టు మార్కెట్ యార్డులలో గనుక కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేసినట్టయితే, రైతులు లూస్ కాటన్ ను మాత్రమే తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఒక వేళ రైతులు గన్ని బస్తాలలో పత్తిని తెచ్చినా కూడా సిసిఐ నిబంధనల ప్రకారం పత్తిని కొనుగోలు చేయబోరని, సంచులలో కొనుగోలు వల్ల పత్తి పాడయ్యే అవకాశం ఉంటుందన్నారు. సిసిఐ కొనుగోళ్లలో రైతులకు సంచి ధర చెల్లింపు చేయదని, ఒక వేళ రైతులు మార్కెట్ యార్డుకు లూస్ కాటన్ తెచ్చిన కూడా మార్కెట్ యార్డు నుండి జిన్నింగ్ మిల్లులకు వెళ్లే రవాణా ఖర్చుతో పాటు మార్కెట్ లో లోడింగ్, అన్ లోడింగ్ ఖర్చులు కూడా రైతులపైనే పడుతాయన్నారు. ఈ భారం రైతులకు ఉండకూడదనే మార్కెట్ యార్డులకు సమీపంలో ఉన్న, సిసిఐ నోటిఫై చేసిన ప్రతి ఒక్క జిన్నింగ్ మిల్లు పనిచేయాలని ఆదేశించారు.



# హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

## టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు. టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్‌లకు జెఎసి నాయకులు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి జెఎసి నేతలు వినతిపత్రం అందచేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేసిన వారిలో ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి, కోకన్వీనర్ సుద్దాల సురేష్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో టిజిఎస్ ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 మాసాలు గడిచినా ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని నెరవేర్చకపోవడంతో కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి భారం పడని ట్రేడ్ యూనియన్‌ల పునరుద్ధరణ అంశాన్ని కూడా ఎందుకు పరిష్కరించడం లేదో అర్థం కానీ అంశంగా మారిందని అసహనం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇవ్వవలసిన సొమ్ము కూడా ప్రభుత్వం సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కొత్త బస్సుల కొనుగోలు విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తూ, ఎలక్ట్రికల్ బస్సుల ను ప్రవేశపెట్టి ప్రైవేటీకరణ వైపునకు ఆర్‌టిసి తీసుకువెళుతున్నదని ఈదురు వెంకన్న విమర్శించారు. 2021 వేతన సవరణ గడువు ముగిసి 3 సంవత్సరాలు గడిచినా ప్రభుత్వం కానీ యాజమాన్యం కానీ దాని ఊసే ఎత్తడం లేదన్నారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌లో చేసే నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదిక న జరపాలని కోరారు. 2017 వేతన సవరణ బకాయిలు వెంటనే చెల్లించి, అలవెన్సులను పెంచాల్సి ఉన్నదని వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి అన్నారు. జి.ఓ నెంబర్ 30 ప్రకారం నియామక వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంపు విధానాన్ని టిజిఎస్ ఆర్‌టిసిలో వర్తింప చేయాలన్నారు. అన్ని ఖాళీలను భర్తీ చేసి, కార్మికులపై పనిభారాలు తగ్గించాలని కోకన్వీనర్ సుద్దాల సురేష్ అన్నారు. ప్రధానమైన డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌లకు అందచేశామన్నారు. ప్రభుత్వ స్పందనను బట్టి జెఎసి కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్. కమలాకర్ గౌడ్, ఎం.డి. అహ్మద్ అలీ, వి.రాములు, ఆర్.ఎన్.రెడ్డి, బి. ధనుంజయ్, ఎం. ఐలయ్య, సి.కె. రెడ్డి, ఎం.రాఘవయ్య, బి.మల్లయ్య, సి. నరేష్ గౌడ్, ఆంటోని, స్వామి, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగులో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అభినందన

* రూ.10కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు
* మంత్రి తుమ్మలకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అభినందనలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ప్రభుత్వ కృషికి కేంద్ర ప్రభుత్వం అభినందించింది. రాష్ట్ర ప్రభుత్వం 64,040 హెక్టార్లలో ఆయిల్ పాం ప్లాంటేషన్ అత్యున్నత ప్రగతి సాధించడం ద్వారా జాతీయ స్థాయిలో లక్ష్యాన్ని చేరుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అభినందనలు తెలియజేశారు. అంతేకాకుండా రాష్ట్ర పామాయిల్ రైతుల సంక్షేమ ం కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి రాసిన లేఖకు స్పందిస్తూ కేంద్రప్రభుత్వం ప్రైవేట్ భాగస్వామ్యంతో సహజ, సేంద్రియ వ్యవసాయం కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సుముఖం వ్యక్తం చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి సమాచారం అందించారు. ఎన్ఎమ్ఈఒపి పథకంలో భాగంగా 2024 25 సంవత్సరానికి గానుర లక్షా ఎకరాలకు ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇందులో ఇప్పటికే 24,581 ఎకరాలలో ప్లాంటేషన్ పూర్తిచేసింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల సమర్థ నాయకత్వంలో కొత్తగా పామాయిల్ సాగు చేయడానికి ముందుకువస్తున్న రైతులను ప్రోత్సహిస్తుండడంతో తెలంగాణ ప్రభుత్వం తప్పకుండా తమ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటుందని కేంద్ర మంత్రి ఆశాభావం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కేంద్ర వ్యవసాయశాఖ అధికారుల బృందం త్వరలో రాష్ట్రంలో పర్యటించనుంది. రాష్ట్రంలో పామాయిల్ గెలల ధరల విధానాన్ని ఈ బృందం పరిశీలించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, పామాయిల్ రైతులతో సంప్రదింపులు జరుపనుందని కేంద్ర మంత్రివెల్లడించారు.

**రాష్ట్ర వ్యవసాయమంత్రి కృషితో పెరిగిన పామాయిల్ గెలల ధరలు :**
వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో పామాయిల్ గెలల ధరలు భారీగా పెరిగాయి. దీంతో రాష్ట్ర ఆయిల పామ్ సాగు రైతులు లాభాల బాట పట్టే అవకాశం ఏర్పడింది. అక్టోబర్ నెలలో క్రూడ్ పామాయిల్ ధరలు రూ.1.19 లక్షలు చేరి పామాయిల్ గెలల ప్రస్తుత ధర రూ. 19,144లు పలికింది. ఈ నవంబర్ నెలలో క్రూడ్ పామాయిల్ ధర అంతర్జాతీయ మార్కెట్లో రూ.1.25లక్షలుగా నమోదైంది. దీంతో క్రూడ్ పామాయిల్ ధరలు ఇదేవిధంగా కొనసాగితే పామాయిల్ గెలల ధర రూ.20 వేలకు పైన ఉండే అవకాశం ఉండనుంది మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం క్రూడ్ పామాయిల్ ధరలను రూ. 1,25,000 తగ్గకుండా ఉండేందుకు దిగుమతి సుంకాన్ని పెంచుతూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, గతంలో దిగుమతి సుంకం 44 శాతం గా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల గుర్తుచేశారు.పెరిగిన ధరల నేపథ్యంలో రాష్ట్రంలో చాలా మంది రైతులు పామాయిల్ సాగు వైపు చూసే అవకాశం ఉందని, కావునా ఆయిల్ పాం కంపెనీలు ఇందు కోసం సన్నద్ధం కావాలని మంత్రిగారు కోరారు. సాగు చేయాలనుకునే రైతులకోసం పామాయిల్ మొక్కలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పామాయిల్ రైతుల సంక్షేమం, ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎళ్లవేలలా కృషి చేస్తుందన్నారు.

**భద్రాద్రి కొత్తగూడం జిల్లాలో రూ.10కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు :**
సహజ, సేంద్రీయ వ్యవసాయం కోసం భద్రాద్రి కొత్తగూడం జిల్లాలో రూ.10కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించి 2024 అగస్టు 18న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి లేఖ రాయడంతో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఎన్ఎమ్ఈఒపి పథకంలో భాగంగా సహజ, సేంద్రీయ వ్యవసాయం కొరకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సులను ప్రమోట్ చేయనుంది. నిర్దేశించిన విధానాల ప్రకారం ద్వైపాక్షిక సహాకారంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మంజూరు చేసింది. అందుబాటులో ఉన్న నూతన, అత్యాధునికి సాంకేతికతను అందించడానికి ప్రైవేట్ వ్యవస్థాపకులకు వారి స్వంత నిధులతో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులను ఇచ్చింది. ఎంఐడిహెచ్ నిబంధనల ప్రకారం ఈ కేంద్రాలలో ఉద్యాన వన పంటలు చేపట్టే రైతులకు శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సహాయ సహకారాలు అందించనున్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: హైదరాబాద్**

డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్ఎంసి, హెచ్‌సియు బస్ డిపో పక్కన, శేరిలింగంపల్లి, హైదరాబాద్.

నోటీసు నెం. /DD/UB/SLPZ/GHMC/2024 కొటేషన ప్రకటన తేది: 04.11.2024

జిహెచ్ఎంసిలోని శేరిలింగంపల్లి జోన్‌లోని వివిధ పచ్చదనం పనుల అభివృద్ధి కోసం మొక్కల ధరల కోసం సీల్డ్ కొటేషన్లను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆహ్వానిస్తుంది. వీటిని జిహెచ్ఎంసి, శేరిలింగంపల్లి జోన్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో స్వీకరించవచ్చు.

| ఈవెంట్స్ | తేదీలు |
|---|---|
| కొటేషన్ సమర్పణ ప్రారంభ తేదీ | 05.11.2024 ఉదయం 10.30 గంటల నుండి |
| కొటేషన్లు సమర్పించడానికి చివరి తేదీ | 08.11.2024 మధ్యాహ్నం 01.00 గంటల వరకు |
| ధర బిడ్ ప్రారంభ తేదీ | 08.11.2024 మధ్యాహ్నం 02.00 గంటల నుండి |

వివరాల కోసం డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్ఎంసి కార్యాలయ వేళల్లో ఏదైనా పని రోజున +91 9398036791 నంబర్లో సంప్రదించవచ్చు. **సంబంధిత కార్యాలయ చిరునామా:** డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, యుబిడి, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్ఎంసి, మండల రెవెన్యూ కార్యాలయం దగ్గర, హెచ్‌సియు బస్ డిపో పక్కన, శేరిలింగంపల్లి, హైదరాబాద్ - 500 019

సం/- డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6244-PP/CL/ADVT/1/2024-25, Date: 05-11-2024

ఫోకస్

# మహిళ

## కదంతొక్కిన మహిళాలోకం..



గిగ్ వర్కర్లతోనూ వెట్టి చాకిరీ చేయించుకోవడం ఆనవాయితీగా మారింది. బుకింగ్స్‌పై పనిచేసేవారిని గిగ్ వర్కర్లుగా పేర్కొంటున్నారు. స్టాండప్ కమెడియన్ల నుంచి రచయితల వరకూ... డెలివరీ బాయిస్ నుంచి కార్యాలయాల్లో సహాయకుల వరకూ.. అంతటా గిగ్ వర్కర్ల ప్రాతినిథ్యం, వారి ప్రాధాన్యం పెరుగుతున్నాయి. కానీ, వారికి తగినంత విశ్రాంతిగానీ, కష్టానికి తగిన ప్రతిఫలంగానీ లభించడం లేదు. మన దేశంలో దాదాపు 1.5 కోట్ల మంది గిగ్ వర్కర్లు ఉన్నారని అంచనా. షార్ట్‌టెర్మ్, మిడ్ టెర్మ్‌లలో కొంచెం తక్కువగానూ, లాంగ్‌టర్మ్ ఒప్పందాల కింద ఎక్కువగానూ గిగ్ వర్కర్లు పనులు చేస్తున్నారు. గిగ్ వర్కర్లు కూడా తమ ఆదాయంపై పన్ను కట్టాలని ఆదాయపన్ను శాఖ నిపుణులు అంటున్నారు. పన్నుల నుంచి వీరికి మినహాయింపు ఇవ్వకపోవడమే ఇందుకు కారణం. వైద్యులు, న్యాయవాదులు కూడా గిగ్ వర్కర్ల కోవకే చెందుతారు. కానీ, స్విగ్గీ లేదా జొమాటో వంటి సంస్థల్లో పని చేసే డెలివరీ బాయిస్‌ను వారితో పోల్చడానికి వీల్లేదు. గిగ్ వర్కర్ల పరిధిని ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రస్తుతానికి ఖర్చులను చూపించిన తర్వాత, గిగ్ కార్మికులు పెట్టుబడి లేదా ఖర్చు చేయడం ద్వారా రూ. 1.50 లక్షల వరకు ఆదాయంపై ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 సి కింద పన్ను ప్రయోజనాలను కూడా పొందవచ్చు. దీని తరువాత మిగిలిన ఆదాయపు పన్ను.. పన్ను విధించదగిన ఆదాయం వర్గంలోకి వస్తుంది. దీనిపై స్లాబ్ ప్రకారం పన్ను విధిస్తారు. అంటే 5 లక్షల వరకు ఆదాయాన్ని వృత్తిపై చేసే ఖర్చులతో భర్తీ చేయవచ్చు. ఆపై ఆదాయపు పన్ను శ్లాబ్ను బట్టి గరిష్ఠంగా 30 శాతం వరకు ఉంటుంది. ఇక వీరికి సమయాసమయాలుగానీ, పండుగలు, పర్వదినాలుగానీ ఏవీ ఉండకుండా, నిరంతరం పనులు సేవలు అదించడమే బాధ్యతగా మారింది. ఈ శ్రమ దోపిడీని చాలా మంది గిగ్ వర్కర్లు నిరసిస్తున్నారు. అందుకే, దీపావళి రోజు దేశ వ్యాప్తంగా అత్యధిక శాతం మంది గిగ్ కార్మికులు తమతమ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేయడం ద్వారా పని చేయడానికి నిరాకరించారు. తమ ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి సమ్మె బాట పట్టక తప్పలేదని వారు అంటున్నారు. గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీసెస్ వర్కర్స్ యూనియన్ (జిఐపిఎస్‌డబ్ల్యుయు), మహిళల నేతృత్వంలోని గిల్ వర్కర్స్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కూడా డిజిటల్ సమ్మెను నిర్వహించింది. ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా పని చేస్తారని ఆశించే దోపిడీ ప్లాట్‌ఫామ్ కంపెనీలకు తగిన సమాధానం ఇచ్చింది. అత్యధిక సంఖ్యలో మహిళా గిగ్ వర్కర్లు ఈ సమ్మెలో పాల్గొనడం గమనార్హం. దేశంలో చాలా మంది గిగ్ వర్కర్లు అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్లాట్‌ఫామ్ కంపెనీలు ముందుగా సూచించిన మొత్తాల కంటే తక్కువ చెల్లింపులు జరుపుతూ శ్రమ దోపిడీకి పాల్పడడం ఆనవాయితీగా మారింది. తక్కువ వేతనాలు.. ఎక్కువ పనిగంటలతో గిగ్ వర్కర్లు, ప్రత్యేకించి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి నుంచి ప్లాట్‌ఫామ్ కంపెనీలు వసూలు చేస్తున్న కమీషన్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ ప్లాట్‌ఫామ్ కంపెనీలను నియంత్రీకరించడానికి కార్మిక చట్టాలు దాదాపుగా లేవు. కార్మికులకు కాకుండా, ప్లాట్‌ఫామ్ కంపెనీల ప్రయోజనాలకు అనువుగా ఉండే నిబంధనలు కోకొల్లలు. అందుకే సమగ్ర చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని గిగ్ వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. మహిళా వర్కర్లకు కనీస జీవన వేతనాలు, ప్రసూతి ప్రయోజనాలు, రుతుక్రమ సెలవులు, ఫిర్యాదుల పరిష్కారం వంటి నిర్దిష్టమైన ఆరోగ్యం, భద్రత వంటి ప్రాథమిక హక్కులను వారు (గిగ్ వర్కర్లు) డిమాండ్ చేస్తున్నారు. మహిళా గిగ్ వర్కర్లు అందించే సేవల్లో అత్యధిక శాతం పనుల నిమిత్తం ఖాతాదారుల ప్రైవేటు నివాసాల్లోకి వెల్లాల్సి ఉంటుంది. అటువంటి సమయాల్లో వారిపై లైంగిక దాడులు జరిగే అవకాశాలు అధికం. చాలా చోట్ల మహిళలకు వాష్ రూమ్ సౌకర్యాలను కూడా తిరస్కరిస్తున్నారు. అసభ్యంగా ప్రవర్తించడం, దుర్భాషలాడడం, సింస వంటివి సాధారణం. అయితే, ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు, సంబంధిత ప్లాట్ఫారమ్ కంపెనీ వారికి ఎటువంటి సహాయం చేయదు. మహిళా గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక విధివిధానాలు లేకపోవడమే ప్లాట్‌ఫామ్ కంపెనీలకు కలిసొచ్చే అంశం. దీపావళి నాటి సమ్మె తర్వాతైనా కేంద్ర ప్రభుత్వం మేల్కొని, గిగ్ వర్కర్లకు, ప్రత్యేకించి మహిళలకు భద్రత కల్పించేలా కట్టుదిట్టమైన నిబంధనలను సిద్ధం చేయాలి. వాటిని పకడ్బందీగా అమలు చేయాలి. లేకపోతే, గిగ్ వర్కర్లు కూడా సమ్మెబాట పట్టక తప్పదు.





## సూడాన్‌లో మహిళలపై అత్యాచారాలు

సూడాన్‌లో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. బిబిసి నివేదికను అనుసరించి, అక్కడ సైన్యం–పారామిలటరీ మధ్య ఆధిపత్య పోరాటం మొదలైనప్పటి నుంచి ఇప్పుడు ఇజ్రాయెల్ దాడులు చేయడం వరకూ అన్ని సందర్భాల్లోనూ మహిళలే ఎక్కువగా బలిపశువులవుతున్నారు. సెంట్రల్ గెజిరా రాష్ట్రంలో పారా మిలటరీ బలగాలకు చెందిన ఫైటర్లు స్థానిక మహిళలను నిర్బంధించి అత్యాచారానికి పాల్పడ్డారు. కొంత మంది ఈ ఘోరాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఈ దారుణం ఇప్పటికీ కొనసాగుతున్నది. కొన్ని సందర్భాల్లో సామూహిక అత్యాచారాలతోపాటు హత్యలు కూడా చోటు చేసుకుంటున్నాయి. సూడాన్‌లో మహిళలపై అత్యంత పాశవిక దాడులు జరుగుతున్నాయని ఐక్యరాజ్య సమితి సైతం ఆందోళన వ్యక్తం చేసింది. వారికి హక్కులు అనేవే లేవు. ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) పారా మిలటరీ జవాన్లు ఈ దారుణాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ, నిరోధించే ప్రయత్నాలు జరగడం లేదు. ఈ ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదంటూ ఆర్ఎస్ఎఫ్ తన సైనికులకు మద్దతునిస్తున్నది. సూడాన్‌లో అధికారం కోసం సైన్యం, ఆర్ఎస్ఎఫ్ సంకుల సమరానికి దిగిన తర్వాత, ఇంత వరకూ వేల సంఖ్యలో మహిళలపై అత్యాచారాలు జరిగినట్టు ఐక్యరాజ్య సమితి పేర్కొనడాన్ని కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ అంతర్యుద్ధంలో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది తమతమ నివాసాలను విడిచిపెట్టి, దూర ప్రాంతాలకు పారిపోయారు. అంతర్యుద్ధం మొదలైనప్పటి నుంచి ఈ ఎడాది జులై వరకు 400 మందికి పైగా మహిళలపై లైంగిక దాడులు జరిగినట్లు ఐక్యరాజ్య సమితి నివేదిక తెలిపింది. అయితే ఈ సంఖ్య ఇంకా చాలా ఎక్కువగా ఉండవచ్చని విశ్లేషకులు అంటున్నారు. సూడాన్ మహిళల దుర్భర పరిస్థితులపై సోషల్ మీడియాలోనూ కథనాలు వస్తున్నాయి. కానీ, వారి సమస్యకు పరిష్కారం మాత్రం లభించడం లేదు.



### గుండె జబ్బులను తెచ్చిపెట్టే

## చెడు కొలెస్ట్రాల్

ఇటీవల కాలంలో చాలా మంది కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. మహిళల్లో ఊబకాయులు ఎక్కువ కాబట్టి, ఈ సంఖ్య కూడా వారిలోనే ఎక్కువగా ఉంటుంది. అయితే, కొలెస్ట్రాల్ అనేది కేవలం చెడు మాత్రమేకాదు... మంచి కూడా ఉంది. హైడెన్సిటీ లిపొప్రొటీన్ (హెచ్‌డిఎల్) అనేది మంచి కొలెస్ట్రాల్. ఇందుకు భిన్నంగా ఉండే లోడెన్సిటీ లిపొప్రొటీన్ (ఎల్‌డిఎల్) అనేది చెడు కొలెస్ట్రాల్. చిన్న వయసులోనే గుండెపోటుకు గురైన వారసత్వ చరిత్ర ఉన్నవారు ఎప్పటికప్పుడు కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకొని, నియంత్రణ చర్యలు చేపట్టాలి. కొలెస్ట్రాల్ పెరగడం అన్నది ఆ వ్యక్తి లావుగా ఉన్నాడా సన్నగా ఉన్నాడా అన్నది ముఖ్యం కాదు. లావుగా ఉన్న వారిలో కొలెస్ట్రాల్(cholesterol) నార్మల్గానే ఉండవచ్చు. సన్నగా ఉన్న వారిలో ఎక్కువగానూ ఉండవచ్చు. ఇవన్నీ రక్తపరీక్షల్లో తేలవలసిందే తప్ప శరీరం బరువు ఆధారంగా మాత్రం కాదు. కాకపోతే లావుగా ఉన్న వారిలో కాస్త ఎక్కువ మందిలో ఈ సమస్య ఉండవచ్చు. కుటుంబ చరిత్ర ఉన్న వారు చిన్న వయసు నుంచే కొలెస్ట్రాల్(cholesterol) పరీక్షలు చేయించు కుంటూ ఉండడం చాలా ముఖ్యం. తీవ్ర తను అనుసరించి ఆహార నియమాలు పాటించడంగానీ, కొన్ని మందులు వేసుకోవడం ద్వారాగానీ కొలెస్ట్రాల్(cholesterol) ను నియంత్రణలో ఉంచవచ్చు. అలాగే గుండెపోటు రావడానికి మధుమేహం ఒక ప్రధాన కారణం. అందుకే ఆ సమస్య ఉన్న వారు వ్యాధిని పూర్తి నియంత్రణలో ఉంచుకోవడం తప్పనిసరి. రోజూ మందులు క్రమం తప్పకుండా వాడుతూ కనీసం ప్రతి మూడు మాసాలకు ఒకసారి డాక్టర్ను సంప్రదిస్తూ ఉంటే ఈ సమస్య నుంచి సురక్షితంగా బయటపడవచ్చు.



నిజానికి పురుషులతో పోలిస్తే స్త్రీలలో గుండెపోటు తక్కువే. అయితే మధ్య వయసు వచ్చాక పురుషులతో సమానంగానే వీరూ గుండెపోట్లకు గురవుతారు. సహజంగా స్త్రీలలో ఉండే ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల వల్ల రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ నిలిచిపోవడం అన్నది చాలా తక్కువ. కాకపోతే మెనోపాజ్ తరువాత మాత్రం పరిస్థితి మారిపోతుంది. దీనికి తోడు గర్భాశయాన్నీ, అండాశయాన్ని కూడా తొలగించిన వారిలో పురుషులకు సమానంగానే గుండెపోటు వస్తుంది. అలా అని ఆ హార్మోన్ సప్లిమెంట్లు ఇవ్వడం ద్వారా ఈ స్థితిని అరికట్టలేం. గుండె రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకు పోవడం వల్ల రక్తనాళం మూసుకుపోయి గుండె కండరానికి అవసరమైన రక్తం అందదు. ఈ పేరుకుపోవడం అన్నది నిదానంగా జరిగితే ఆ లక్షణాలు కూడా అంతే నిదానంగా కనబడతాయి. అలా కాకుండా ఏ కారణంగానైనా ఒక్కో సారి ఈ కొలెస్ట్రాల్ చిట్లిపోవచ్చు. సరిగ్గా అదే సమయంలో రక్తం గడ్డ కట్టి నాళం పూర్తిగా మూసుకుపోతుంది. అప్పటిదాకా ఏ 70 శాత మో ఉన్న అటంకం క్షణాల్లో నూరు శాతంగా మారిపోతుంది. ఆ వెంటనే గుండెపోటు వచ్చేస్తుంది. గుండె వేగం విపరీతంగా పెరిగిపోయి ఆ తరువాత చాలా మందిలో గుండె కొట్టుకో వడం ఆగిపోతుంది. ఈ స్థితి ఏర్పడిన వారిలో సుమారు 50 శాతం మంది ప్రాణాలు కోల్పో వచ్చు. కొలెస్ట్రాల్ చితకడానికి కారణం పూర్తిగా తెలియక పోయినా శారీరక, మానసిక ఒత్తిళ్లు ప్రధాన కారణంగా ఉంటున్నాయి. అందుకే కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాన్ని బాగా తగ్గించడం, పొగతాగడం కానీ, పొగాకు సంబంధిత వస్తువులు వాడటం గానీ పూర్తిగా మానుకోవడం ముఖ్యం.

## 26న ఊరూ–వాడా సిపిఐ శత వార్షికోత్సవాలు

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** డిసెంబర్ 26వ తేదీన జరిగే సిపిఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ శాసన సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో ఆ పార్టీ జిల్లా సమితి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వార్షికోత్సవ వేడుకకు ఊరువాడ ఏకమై ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 7 నుండి డిసెంబర్ 26 వరకు పార్టీ, ప్రజా సంఘాల సభ్యత్వం పునరుద్దరణ కార్యక్రమాన్ని చేపట్టాలని, అన్ని శాకల మహాసభలు పూర్తి చేయాలని చెప్పారు. డిసెంబర్ 30న నల్గొండ జిల్లా కేంద్రంలో సిపిఐ పార్టీ శత వార్షికోత్సవ వేడుకల ప్రారంభ బహిరంగ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తరువాతా ఏడాది పాటు దేశ వ్యాప్తంగా వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ త్వరలో జిల్లాలో ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి శిక్షణ శిబిరంతో పాటు జనసేవాదళ్ శిక్షణ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యువజన సమాఖ్య సదస్సును చిలుకూరులో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు గత కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్తు కార్యక్రమాలను నివేదికను ప్రవేశపెట్టారు. యల్లంల యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్, ఉస్తేల నారాయణరెడ్డి, కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లేశ్వరి, ఉప్పతల కోటమ్మ, ఎస్‌కె సాహెబ్ అలీ, యల్లావుల రమేష్, చిలకరాజు శ్రీను, దొడ్డ వెంకటయ్య, రెమిడాల రాజు, ముళ్ళ జానయ్య, అమరారపు పున్నయ్య, చింతిరాల రవి, సారెడ్డి పాపిరెడ్డి పాల్గొన్నారు.

## వసతిగృహాల్లో మెను పాటించాల్సిందే

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యార్థులకు మెను ప్రకారం భోజనం పెట్టేందుకు వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జి ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం షాద్‌నగర్ ఆర్‌డిఓ సరితకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆకాష్ నాయక్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులకు మెను ప్రకారం భోజనం ఎక్కడ పెట్టడం లేదని, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వార్డెన్లు స్థానికంగా ఉండాల్సి ఉన్నప్పటికి ఉండటం లేదని అన్నారు. కూరగాయలు, వంట సామాగ్రి సంబంధించి నాణ్యత లోపిస్తున్నాయని, వసతి గృహాలకు సొంత భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రైవేట్ భవనాల వద్దు సొంత భవనాలు నిర్మించేందుకు కృషి చేయాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు గతంలో అనేకమార్లు ఫిర్యాదులు చేశామని, ఫలితం లేకుం డా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, పాలకులుచర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ అధ్యక్షుడు నరేష్ రాథోడ్‌తోపాటు కార్యకర్తలు ఉన్నారు.

## కొనుగోళ్లలో దగాపై రైతన్న కన్నెర్ర

### పత్తి కొనుగోళ్లలో దళారుల దందా
### చేతులేత్తేసిన సిసిఐ : బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** పత్తి కొనుగోళ్లపై రైతులు కన్నెర్ర చేశారు. కనీస మద్దతు ధర క్వింటా రూ. 7,521 ఉండగా ఐదువేలకు మించి కొనుగోలు చేయకపోవడంతో కడుపు మండిన రైతులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం పత్తి మార్కెట్‌లో ధర్నా నిర్వహించారు. తొలుత పత్తి మార్కెట్‌లోకి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. గేటు ముందు భారీ ధర్నా నిర్వహించారు. తర్వాత మార్కెట్‌లోకి పెద్ద సంఖ్యలో వెళ్లిన కార్యకర్తలు, నాయకులు పత్తి కాంటాలను అడ్డుకున్నారు. సిపిఐ రైతు సంఘం నాయకులు ఏ రైతును పలకరించినా కన్నీటి పర్యంతం అవుతూ తమ వ్యథను వివరించారు. క్వింటా ఐదు వేలకు మించి కొనుగోలు చేయడం లేదని తెలిపారు. మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన నాటి నుంచి ఇంత వరకు ఒక్క రోజు కూడా మద్దతు ధర రూ.7,521 క్వింటా పత్తి కూడా కొనుగోలు చేయలేదని రైతులు తెలిపారు. రైతులు, సిపిఐ కార్యకర్తలు కాంటాలను నిలిపివేసి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి తాళం వేసి కార్యాలయం ఎదుట బైఠాయించారు. మార్కెట్‌లో కార్యకలాపాలు స్తంభించాయి.పత్తి కొనుగోళ్లలో దళారుల దందా రైతులను తీవ్ర నష్టాలకు, కష్టాలకు గురి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. పత్తి మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ దళారుల చేతిలో వ్యవసాయ మార్కెట్ బంధీ అయిందని సిసిఐ కీలు బొమ్మగా మారిందన్నారు. ఖమ్మం మార్కెట్‌లో ఇప్పటివరకుప్రైవేటు వ్యాపారులు 5,200 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే సిసిఐ కొనుగోలు చేసింది కేవలం 178 మెట్రిక్ టన్నులు మాత్రమేనని హేమంతరావు తెలిపారు. పత్తి ఎక్కువగా పండించేప్రాంతాలలో సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వెనక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పత్తి పండించే ప్రాంతాలలో సిసిఐకేంద్రాలను తక్షణం ఏర్పాటు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ఖమ్మం మార్కెట్‌లో సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో పత్తి కొనుగోళ్లను అడ్డుకుంటామని హేమంతరావు హెచ్చరించారు.



**జెసి హామీతో ఆందోళన విరమణ**

పత్తికి గిట్టుబాటు ధర లభించేవిధంగా చర్యలు తీసుకుంటామని జెసి హామీ ఇవ్వడంతో సిపిఐ, రైతు సంఘం నాయకులు ఆందోళన విరమించారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలు పెంచుతామని హామీ ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి రైతుల సమస్యలను వివరించారు. సిఐ దామాల రమేష్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తు నిర్వహించగా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, నాయకులు అడపా రామకోటయ్య, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి , అజ్మీర రామ్మూర్తి, రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, పుచ్చకాయల సుధాకర్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వీరభద్రం, కూచిపూడి రవి, ఎసు, మల్లికార్జున్, శంకర్‌రావు, ఏనుగు గాంధీ, రామకృష్ణ, సాంబశివరెడ్డి, శశిధర్, శ్రావణ్, శ్రీను పాల్గొన్నారు.

## సింగరేణిని అభివృద్ధి చేసుకుందాం..



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిని ప్రైవేటీకరణ నుండి రక్షించుకుంటూ, సంస్థ అభివృద్ధి కోసంకార్మికులు,ఉద్యోగులు,అధికారులు, యూనియన్ లు కలిసి కట్టుగా ఉంటూ ముందుకు పోదామని, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా సింగరేణి సంస్థ మనుగడను కాపాడుకోవడానికి ఏఐటియుసి కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికే ఓసిపి 5 లో జరిగిన గేట్ మీటింగ్ లో ఆయనమాట్లాడుతూ సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న 34 వేల కోట్ల రూపాయలు చెల్లించాలని, లేకపోతే సంస్థ మనుగడ కొనసాగడం కష్టమని, కొత్త గనులు రావాలంటే సంస్థ కు బడ్జెట్ అవసరమన్నారు. సింగరేణి లో గుర్తింపు సంఘంగా ఏఐటియుసి గెలిచిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రి ని సింగరేణి కి చెల్లించాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే తాడిచర్ల 2, భూపాలపల్లి లో కేటికే ఓసి, కొత్తగూడెంలోనివికేమైన్, శ్రావణ్ పల్లిమైన్, కోయగూడేం ఓసి, సత్తుపల్లి ఓసి ప్రారంభం చేసుకుంటే పాత గనులు మూతపడ్డ వీటి వల్ల కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం మాట్లాడారు. ఏఐటియుసిలో పలు యూనియన్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కార్మికులు చేరగా వారికి సీతారామయ్య, పలువురు నాయకులు కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఏఐటియుసిలో చేరిన వారిలో నేరెళ్ళ సదయ్య, చింతల సత్యనారాయణ, గాజుల వెంకట స్వామి, కొమురయ్య, కుమార్‌రెడ్డి,నాయినిసమ్మయ్య,రమేష్ ఉన్నారు.

## ఐకెపి విఓఎలకు కనీస వేతనం చెల్లించాలి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ లో పనిచేస్తున్న విఓఎ లకు కనీస వేతనం చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడిఒసి భవనంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్ తో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డిఆర్‌డిఎ కార్యాలయ డిపిఎం యశోదకు వినతిపత్రంఅందజేశారు. భోగే ఉపేందర్ మాట్లాడుతూ డిఆర్‌డిఎలో సుమారుగా 18వేల మంది విఓఎ లు గత 22 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారని, వీరికి కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఓఎ యూనియన్ జిల్లా కన్వీనర్ భీమేష్, కోకన్వీనర్ శ్రీధర్, నాయకులు కృష్ణ, రవి, తిరుపతి, లింగన్న, రజిత, కవిత, రాజేశ్వరి, సురేఖ, రాంచందర్, వెంకటేష్, శంకర్, శంకర్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



**ఆర్‌టిసిని విలీనం చేయాలి**

**ఆసిఫాబాద్:** ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింట్మెంట్ తేదీనిప్రకటించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశా రు. మంగళవారం ఆర్‌టిసి జెఎసి రాష్ట్ర పిలుపు మేరకు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు ఆర్‌టిసి జెఎసి చైర్మెన్ టి.దివాకర్ అధ్యక్షతన వినతిపత్రం అందజేశారు. బోగే ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలుసందర్భంగా 2023 నవంబర్‌లో కాంగ్రెస్‌ఎన్నికల ప్రచారంలో వారి ఎలక్షన్ మేనిఫెస్టోను విడుదల చేస్తూ ఆర్‌టిసి కార్మికులకు పలు హామీలను ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. జిఒ నెం.30 లో పేర్కొనబడిన ఉత్తర్వుల ప్రకారం ఆర్‌టిసి ఉద్యోగులకు కూడా వయసు పరిమితిని44సంవత్సరాలకు పెంచాలని డిమాండ్‌చేశారు.ఎఐటియుసిజిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఆర్‌టిసి జెఎసి నాయకులు అశోక్, గుజ్జ మోహన్ బాబు, హరికృష్ణ ఉన్నారు.

## సిపిఐ ఆవిర్భావ వేడుకలు జయప్రదం చేయండి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి




**ప్రజాపక్షం/దేవరకొండ:** దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, స్వాతంత్ర్యనంతరం కష్టజీవుల పక్షాన మహోన్నత పోరాటాలు నిర్వహించి హక్కులు సాధించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పల్లా పర్వత్ రెడ్డి సిపిఐ కార్యాలయంలో మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన దేవరకొండ నియోజకవర్గ మండలాల కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా పల్లా నర్సింహారెడ్డి మాట్లాడారు. ప్రజల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న కమ్యూనిస్టు పార్టీ ఈ సంవత్సరం డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాల్లోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున 100 సంవత్సరాల వేడుకలు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నేటి పాలకులు అవలంభిస్తున్న ప్రజా ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని, దొపిడి లేని సమాజం కోసం మనిషి మనిషిగా బతికే సోషలిస్టు వ్యవస్థ స్థాపన లక్ష్యంగా సిపిఐ పోరాడుతుందని అన్నారు. రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికి తేమ పేరుతో పత్తి కొనుగోలు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. డిసెంబర్ 26న వాడవాడల ఎర్రజెండా ఎగురవేసి ప్రదర్శన, బహిరంగ సభలు సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లాకార్యవర్గసభ్యులుబొడ్డుపల్లి వెంకటరమణ, గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రమావత్ అజయ్‌నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మైనోద్దిన్, దేప సుదర్శన్‌రెడ్డి, కనకాచారి, బుచ్చిరెడ్డి, వెంకటయ్య ఉన్నారు.

# వైట్‌హౌస్‌లో కూర్చునేదెవరు?

## కీలక రాష్ట్రాలలో చురుగ్గా ఓటింగ్




**వాషింగ్టన్ :** ప్రజాస్వామ్య నామం జపించే అమెరికాలో అధ్యక్ష పదవికి మంగళవారంనాడు ఓటింగ్ చురుగ్గా సాగింది. ఓటర్లు ఆసక్తితో లైన్లు కట్టి తమ వంతు కోసం ఎదురు చూశారు. అమెరికాలో 2024 అధ్యక్ష ఎన్నికలకు ఓటువేసేందుకు 24 కోట్లమంది (240 మిలియన్లు) అర్హులైన ఓటర్లు ఉన్నారు. వీరిలో 7.8 కోట్లమంది ఐదోతేదీకి ముందుగానే ఓటింగ్ పూర్తిచేశారు. అరిజోనా(11 ఎలక్టోరల్ ఓట్లు), జార్జియా(16 ఎలక్టోరల్ ఓట్లు), మిచిగన్ (15 ఎలక్టోరల్ ఓట్లు), నెవడా (6 ఎలక్టోరల్ ఓట్లు), నార్త్ కరోలినా(16 ఎలక్టోరల్ ఓట్లు), పెన్సిల్వేనియా(19 ఎలక్టోరల్ ఓట్లు), విస్కాన్సిన్ (10 ఎలక్టోరల్ ఓట్లు) కీలక రాష్ట్రాలలో మొత్తం 93 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లపైనే ప్రధాన అభ్యర్థులిరువురూ దృష్టి సారించారు. 2020 ఎన్నికల్లో జార్జియా, మిచిగన్, నెవడా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్‌లలో జో బైడెన్ విజయం సాధించారు. ఈసారి కూడా ఈ రాష్ట్రాలలో జరిగిన అనేక సర్వేలలో కమలా హారిస్‌దే పైచేయిగా ఉంది. అధ్యక్ష అభ్యర్థి వైట్‌హౌస్‌లో అధికారికంగా అడుగుపెట్టాలంటే ఈ ఏడు రాష్ట్రాల ఓటర్లే కీలకం. ఉపాధ్యక్ష పదవులకు టిమ్ వాల్జ్ (డెమోక్రటిక్‌పార్టీ), జె.డి.వాన్స్ (రిపబ్లికన్ పార్టీ) పోటీలో ఉన్నారు.

భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయానికి ఫలితాలు వస్తాయి. సమస్యలు ఏర్పడితే ఫలితాల్లో జాప్యం జరుగుతుంది. మొత్తం 538 ఎలక్టోరల్ కాలేజీలకుగాను 270 లేదా అంతకంటే ఎక్కువ గెలుచుకున్న అభ్యర్థి వైట్‌హౌస్‌లో పాగా వేస్తారు. కాలిఫోర్నియాలో అత్యధికంగా 54 ఎలక్టోరల్ కాలేజీలు ఉండగా, వ్యోమింగ్, అలాస్కా, నార్త్ డకోటా (మరియు వాషింగ్టన్ డిసి)లలో కనిష్టస్థాయిలో మూడు ఎలక్టోరల్ కాలేజీలు వంతన ఉన్నాయి. ఉదాహరణకు ఒకరాష్ట్రంలో ఒక అభ్యర్థికి 50.1 శాతం ఓట్లు వస్తే, ఆ రాష్ట్రంలో 40 ఆయనకు ఇస్తారు. ఒకవేళ అభ్యర్థి మొత్తం ఓట్ల ను తనఖాతాలో వేసుకున్నాసరే ఈ సంఖ్యలో మార్పు ఉండదు. అధ్యక్ష అభ్యర్థికి దేశవ్యాప్తంగా తక్కువ ఓట్లు నమోదైనాగానీ, రాష్ట్రాలలో కనాకష్టంగా గెలిచినా కూడా అధ్యక్ష పదవికి అర్హులే అవుతారు. డోనాల్డ్ ట్రంప్‌కు ఇప్పటివరకూ ఏనాడూ యాభైశాతం ఓట్లు రాలేదు. 2016లో హిల్లరీక్లింటన్ కంటే తక్కువ ఓట్లు వచ్చినాగానీ డోనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు. 2000 సంవత్సరం ఎన్నికల్లో రిపబ్లిక్‌పార్టీ అభ్యర్థి జార్జి డబ్ల్యు.బుష్ కూడా అతి తక్కువ ఓట్లు వచ్చినప్పటికీ డెమోక్రటిక్‌పార్టీ అభ్యర్థి అల్‌గోరేపై గెలిచారు. దేశవ్యాప్తంగా (పాపులర్ ఓట్) భారీగా ఓట్లు నమోదైనాకూడా ఆనాడు అల్‌గోరే గెలవలేదు. ఇలా అమెరికాలో గడచిన ఆరు ఎన్నికల్లో పాపులర్ ఓట్ విజేతలు రెండుసార్లు ఓడిపోయారు. ఒకవేళ మెజారిటీ విజేత లేకపోతే అమెరికా దిగువసభ 'హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్' ప్రతినిధులు అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. సరిగ్గా 200 సంవత్సరాలక్రితం 1824లో ఈ విధంగానే జరిగింది. ఆనాడు నలుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. కానీ ఎలక్టోరల్ కాలేజీలను వారు సమానంగా పంచుకోవడంతో ఎవరికీ మెజారిటీ రాలేదు. దాంతో దిగువసభలో ప్రజాప్రతినిధులు దేశాధ్యక్షుణ్ణి ఎన్నుకున్నారు.

# మదర్సాలపై అనుమానాలొద్దు

## సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం: విపక్షాలు



**లక్నో:** ఉత్తరప్రదేశ్ మదర్సా విద్య చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పునివ్వడాన్ని ప్రతిపక్షాలు స్వాగతించాయి. అన్నింటిని అనుమానంగా చూడటం సరి కాదని హితవు పలికాయి. మదర్సాలలో మెరుగుదల కావాలంటే ప్రభుత్వం సంబంధిత వర్గాలతో చర్చించి, తగు చర్యలను తీసుకోవాలని సూచించాయి. సుప్రీంకోర్టు తాజా తీర్పును జమాతే ఉలేమా ఎ హింద్ న్యాయ సలహాదారు మౌలానా కబ్ రషీది స్వాగతించారు. రాజ్యాంగ విరుద్ధంగా తీసుకొనే ప్రతి నిర్ణయంపై న్యాయ పోరాటం తప్పబోదని అన్నారు. ఈ చట్టాన్ని సమర్థించడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని సుప్రీంకోర్టు పరిరక్షించిందని చెప్పారు. మదర్సాలలో మెరుగైన ఆధునిక విద్య కల్పనకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలేగానీ, రాజ్యాంగ విరుద్ధమంటూ ముద్ర వేయడం తగదన్నారు. యూపీ మదర్సా విద్య చట్టం,2004ను రాజ్యాంగ విరుద్ధమన్న అలహాబాద్ హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ చట్టం లౌకికవాద సిద్ధాంతాలను ఉల్లంఘిస్తోందని హైకోర్టు తప్పు చేసిందని సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సీనియర్ సభ్యుడు మౌలానా ఖాలిద్ రషీద్ ఫరంగీ మహాలి స్పందిస్తూ 'సుప్రీంకోర్టు తీర్పుతో మదర్సాలన్నీ స్వేచ్ఛగా నడుస్తాయి. ప్రభుత్వం చేసిన చట్టం... రాజ్యాంగ విరుద్ధమైనదిగా ఎలా ఉంటుంది? ఈ మదర్సాలతో వేలాది మంది ముడిపడి ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వారందరికీ ఊరట కల్పించింది అని అన్నారు. ఆలిండియా షియా పర్సనల్ లా బోర్డు అధికార ప్రతినిధి మౌలానా యసూబ్ అబ్బాస్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యంలో మదర్సాల పాత్ర కీలకమని, ఎందరో ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, గవర్నర్‌లను మదర్సాలు అందించాయన్నారు. మదర్సాలపై అనుమానం వద్దని సూచించారు. తప్పు జరిగితే చర్యలు తీసుకోవాలే తప్ప... అన్ని మదర్సాలు ఒకటే అన్నట్లు వాటిపై అనుమానాలు పెట్టుకోవడం తగదన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి 'ఎక్స్'లో స్పందిస్తూ మదర్సాల భవిష్యత్‌పై అనిశ్చితికి సుప్రీంకోర్టు తీర్పుతో తెర పడిందన్నారు. కోర్టు ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని, ఈ తీర్పుతో ఉత్తరప్రదేశ్ మదర్సాలకు గుర్తింపుతో పాటు అవి సజావుగా సాగేందుకూ హామీ లభించినట్లు అయిందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక చట్టబద్ధంగానే మదర్సాలు ఏర్పాటయ్యాయని సమాజ్‌వాదీ పార్టీ గుర్తుచేసింది. పౌరుల రాజ్యాంగ బద్ధ హక్కుల హరణే అధికార పార్టీ ధ్యేయమని బీజేపీని విమర్శించింది. బీజేపీ ప్రభుత్వం మైనారిటీ వ్యతిరేకని... ద్వేషపూరిత రాజకీయాలు చేస్తూ, మదర్సాలకు వ్యతిరేకంగా తరచూ మాటాడుతుందని ఎస్‌పీ అధికార ప్రతినిధి ఫఖ్రుల్ హసన్ అన్నారు. ఇస్లామిక్ విద్యతో పాటు హిందీ, ఆంగ్లం, కంప్యూటర్‌ను మదర్సాలు బోధిస్తాయన్నారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 17లక్షల మదర్సాలు ఉన్నాయి. యూపీ మదర్సా విద్య చట్టం రాజ్యాంగ విరుద్ధమంటూ మార్చి 22న అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. మదర్సా విద్యార్థులందరినీ స్కూళ్లలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టు ఏప్రిల్ 5న స్టే విధించింది. సంబంధిత ఫిర్యాదులపై తీర్పును అక్టోబరు 22వ తేదీకి రిజర్వు చేసింది. యూపీ మదర్సా రాజ్యాంగ బద్ధమైనదిగా సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది.



# రాహుల్‌గాంధీ కేసు వాయిదా

**సుల్తాన్‌పూర్ :** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై నమోదైన పరువు నష్టం దావా వాదనలు నవబంర్ 23కు వాయిదా పడింది. కర్నాటక ఎన్నికల సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సుల్తాన్‌పూర్‌లో స్థానిక బిజెపి నేత విజయ్ మిశ్రా కేసు వేశారు. దానిపై ఎంపి– ఎంఎల్‌ఏల ప్రత్యేక కోర్టు విచారణకు చేపట్టింది. గతంలో అక్టోబర్ 31న వాదనలు ఉండగా, దీపావళి కారణంగా నవంబర్ 5కు వాయిదాపడింది. అయితే మంగళవారం నాడు కోర్టు ప్రత్యేక జడ్జి సెలవుపై ఉండడంతో మరోసారి వాయిదా పడింది. జూలై 26న రాహుల్‌గాంధీ తన స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. కేఉసు రాజకీయ ప్రేరితమైనదంటూ, తనపై ఆరోపణలను తిరస్కరించారు.



# ఎక్కడో ఒకచోట ఆగిపోవాలి

## రాజకీయ రిటైర్మెంట్‌పై శరద్ పవార్

**ముంబై :** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శరద్ పవార్ మంగళవారం తన పదవీ విరమణ గురించి సూచనప్రాయంగా వెల్లడించారు. ఆయన రాజ్యసభ పదవీ కాలం 18 నెలల్లో ముగియనుండటంతో ఇకపై ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చు. 1999లో ఎన్‌సిపిని స్థాపించి మహారాష్ట్ర రాజకీయాల్లో 'గ్రాండ్ ఓల్డ్ మ్యాన్' గా పేరుగాంచిన అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు నవంబరు 20న అసెంబ్లీ ఎన్నికల్లో పవార్ వర్సెస్ పవార్ పోటీని చూడనున్న పశ్చిమ మహారాష్ట్రలోని తన కుటుంబ కోట అయిన బారామతిలో మంగళవారం ఎన్నికల ప్రచార సభలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'నేను అధికారంలో లేను. ఇక రాజ్యసభలో నా పదవీకాలం ఇంకా ఏడాదిన్నర సమయం ఉంది. భవిష్యత్‌లో ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయను. నేను ఎక్కడో ఒకచోట ఆగిపోవాల్సి ఉంటుంది' అని తెలిపారు. మొత్తంగా 14 సార్లు తనను ఎంపీగా, ఎమ్మెల్యేగా నిలబెట్టినందుకు బారామతి ఓటర్లకు కతజ్ఞతలు చెప్పారు. ఎన్‌సిపి (ఎస్‌పి), దాని మిత్రపక్షాలు కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) తో కలిసి ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న శరద్ పవార్ దాదాపు ఆరు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితానికి ముగింపు వచ్చింది. ఈ సందర్భంలో బారామతి కోసం పోరాటం ఓటర్లపై శరద్ పవార్ నిరంతర ప్రభావానికి రెఫరెండం కానుంది. ఎందుకంటే ఆయన మనవడు యుగేంద్ర పవార్ గత సంవత్సరం తిరుగుబాటుకు నాయకత్వం వహించిన శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్‌పై రాజకీయ యుద్ధం చేస్తున్నాడు. అజిత్ బారామతి నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. అజిత్ మునుపటి ప్రతి విజయాలలో అతనికి తన మామ పార్టీ మద్దతు ఉంది. అతను తన సొంత బ్యానర్‌పై పోటీ చేస్తున్న మొదటి రాష్ట్ర ఎన్నికలివే కావడం విశేషం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తన సోదరి సుప్రియా సూలేపై తన భార్య సునేత్రా పవార్‌ను పోటీకి దింపాలని అజిత్ తీసుకున్న నిర్ణయంతో పవార్ కుటుంబం రాజకీయ పోటీలో ఎదురవడం ఈ ఏడాది ఇది రెండో సందర్భం. శరద్ పవార్ మాట్లాడుతూ తాను ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయనని, కొత్త తరం రాజకీయాల్లోకి రావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. 'నేను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయను. ఇప్పుడు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయను. ఇప్పటి వరకు 14 ఎన్నికల్లో పోటీ చేశాను. ఏ ఎన్నికల్లో ఏ ఒక్కసారి కూడా నన్ను ఇంటికి వెళ్లనివ్వలేదు. అన్ని ఎన్నికల్లోనూ నన్ను గెలిపించారు. నన్ను తయారు చేశారు. ప్రతి ఎన్నికల్లో గెలుస్తాను కానీ నేను ఎక్కడో ఒకచోట ఆగిపోవాలి' అని అన్నారు. తాను ప్రజలకు, ముఖ్యంగా 'గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలు, ఆదివాసీలకు' సేవ చేస్తూనే ఉంటానని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చెప్పారు. అయితే ఆయన తన పదవీ విరమణకు సంబంధించి వార్తల్లోకి ఎక్కడం ఇదే మొదటిసారి కాదు. గత సంవత్సరం కూడా పవార్ ఎన్‌సీపీ (ఎస్‌పీ) పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. 'పార్లమెంటులో రాజ్యసభ సభ్యత్వానికి నాకు మూడేళ్లు మిగిలి ఉన్నాయి. ఆ సమయంలో నేను మహారాష్ట్ర, దేశానికి సంబంధించిన సమస్యలపై దష్టి సారిస్తాను. మే 1, 1960 నుంచి మే 1, 2023 వరకు సుదీర్ఘ ప్రజా జీవితం తర్వాత ఒక అడుగు వెనక్కి వేయాల్సిన అవసరం ఉంది. అందుకే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను' అని ఆయన అప్పుడు చెప్పారు.

# గ్రామీణ బ్యాంకుల విలీనానికి కేంద్రం కుట్ర

## 43 నుంచి 28కి తగ్గించడానికి కసరత్తు

## తెలుగు రాష్ట్రాల్లో ఐదు బ్యాంకుల విలీనం




**న్యూఢిల్లీ:** ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను మరింత సమర్థంగా నిర్వహించడం, ఖర్చుల నియంత్రణ సాకుతో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను విలీనం చేయాలని కేంద్రం భావిస్తోంది. ఇప్పటికే చాలాసార్లు ఈ ప్రక్రియ జరగ్గా... నాలుగో దఫా ఏకీకత ప్రక్రియ చేపట్టేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు మొదలు పెట్టింది. దీంతో ప్రస్తుతం ఉన్న గ్రామీణ బ్యాంకుల సంఖ్య 43 నుంచి 28కి తగ్గనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రణాళిక సిద్ధమైంది. విలీన ప్రక్రియలో భాగంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న 15 ఆర్‌ఆర్‌బీలు విలీనం కానున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 4, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన 3, బీహార్, గుజరాత్, జమ్మూకశ్మీర్, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్‌లో రెండేసి ఆర్‌ఆర్‌బీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ విలీన ప్రక్రియ అప్పులు, ఆస్తుల సర్దుబాటుకు లోబడి జరుగుతుంది. ఒకే రాష్ట్రం ఒకే ఆర్‌ఆర్‌బీ వల్ల ఆయా బ్యాంకుల పనితీరు మెరుగవుతుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం నాబార్డ్‌తో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులకు రుణాలివ్వడానికి ఆర్‌ఆర్‌బీ చట్టం, 1976 కింద ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఏర్పడ్డాయి. వీటి యాజమాన్య నిర్మాణం ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం 50 శాతం వాటా ఉంది. మిగిలిన 50 శాతంలో ప్రాయోజిత బ్యాంకుకు (స్పాన్సర్) 35 శాతం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి 15 శాతం వాటాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ఐదు గ్రామీణ బ్యాంకులున్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు... చిత్తూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

# 18వేల నకిలీ సంస్థలు... రూ.25వేలకోట్ల జిఎస్‌టి ఎగవేత

**న్యూఢిల్లీ:** జీఎస్టీ కింద నమోదైన 18వేల నకిలీ కంపెనీలు రూ.25వేల కోట్ల పన్నును ఎగవేశాయి. నకిలీ కంపెనీలపై దేశవ్యాప్తంగా నిర్వహించిన రెండవ దఫా తనిఖీల్లో ఈమేరకు భారీ మొత్తంలో పన్ను ఎగవేసిన నకిలీ కంపెనీలను జీఎస్టీ అధికారులు గుర్తించారు. వస్తు విక్రయాలు లేకుండా ఇన్‌పుట్ ట్యాక్ క్రెడిట్ (ఐటీసీ) పొందేందుకు ఏర్పడి, ఖజానాకు నష్టం వాటిల్లజేస్తున్నట్లు మొత్తం 73వేల కంపెనీలను జీఎస్టీ అధికారులు అనుమానించారు. అయితే ఇందులో 18వేల కంపెనీలు అసలు లేవని తేలింది. అలాగే రూ.24,550 కోట్ల పన్ను ఎగవేసినట్లు రుజువు అయింది. ప్రత్యేక డ్రైవ్ సమయంలో కంపెనీలు స్వచ్ఛంధంగా రూ.70వేల కోట్ల జీఎస్టీని చెల్లించాయి. కాగా, నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు గుర్తించే చర్యల్లో భాగంగా ఆగస్టు 16 నుంచి అక్టోబరు చివరి వరకు దేశవ్యాప్తంగా రెండవ దశ తనిఖీలు జరిగాయి. మొదటి దశ తనిఖీల్లో 21,791 కంపెనీలు నకిలీవని, రూ.24,010 కోట్ల పన్నును ఎగవేసినట్లు గుర్తించారు. తొలి దఫా తనిఖీలు 2023, మే 16 నుంచి జులై 15 వరకు జరిగాయి.

# మహారాష్ట్ర కొత్త డీజీపీ సంజయ్ కుమార్

**ముంబై:** మహారాష్ట్ర కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సంజయ్ కుమార్ వర్మ నియమితులయ్యారు. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. 1990 బ్యాచ్ ఐపీఎస్ కేడర్‌కు చెందిన వర్మ ప్రస్తుతం లీగల్ అండ్ టెక్నికల్ డైరెక్టర్ జనరల్‌'హో'లో ఉన్న వర్మ... రష్మీ శుక్లా నుంచి బాధ్యతలు స్వీకరించారు. మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) పక్షాల ఫిర్యాదులపై స్పందించిన ఎన్నికల సంఘం... డీజీపీ పదవి నుంచి ఓ నెలపాటు శుక్లాను తొలగించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగిస్తూ, బీజేపీ పట్ల పక్షపాతంతో ఉన్నందున శుక్లాను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎంవీఏ ఈసీకి లేఖ రాసింది. వర్మ గతంలో దేవేంద్ర కొల్హాపూర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా, మహారాష్ట్ర హౌసింగ్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంహెచ్‌ఏడీఏ) లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నాలుగేళ్లపాటు పనిచేశారు. డీజీగా పదోన్నతి పొందిన తర్వాత లీగల్ అండ్ టెక్నికల్ డీజీగా నియమితులయ్యారు. ఎన్నికల వరకు వర్మ ఇన్‌ఛార్జ్‌గా ఉంటారని ఓ అధికారి తెలిపారు. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఆయనను కొనసాగిస్తుందా లేదా అనేది నిర్ణయిస్తుంది. వర్మ 2028 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేయనున్నారు.

# సిద్ధరామయ్యకు హైకోర్టు నోటీసు



**బెంగళూరు:** ముడా భూముల కేటాయింపు కేసు కీలక మలుపులు తిరుగుతోంది. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య, ఇతరులపై నమోదైన ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై కర్నాటక హైకోర్టు సిద్ధరామయ్యకు మంగళవారం నోటీసులు జారీ చేసింది. స్నేహమయి కష్ణ వేసిన ఈ పిటిషన్‌పై కేంద్రం ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, సీబీఐ, లోకాయుక్త పోలీసులకు హైకోర్టు నోటీసులు పంపింది. లోకాయుక్త పోలీసులు ఇంతవరకూ చేసిన దర్యాప్తునకు సంబంధించిన వివరాలను నవంబర్ 25వ తేదీలోగా తమకు సమర్పించాలని కోర్టు కోరింది. తదుపరి విచారణను నవంబర్ 26న తేదీకి వాయిదా వేసింది. ముడా భూముల కేటాయింపుల వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సెప్టెంబర్ 27న కోర్టు ఇచ్చిన ఆదేశాలతో మైసూరు లోకాయుక్త పోలీసులు అధికారికంగా కేసుపై దర్యాప్తు జరుపుతున్నారు. సిద్ధరామయ్య భార్యకు రూ.56 కోట్లు విలువచేసే 14 స్థలాలను ముడా కేటాయించడంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై లోకాయుక్త విచారణ జరుపుతోంది. మైసూరు నగరంలోని ఖరీదైన ప్రాంతంలో అక్రమంగా సిద్ధరామయ్య భార్యకు 14 స్థలాలను ముడా కేటాయించినట్టు ఆరోపణల్నున్నాయి. కేసు విచారణలో భాగంగా ఇటీవల సిద్ధరామయ్య భార్య పార్వతిని ముడా పోలీసులు ప్రశ్నించారు. ఈనెల 6వ తేదీన తమ ముందు హాజరుకావాలని సిద్ధరామయ్యకు మైసూరు లోకాయుక్త సోమవారం నోటీసులు పంపింది. నోటీసులు తనకు అందాయని, 6వ తేదీన విచారణకు హాజరవుతానని సిద్ధరామయ్య ధ్రువీకరించారు.

# సల్మాన్‌ఖాన్‌కు మళ్లీ బెదిరింపులు



**ముంబై:** మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే బాబా సిద్దిఖీ హత్య తర్వాత బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు వరుసగా బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో సల్మాన్‌ఖాన్‌ను బెదిరిస్తూ ముంబై పోలీసులకు ఓ మెసేజ్ వచ్చింది. అందులో సల్మాన్‌కు దుండగులు రెండు ప్రతిపాదనలు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ముంబై పోలీసు ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు చెందిన వాట్సప్ నంబరుకు సోమవారం అర్ధరాత్రి తర్వాత ఈ మెసేజ్ వచ్చింది. 'నేను లారెన్స్ బిష్ణోయ్ సోదరుడిని. సల్మాన్‌ఖాన్ ప్రాణాలతో ఉండాలంటే అతడు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి. లేదంటే రూ.5 కోట్లు ఇవ్వాలి. అలా జరగనిపక్షంలో మేం అతడిని చంపేస్తాం. మా గ్యాంగ్ ఇంకా క్రియాశీలకంగానే ఉంది' అని ఆ మెసేజ్‌లో పేర్కొన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. అక్టోబరు 30న కూడా సల్మాన్‌ఖాన్‌ను బెదిరిస్తూ మెసేజ్ వచ్చిన సంగతి తెలిసిందే.

# బాక్సింగ్‌లో భారత్ సంచలనం

## డబ్ల్యూబిఎఫ్ ప్రపంచ టైటిల్ గెలుచుకున్న మన్‌దీప్ జంగ్రా

**న్యూఢిల్లీ:** ప్రపంచస్థాయి క్రీడా వేదికపై భారత్ మరోమారు సత్తా చాటింది. డబ్ల్యూబీఎఫ్ ప్రపంచ బాక్సింగ్‌లో భారత్‌కు చెందిన మన్‌దీప్ జంగ్రా అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. బ్రిటన్ బాక్సర్‌ను చిత్తు చేసి సూపర్ ఫెదర్‌వెయిట్ ప్రపంచ టైటిల్‌ను గెలుచుకున్నాడు. కేమన్ ఐలాండ్ వేదికగా జరిగిన ప్రపంచ బాక్సింగ్‌లో బ్రిటన్‌కు చెందిన కొనార్ మెకింతోశ్‌ను జంగ్రా చిత్తు చేశాడు. తొలి రౌండ్ నుంచే ప్రత్యర్థులపై పంచులు కురిపించిన మన్‌దీప్... పదో రౌండ్ వరకు అదే జోరు కొనసాగించాడు. దీంతో బ్రిటన్ బాక్సర్ పరాజయం పాలయ్యాడు. ప్రపంచ టైటిల్‌ను సాధించిన మన్‌దీప్... భారత్ కీర్తిని మరింత పెంచాడు.హర్యానాకు చెందిన మన్‌దీప్... ఒలింపిక్స్‌లో రజత పతక విజేత రాయ్ జోన్స్ దగ్గర శిక్షణ పొందాడు. 2014 గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం గెలుచుకున్నాడు. తన కెరియర్‌లో మొత్తం 12 ఫైట్లలో 11 సార్లు విజయం సాధించాడు. ఏడు సార్లు నాకౌట్ విజయాలు సాధించాడు. ప్రపంచ టైటిల్ గెలుచుకున్న సందర్భంగా మన్‌దీప్ మాట్లాడుతూ.. ''ఇది నా జీవితంలో అతి పెద్ద విజయాల్లో ఒకటి. నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నా. ఈ టైటిల్ గెలవడానికి ఎన్నో ఏళ్లుగా కషి చేస్తున్నా. నా దేశ కీర్తిని మరింత పెంచడం గర్వంగా ఉంది'' అని తెలిపాడు.

# సూరత్ వజ్రాల కార్మికులను ఆదుకోండి: కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** సూరత్‌లో గడిచిన 18 నెలల్లో ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది వజ్రాల ఫ్యాక్టరీలలో పని చేసే కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, తక్షణమే వజ్రాల కార్మికులను ఆదుకునేందుక ఆర్థిక సహాయం చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. సూరత్‌లో 18 నెలల్లో ఉద్యోగాలు కోల్పోడం, ఫ్యాక్టరీలు మూతపడడంతో 71 మంది వజ్రాల కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ప్రపంచ వజ్రాల వ్యాపారం గొప్ప కేంద్రాలలో సూరత్ ఒకటని, దానికి సుదీర్ఘ చరిత్ర ఉన్నదన్నారు. గుజరాత్‌లో 25 లక్షల మంది కార్మికులు వజ్రాల పరిశ్రమలో పనిచేస్తున్నట్లు అంచనా అని, అందులో 8–10 లక్షల మంది వరకు సూరత్‌లోనే పని చేస్తున్నారని తెలిపారు. ల్యాబ్‌లలో ఉత్పత్తి అయ్యే వజ్రాల రాకతో ప్రపంచవ్యాప్తంగా వజ్రాల పరిశ్రమ ప్రమాదంలో పడిందని, అందులో సూరత్‌పై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు సుమారు 15 వేల మంది కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించారని వెల్లడించారు. వజ్రాల కార్మికులు శాశ్వత ఉద్యోగులు కాదని, వారి వివరాలు నమోదు చేసి ఉండవని, అందుకే ప్రభుత్వం వద్ద వారి వివరాలు ఉండవని, అలాగే వారికి ప్రత్యేకమైన సంక్షేమ పథకాలు లేవని వివరించారు. తక్షణమే వజ్రాల ఉద్యోగుల వివరాలను సేకరించాలని, వారిని నమోదు చేయింఆచలని, అలాగే మార్కెట్ సంక్షోభంలో చిక్కుకున్న వారికి ఆర్థిక సహాయం అందించాలని జైరామ్ రమేశ్ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

# లుక్ ఔట్ సర్క్యులర్ సబబు కాదు:సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ :** దివంగత నటుడు సుశాంత్ రాజ్‌పుట్ మాజీ హౌజ్ మేనేజర్ వ్యతిరేకంగా జారీచేసిన లు క్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌ఒసి)ని రద్దు చేసిన ఉత్తర్వుపై కేంద్రం అభ్యర్థనను మంగళవారం సుప్రీం కోర్టు కొట్టివేసింది.సుప్రీంకోర్టు జస్టిస్ బిఆర్.గవా యి, కెవి.విశ్వనాథన్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసు విచారణకు వచ్చిన సందర్భంగా ఏ ఒక్కరు కూడా హాజరుకాకపోవడాన్ని గుర్తించిన ధర్మాసనం కేంద్రం అభ్యర్థనను కొట్టివేసింది.'ఈ అభ్యర్థనలో ఏవిధమైన ప్రయోజనం కూడా లేదన్న విషయం తాము గమనించాం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎల్‌ఒసి జారీ చేయడం అనేది దర్యాప్తు సంస్థలకు ఒక భరోసాగా ఉంటుందని, నిందితులు విదేశాలకు పారిపోకుండా ఉండేందుకు ఇది ఉపకరిస్తుందని వెల్లడించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) సమ్యేల్ మిరాండ అనే ఒక వ్యక్తిపై జారీచేసిన ఎల్‌ఒసిని ఏప్రిల్ 10న బాంబే హైకోర్టు రద్దు చేసింది. ఎల్‌ఒసి రద్దును సవాల్ చేస్తూ కేంద్రం సుప్రీంకోర్టులో పిటిషన్ దా ఖలు చేసింది. మిరాండ హైకోర్టు ముందు తన వాదనను వినిపిస్తూ 2020లో తనపై ఎల్‌ఒసి జా రీ చేశారని, పోలీసులు ఇప్పటి వరకూ ఆ నివేదిక ఇవ్వలేదని చెప్పారు. సిబిఐ విచారణకు తాను స హకరిస్తున్నప్పుడు, సిబిఐ సమన్లు జారీ చేసినప్పుడల్లా తాను సిబిఐ కార్యాలయానికి హాజరు అవుతున్నప్పుడు తనపై నిరవధికంగా ఎల్‌ఒసి జారీ చేయడం కరెక్ట్ కాదని తెలిపారు. మూడున్నర సంవత్సరాలుగా ఎల్‌ఒసి పెండింగ్‌లో ఉం చారంటే విదేశీ ప్రయాణం చేసేందుకు పిటిషనర్‌కు ఉన్న హక్కును హరించడమే అవుతుందని, స్వేచ్ఛగా ప్రయాణం చేసేందుకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కింద తనకు ఉన్నటువంటి ప్రాథమిక హక్కునుఉల్లంఘించడమేనన్నది స్పష్టం అవుతోందని సామ్యేల్ మిరాండ ధర్మాసనానికి నివేదించారు.

# మహారాష్ట్రలో ఆ ఇద్దరి మధ్యే ఎన్నికల పోరు: ఉద్ధవ్



**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ప్రధాన రాజకీయ పార్టీల ప్రచారం ఊపందుకుంది. అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా అధికార, విపక్ష కూటముల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కొల్హాపుర్‌లోని రాధానగరిలో మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహారాష్ట్రను ప్రేమించేవారు, ద్వేషించేవారి మధ్యే ఈ ఎన్నికల యుద్ధం జరుగుతోందన్నారు. రాష్ట్రాన్ని ప్రేమించే శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్‌పీ)లు మహా వికాస్ అఘాడీ కూటమిగా బరిలో ఉన్నాయని తెలిపారు. బీజేపీ మాత్రం అధికారం కోసం ప్రజలను మతం, కులాల ఆధారంగా విభజించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. బీజేపీకి సాయం చేస్తున్నవారు రాష్ట్రానికి వ్యతిరేకులేనని ఆయన వ్యాఖ్యానించారు.

### అసమ్మతి నేతలపై వేటు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ రాష్ట్రంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. బుజ్జగింపులకు దిగిరాని నేతలపై రాజకీయ పార్టీలు చర్యలకు పూనుకుంటున్నాయి. శివసేన (యూబీటీ) పార్టీ తమ అసమ్మతి నేతలపై వేటు వేసింది. నామినేషన్‌లు ఉపసంహరించుకోకపోవడం వల్లే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు దాఖలు చేసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. దీంతో పార్టీ నుంచి టికెట్ అందని నేతలు ఆయా నియోజకవర్గాల నుంచి స్వతంత్ర్య అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. వాటిని ఉపసంహరించుకోవాలని పార్టీ ఆదేశించింది. అయినప్పటికి నేతలు వాటిని వెనక్కి తీసుకోకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు పార్టీ కార్యాలయం పేర్కొంది. వీరిలో భివాండి తూర్పు ఎమ్మెల్యే రూపేశ్, విశ్వ నాందేకర్, చంద్రకాంత్ ఘుగుల్, సంజయ్ అవారి, ప్రసాద్ ఠాక్రే ఉన్నారు.

# కృత్రిమ వర్షాలకు అనుమతించండి

## కేంద్రానికి ఢిల్లీ ప్రభుత్వం విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి, వాయు నాణ్యతను పెంపొందించేందుకు కృత్రిమ వర్షం కురిపించేందుకు అనుమతించాలని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్‌రాయ్ విజ్ఞప్తి చేశారు. దీపావళి తరువాత ఢిల్లీలో కాలుష్యం స్థాయి 400లకు చేరిందని, వాతావరణ నిపుణుల ప్రకారం రాబోయే పది రోజులు కీలకమని మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను తగటబెట్టడాన్ని నిరుత్సాహపరిచేందుకు బుధవారం నుంచి ప్రచార కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందుకు 588 బృందాలు పని చేస్తాయని, రాజధానిలో బహిరంగంగా చెత్త కాల్చే ఘటనలను ప్రభుత్వానికి తెలియజేస్తాయన్నారు.మంగళవారం నాడు ఢిల్లీలోన్ని కొన్ని ప్రాంతాలలో గాలి నాణ్యత పడిపోవడంతో ప్రజలు విషవాయువులను పీల్చే పరిస్థితి నెలకొంది. ఉదయం 9 గంటల ప్రాంతంలో గాలినాణ్యత సూచి 384 వద్ద ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలియజేసింది.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
బుధవారం, నవంబరు 06

## జె & కె అసెంబ్లీ తొలి సమావేశం

దశాబ్దం తర్వాత ఎన్నికల అనంతరం జమ్మూ–కశ్మీర్(కేంద్రపాలిత ప్రాంతం) శాసన సభ తొలి సమావేశం సోమవారం జరిగింది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తమ ప్రసంగం లో ఈ కేంద్రపాలిత ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ అవసరాన్ని వక్కాణించటం ఆహ్వానించదగింది. ఆ మాట చట్టసభలో చెప్పటానికి ఆయనకెటువంటి ఇబ్బందీ లేదు. ఎందుకంటే, ఎన్నికలకు ముందే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరిస్తామని ప్రకటించారు. అయితే అది ఎప్పుడన్న స్పష్టత ఇవ్వలేదు. ఎన్నికలకు ముందే ఆ హోదా పునరుద్ధరించినట్టయితే జమ్మూ–కశ్మీర్ ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు దోహదకారి అవుతుందన్న అభిప్రాయాలను వారు పట్టించుకోలేదు. వారి రాజకీయ, పాలనా వ్యూహాలు వారివి. జమ్మూ ప్రాంతంలో అత్యధిక సీట్లను గెలుచుకోవటంలో (43 స్థానాల్లో 29 గెలిచి ఆ ప్రాంతంలో అతిపెద్ద పార్టీగా, అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీగా మాత్రమే అవతరించింది), బిజెపి విఫలమైంది. కశ్మీర్‌లోయ ప్రాంతంపై దాని అంచనాలు, ఎత్తుగడలన్నీ విఫలమై ఒక్క సీటూ దక్కలేదు. అయితే నేషనల్ కాన్ఫరెన్స్ రెండు ప్రాంతాల్లో కలిపి 43 సీట్లు గెలుచుకుని రాష్ట్రంలో అధికారం చేబట్టటం తెలిసిందే. పిడిపి, ఇతర వేర్పాటువాద గ్రూపులు, ఇండిపెండెంట్లు పెద్ద సంఖ్యలో గెలిచి ఉంటే పరిస్థితి ఇబ్బందికరంగా ఉండేది. మంత్రివర్గం తొలి సమావేశం కూడా రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణకై కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ ఆమోదించిన తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్‌కు అందజేసింది. దాన్ని ఆయన ఆమోదించారు. ఈ డిమాండ్‌కు సంబంధీకులందరి ఆమోదం ఉన్నందున కేంద్రప్రభుత్వం సత్వరం అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవటం మంచిది. రానున్న పార్లమెంటు శీతాకాల సమావేశంలో ఆ చర్య తీసుకుంటుందని ఆశించుదాం. మోదీ ప్రభుత్వం బిజెపి, సంఘ్‌పరివార్ కోర్ ఎజండాలో రెండవ ప్రధానాంశమైన ''ఆర్టికల్ 370 రద్దు''ను 2019లో తిరిగి అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే – ఆగస్టు 5న పార్లమెంటులో తీర్మానం ద్వారా నెరవేర్చుకుంది. ఆ విధంగా జమ్మూ–కశ్మీర్‌కున్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయటంతోపాటు రాష్ట్రాన్ని జమ్మూ–కశ్మీర్, లఢాక్ పేర్లతో రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టి, రాష్ట్ర స్థాయిని కుదించింది. రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ హామీలో లఢాక్ ఉన్నట్లు లేదు. ఆ ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తికై అక్కడి ప్రజాశ్రేణులు ఆందోళన చేబట్టి తమ వాణిని ఢిల్లీదాకా తీసుకెళ్లాయి. ఆర్టికల్ 370 పునరుద్ధరణ ఆకాంక్ష, డిమాండ్ కశ్మీర్ ప్రజల్లో సెంటిమెంట్‌గా ఉన్నందున, తీవ్రవాద, వేర్పాటువాద విభాగాలు దాన్ని ఉపయోగించుకుని భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నందున, త్వరలో రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ ద్వారా మెజారిటీ మనోభావాలకు సాంత్వన చేకూర్చవచ్చు.

శాసనసభ తొలిరోజు సమావేశం కాగానే, ప్రోటోకాల్‌కు విరుద్ధంగా పిడిపి లెజిస్లేటర్ వహీద్–ఉర్–రెహ్మాన్ పర్రా ఆర్టికల్ 370 రద్దుపై తీర్మానం ప్రతిపాదించి దాన్ని చర్చకు చేబట్టాలని స్పీకర్‌పై ఒత్తిడి తేవటం విస్మరించరానిది. దానిపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సమాధానం అతని సందిగ్ధావస్థను సూచిస్తున్నది. తాము అధికారంలోకి వస్తే అసెంబ్లీ తొలి సమావేశంలోనే ఆర్టికల్ 370 పునరుద్ధరణపై తీర్మానం తీసుకువస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ కూడా చెప్పింది. అది అసాధ్యమని వారికి తెలియంది కాదు. ''2019 ఆగస్టు 5న తీసుకున్న నిర్ణయాన్ని జమ్మూ–కశ్మీర్ ప్రజలు ఆమోదించలేదన్నది వాస్తవం. వారు ఆమోదించి ఉంటే నేడు ఎన్నికల ఫలితాలు భిన్నంగా ఉండేవి. అందువల్ల దాని పునరుద్ధరణ కోరే తీర్మానాన్ని సభ ఏ రూపంలో ఆమోదించాలో కలిసికట్టుగా చర్చించుదాం'' అని ఆయన శాసనసభలో చెప్పారు. అందువల్ల అది జమ్మూ–కశ్మీర్ ప్రజలకు సున్నితమైన సమస్యగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ, ఉద్యోగాలు, ఉపాధుల కల్పన, టూరిజం అభివృద్ధి, అర్హులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ తదితర అభివృద్ధి కార్యకలాపాలను వేగవంతం చేయటం, కఠినంగా శాంతి–భద్రతల నిర్వహణ వంటి చర్యల ద్వారా ప్రజల్లో విశ్వాస కల్పన చర్యలు తక్షణావసరం.

# జిడిపి వృద్ధి పైకి..విదేశీ పెట్టుబడులు కిందకి !

సుబ్రతా మజుందర్

దేశంలోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) ఐదేళ్ళకాలంలో అత్యంత కనిష్టస్థాయికి క్షీణించిపోయాయి. ప్రపంచ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)గతంలో మాదిరిగా కాకుండా కొత్త పంథాలో వెళుతున్నాయి. భారత్ ఈ కొత్త మార్గాన్ని అనుసరించడంలో వెనుకబడి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అందిపుచ్చుకోలేకపోతున్నది. నిజానికి ఆర్థికవ్యవస్థ ఎన్నడూలేనంత వృద్ధి సాధించినప్పటికీ ఎఫ్‌డిఐ అత్యంతక్షీణస్థాయికి చేరింది. 2021–22 లో 59.636 మిలియన్ డాలర్లుగా నమోదైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2023–24 ఆర్థిక సంవత్సరంలో 44.423 మిలియన్ డాలర్లకు తగ్గిపోయాయి. జిడిపి (స్థూల జాతీయోత్పత్తి) వృద్ధిలో పెరుగుదలకు ఈ క్షీణత పూర్తి విరుద్ధంగా ఉంది. 2021–22లో జిడిపి వృద్ధి 6.7 శాతంగా నమోదైతే, 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధి 7.2 శాతంగా నమోదైంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వృద్ధి–జిడిపి పెరుగుదల మధ్య కనిపిస్తున్న ఈ వ్యత్యాసం అందరి భృకుటినీ ముడిపడేట్టు చేస్తోంది. ప్రతిఒక్కరిలో అనుమానాలకు దారితీస్తోంది. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఎఫ్‌డిఐపైనే ఎక్కువగా ఆధారపడే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్నదేశానికి ఇదే ప్రాముఖ్యతగల అంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహంలో ఏ మాత్రం ఒడిదొడుకులు ఎదురైనాగానీ భారత్ వంటి అభివృద్ధిచెందుతున్నదేశాలు అభేద్యంగా లేకపోవడం కూడా ఇందుకు ఒక కారణం. భారతదేశం కరోనా మహమ్మారిని అధిగమించే కీలకసమయంలో రష్యాను ఆశ్రయించింది. అప్పటినుండీ తక్కువ ధరలకు చమురు దిగుమతి చేసుకుంటున్నది. ఆ విధంగా ప్రపంచవ్యాప్తంగా వచ్చిన చమురు సంక్షోభాన్ని తట్టుకుని జిడిపి వృద్ధిలో పెరుగుదల సాధించింది. మానవ వనరుల శక్తిసామర్థ్య ప్రయోజనాలతో తిరిగి పుంజుకుని దేశీయమార్కెట్‌ను విస్తరించుకుంటున్నది. విదేశీ ప్రత్యక్షపెట్టుబడులు సంపాదించడంలో పైచేయి సాధించడానికి ఇటువంటి అనేక అనువైన కారకాలు ఉన్నప్పటికీ కూడా ఆర్థికవ్యవస్థకు విదేశీ ప్రత్యక్షపెట్టుబడులు అనుకున్నస్థాయిలో అనుసంధానం కాకపోవడంతో భారతదేశం నిరాశానిస్పృహల్లో ఉంది. గడచిన మూడు సంవత్సరాలుగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వృద్ధిలో నాటకీయమైన మార్పులు సంభవిస్తున్నాయన్న విషయాన్ని ఈ పరిణామాలు తెలియజేస్తున్నాయి. ఇప్పటివరకూ వస్తువు డిజైనింగ్ దగ్గరనుండి సదరు వస్తువులను తెచ్చి మార్కెట్‌లో గుమ్మరించే వరకూ క్రియాశీలంగా పనిచేసే కీలక జివిసి (గ్లోబల్ వాల్యూ చైన్) కారకాలతో ప్రపంచ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అనుసంధానమై ఉన్నాయి. సుమారు ప్రపంచ ఎఫ్‌డిఐలో మూడోవంతు ప్రత్యక్ష పెట్టుబడులు జివిసికే మళ్ళుతున్నాయి. పెట్టుబడులను జివిసికి మళ్ళించడంలో ప్రపంచంలో చైనా అగ్రస్థానంలో ఉంది.

**తయారీ రంగాన్ని వదిలి సేవా రంగానికి మళ్ళుతున్న ఎఫ్‌డిఐ**

కరోనా మహమ్మారి ముగిశాక భౌగోళిక రాజకీయ ఉద్రిక్తలు పెరిగాయి. దీంతో ఎఫ్‌డిఐకి జివిసికి మధ్య ఉన్న అనుసంధాన వ్యవస్థ విచ్ఛిన్నమైంది. ఎఫ్‌డిఐ –జివిసి మధ్య పరస్పర అవినాభావ అనుసంధానం దీర్ఘకాలం కొనసాగితేనే స్థూలజాతీయోత్పత్తివృద్ధి, వాణిజ్యవృద్ధి జరుగుతుంది. కానీ వాణిజ్యం–అభివృద్ధిపై పనిచేసే ఐక్యరాజ్యసమితి సదస్సు (యుఎన్‌టిఏసిటిడి) ఇచ్చిన నివేదిక ప్రకారం, విదేశీ ప్రత్యక్షపెట్టుబడులుపెట్టే విధానాలలో చాలా మార్పులు వచ్చాయి. ఈ మార్పులవల్ల జిడిపివృద్ధి–వాణిజ్యవృద్ధికి దోహదంచేసే జిడిపి–జివిసి మధ్య అనుసంధానం ఎంతోకాలం కొనసాగే పరిస్థితి లేదు. 2010 నుండీ ప్రపంచ జిడిపి, వాణిజ్యం రెండూ ఏటా సగటున వరుసగా 3.4 శాతం, 4.2 శాతం మేరకు వృద్ధి చెందుతున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగినప్పటికీ కూడా జిడిపి–వాణిజ్యాలు పెరుగుదల చూపిస్తున్నాయి. కానీ తయారీ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వృద్ధి మాత్రం స్తంభించిపోయి దాదాపు శూన్యస్థాయికి చేరుకుందని యుఎన్‌టిఏసిటిడి నివేదిక పేర్కొంది. దేశీయ పరిశ్రమలకు మేలు చేసేందుకు ప్రభుత్వాలు అనుసరించే విధానాలు, అంతర్జాతీయ ఉత్పత్తిలో, జివిసిలో మార్పులు గమనించిన మదుపర్లు ఆచితూచి అడుగువేయడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి కారకాలవల్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో మందగమనం వచ్చింది. అభివృద్ధిచెందుతున్న దేశాలకు ఎఫ్‌డిఐ ప్రవాహంలో మార్పులు వచ్చాయి. ఇన్వెస్టర్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తరలించడానికి ఐదు ప్రధాన కారకాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. సేవారంగానికే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం, పర్యావరణ సాంతికే పరిజ్ఞానంలో పెట్టుబడులు పెరగడం, హైటెక్ రంగాలపై ప్రధాన దృష్టి, పేద దేశాలకు పెట్టుబడులు తరలించడాన్ని తగ్గించడం, ఉద్రిక్తలు వంటి ఐదు ప్రధాన కారకాల ఆధారంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వ్యూహం కొనసాగుతోందని యుఎన్‌టిఏసిటిడి తన నివేదికలో ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ కారణావల్ల 2023, 2024 సంవత్సరాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తయారీ రంగం నుండి సేవారంగంవైపు దారి మార్చుకున్నాయి. ఉన్న మౌలిక సదుపాయాలనే సరికొత్త పద్ధతులలో మార్చి అందరికీ అందుబాటులోకి తెచ్చే సేవారంగానికి చెందిన గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తరలివెళుతున్నాయి. పలుదేశాలమధ్య ఈ విధంగా దారిమళ్ళిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వాటా గడచిన రెండు సంవత్సరాలలో 66 శాతం నుండి 81 శాతానికి పెరిగింది.




**భారత్‌లో తగ్గి 'ఏసియన్'లో పెరిగిన అమెరికా పెట్టుబడులు**

తయారీరంగంలో విదేశీ ప్రత్యక్షపెట్టుబడులు తీవ్రస్థాయిలో క్షీణించిపోవడానికి ముందునుండీ గడచిన ఇరవైయేళ్ళుగా ఎఫ్‌డిఐ ఉద్ధృతి ఈ రంగంలో స్తంభించిపోయింది. ఇలా క్రమంగా ఎఫ్‌డిఐలో వచ్చిన వ్యూహాత్మక మార్పులు భారతదేశంపై చాలా పెద్ద ప్రభావం చూపించాయి. సేవారంగం తర్వాత రెండోస్థానంలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్/హార్డ్‌వేర్ (ప్రధానంగా సాఫ్ట్‌వేర్)లకు భారీస్థాయిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అందుతున్నాయి. గడచిన మూడేళ్ళుగా ఈ ధోరణి కొనసాగుతున్నది. ఇలా తయారీ యేతర రంగాలకు చేరుతున్న మొత్తం ఎఫ్‌డిఐలో మూడోవంతు (2023–24 సంవత్సరంలో 32.4శాతం) భారత్‌కు వచ్చింది. అదే సమయంలో ఈ మూడేళ్ళలో ఎఫ్‌డిఐలు లేకపోవడంవల్ల తయారీరంగం నీరుగారిపోయింది. ఉదాహరణకు దేశంలో రెండేళ్ళక్రితం మూడో అతిపెద్ద స్థానంలో ఉన్న ఆటోమొబైల్ రంగంలోకి 11.2 శాతం ఎఫ్‌డిఐ వస్తే గడచిన ఆర్థిక సంవత్సరంలో ఆ ఎఫ్‌డిఐ 3.4 శాతానికి క్షీణించింది. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, సర్వీస్ సెక్టార్లు రెండూ పరిమాణంలో చాలా చిన్నవిగనుక సాధారణంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులన్నీ తయారీ–తయారీయేతర రంగాలలోనే పంపిణీ అవుతాయి. సేవారంగంలోనే కలిసి ఉండే బ్యాంకింగ్, బీమా, ఇతర బ్యాంకింగేతర రంగాలు చాలా భిన్నమైనవి. ఈ మధ్య రష్యా–ఉక్రేన్ యుద్ధం, రష్యాపై ఆంక్షలు, భారత్–చైనామధ్య సుదీర్ఘ జగడం వంటివి కూడా సాధారణ పెట్టుబడుల పద్ధతులలో మార్పులు తెచ్చాయి. దీనివల్ల మదుపర్లతో అస్థిర సంబంధాలు, వ్యూహాత్మక సమతుల విస్తరణకు అవకాశాలు సన్నగిల్లాయని యుఎన్‌టిఏసిటిడి నివేదిక పేర్కొంది. భారత్‌కు సంబంధించి సి+1 (చైనా ప్లస్ వన్ వ్యూహం) వ్యూహం కింద భారత్ లో 2021–22లో 13,823 మిలియన్ డాలర్ల మేరకు భారీస్థాయిలో పెట్టుబడులు సమకూర్చిన రెండవ అతిపెద్ద ఫారిన్ అన్వెస్టర్ అమెరికా. కానీ 2023–24 నాటికి ఈ పెట్టుబడులు 4,998 మిలియన్ డాలర్లకు అంటే 63 శాతం మేరకు తగ్గిపోయాయి. దీనికి భిన్నంగా ''ఏసియన్'' (ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం)లో అమెరికా పెట్టుబడులు 2021లో కంటే 2023 సంవత్సరంలో 112 శాతం మేరకు పెరిగాయి.

**ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీస్‌లో వెనుకబడిన భారత్**

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సమస్యలు పేట్రేగడంతో ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీస్ (పర్యావరణ సాంకేతిక పరిజ్ఞానం)లో అంటే పవన, సౌర విద్యుత్ రంగాలలో ఎఫ్‌డిఐ గణనీయ వేగంతో పెరుగుతున్నది. 2020లో ఎలక్ట్రికల్, బ్యాటరీవాహనాల తయారీలో 61 శాతంగా ఉన్న ఎఫ్‌డిఐ 2023 నాటికి 171 శాతంమేరకు పెరిగింది. ముఖ్యంగా ఎలక్ట్రికల్ వాహనాలు, బ్యాటరీల తయారీలో భారత్ వనుకబడింది. ఈ రంగం శైశవదశలో ఉంది. ప్రస్తుతం దేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో కేవలం 0.9 మిలియన్ ఎలక్ట్రికల్ కార్లు మాత్రమే ఉత్పత్తయ్యాయి. అదేసమయంలో దేశంలో 4.9 మిలియన్ల పెట్రోలు,డీజిలు ప్యాసింజర్ కార్లు ఉత్పత్తి అయ్యాయి. మనదేశం ఈ రంగంలో చాలా వెనుకబడిందని దీని అర్థం. ఈ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను సంపాదించకుండా దూరంగా ఉండిపోయిందని 'యుఎన్‌టిఏసిటిడి' నివేదిక స్పష్టం చేసింది. సరికొత్తగా రూపుదిద్దుకుంటున్న మార్కెట్లను ప్రోత్సహించేందుకే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులన్నీ తరలివెళుతున్నాయి. దీనిని భారత్ అందిపుచ్చుకోవాలి. ఈ దశాబ్దాంతానికి మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారతదేశం ప్రపంచంలో ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇంతవరకూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను కొత్త మార్గాలలో ఆకర్షించలేకపోతున్నది. మొబైల్‌ఫోన్స్ తయారీలో రెండోస్థానంలో ఉన్నప్పటికీ సెమీకండక్టర్ తయారీరంగంలోకి భారత్ ఇంకా ప్రవేశించాల్సి ఉంది. అందువల్ల ప్రపంచ విదేశీపెట్టుబడుల వ్యూహంలో మార్పులు సంభవించాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రధానంగా తయారీ రంగం నుండి పూర్తిగా దారిమళ్ళిపోయి ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీస్, సర్వీస్ సెక్టార్‌లకు తరలివెళుతున్నాయి. అందువల్ల ఉత్పత్తితో ముడిపడిన ప్రోత్సాహకాలు, ప్రపంచ సరఫరా వ్యవస్థ కేంద్రంగా రూపుదిద్దుకోవడం వంటి కేంద్ర ప్రభుత్వ విధానపరమైన చొరవలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిదారులను ఆకర్షించలేవు.

(ఐపిఎ సర్వీస్)

# ఉపాధిని బట్టి శ్రమజీవుల వర్గీకరణ !

ఉద్యోగ, ఉపాధి విధుల ఆధారంగా ప్రజలను పలు రకాలైన కలర్ కాలర్డ్ వర్గాలుగా వర్గీకరిస్తారు. వీటిలో వ్యక్తులు చేసే పని స్వభావాన్ని బట్టి బ్లూకాలర్, వైట్‌కాలర్ అనబడే ముఖ్యమైన వర్గాలుగా ప్రజలను విభజిస్తారు.

**బ్లూ– కాలర్‌వర్గం(అసంఘటిత, స్వల్ప ఆదాయ శ్రామిక, కార్మిక వర్గాలు):**

అసంఘటిత, కార్మిక, శ్రామిక వర్గ ప్రజల్లో మాన్యువల్ లేబర్లు, రోజు కూలీలు, వ్యవసాయ శ్రామికులు, మాన్యుఫాక్చరింగ్ రంగంలో కార్మికులు, భవన నిర్మాణ రంగ శ్రమజీవులు, మైనిమగ్ రంగ శ్రామికులు లాంటి వర్గాలను బ్లూకాలర్ వర్కర్స్గా పిలుస్తారు. ఈ బ్లూకాలర్ వర్గ జీవులు శారీరక శ్రమ చేయడం, యంత్రాల రిపేర్లు చేసే మెకానిక్స్/సహాయ సిబ్బంది, జంతువుల పెంపకం/పోషణకు నియమించబడే పేదలు, వెల్డర్లు, ఎలక్ట్రీషియన్లు, పవర్ ప్లాంట్ ఆపరేటర్లు, డ్రైవర్లు, పరిశ్రమల్లో యంత్ర ఆపరేటర్లు, గనుల్లో కూలీలు, టైర్లు/ట్యూబుల రిపేరర్లు, దినసరి/గంటలను బట్టి పనులు చేసే కూలీలు, మట్టి పనులు చేసే వారు, ఇటుక బట్టీల్లో పని చేసే శ్రమ జీవులు, కేబుల్ ఇన్స్టలేషన్ చేసే వారు, ఇంటి/బయట పని చేసే మనుషులు, బట్టలు ఉతికే వారు, క్షవరం చేసే వారు, స్వల్ప ధనానికి హార్డ్ పనులు చేసే జనులు, తవ్వకాలను చేసే వారు, వీధుల వెంట అమ్మకాలు చేసుకునే జనులు, మునిసిపల్ కార్మికులు, పారిశుద్ధ్య సిబ్బంది మొదలగు వర్గాల బడుగులు వస్తారు. ఈ వర్గపు శ్రామికులకు కళాశాల విద్యకు దూరంగా, నైపుణ్యాల కొరత లేదా వారు చేసే పనుల్లో నేర్చుకున్న నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ఆదాయం పొందుతారు. ఈ వర్గపు శ్రమజీవులు బ్లూ జీన్స్ లేదా డార్క్ కలర్ యూనిఫామ్స్ ధరించి పనులకు వెళతారు. సాధారణంగా సామాజికంగా వెనుకబడిన వర్గాల పేదలు ఈ వర్గంలో అధికంగా ఉంటారు. ఈ వర్గపు శ్రమ జీవులు ఉపాధి అభద్రత వలయంలో అతి చవకగా తమ శ్రమను అమ్ముకుంటారు. వీరు కూలీ లేదా ఉపాధికి డబ్బులను పొందుతారు. శ్రమను నమ్మిన పేదల బ్లూకాలర్ ఉపాధులకు కొరత ఉండదు. వీరిని బ్లూకాలర్ వర్గ బడుగులంటూ ఎగతాళి చేసే ప్రబుద్ధులు కూడా ఉండడం విచారకరం.

**వైట్–కాలర్ వర్గం (అధిక ఆదాయం కలిగిన ఉద్యోగులు):** ఆఫీసుల్లో విధులు నిర్వహించే అధిక నెలసరిలా/వార్షిక వేత నం పొందుతున్న ఉద్యోగులను వైట్‌కాలర్ వర్గ ప్రజలు అంటాం. కాళ్లకు బూట్లు, కోటు, షర్టు టై ధరించి తెల్ల కాలర్ కలిగిన వస్త్రాలు ధరించడం వల్ల ఆ వర్గానికి చెందిన ఉద్యోగులను వైట్‌కాలర్ వర్గంగా నామకరణం చేశారు. అటెండర్స్, క్లర్కులు, సూపరింటెండెంట్స్, ఆఫీసర్లు, అడ్మినిస్ట్రేటర్స్, మేనేజ్మెంట్ ఉద్యోగులు, సాఫ్ట్వేర్ ఉద్యోగులు, మార్కెటింగ్ సిబ్బంది మొదలగు వర్గాలను వైట్‌కాలర్డ్ వర్కర్స్ అని పిలుస్తాం.



ఈ వర్గపు ఉద్యోగులు అధిక నెలసరి వేతనాలు పొందుతూ ఉన్నత చదువులతో సమాజంలో మంచి గుర్తింపు, మంచి వస్త్రాలు ధరిస్తూ సౌకర్యవంతమైన/విలాసవంతమైన జీవన విధానాన్ని కలిగి, బ్లూకాలర్ వర్గ శ్రమను పొందుతూ ఉంటారు. వైట్‌కాలర్ ఉద్యోగులు తక్కువ సమయం విధులు నిర్వహిస్తూ ఎక్కువ వేతనం పొందుతారు. వైట్‌కాలర్ ఉద్యోగాలకు గట్టి పోటీ ఉంటూనే ఉద్యోగాల కొరత అధికంగా ఉంటుంది.

**గోల్డ్–కాలర్(ఉన్నత విద్య, వేతనం/నైపుణ్యాలు వర్గం):** ఉన్నత విద్యతో తమతమ రంగం అత్యధిక వేతనం, గౌరవం పొందుతున్న డాక్టర్లు, సైంటిస్టులు, అత్యున్నత స్థాయి ప్రభుత్వ ప్రైవేట్ అధికారులు, ఇంజనీర్లు, లాయర్లు, పైలెట్స్, యూనివర్సిటీ అధ్యాపకులు, చార్టర్డ్ అకౌంటెంట్స్, ఉన్నత వ్యాపార వర్గాలు లాంటి వారిని గోల్డ్‌కాలర్డ్ వర్గంగా గుర్తిస్తాం.

**పింక్ —కాలర్ వర్గం(నర్సింగ్ మహిళా స్టాఫ్):**

ఆసుపత్రుల్లో పారామెడికల్ మహిళా సిబ్బంది, మహిళా సెక్రటరీ, ఉపాధ్యాయ, సోషల్ వర్క్, చైల్డ్కేర్ లాంటి విధులు నిర్వహించే మహిళలను పింక్‌కాలర్ ఉద్యోగులు పిలుస్తాం.

**గ్రీన్––కాలర్ వర్గం(పర్యావరణ హిత ఉద్యోగులు):**

నేటి డిజిటల్ యుగంలో కాలుష్యం పెరగడంతో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం గ్రీన్ రంగు ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఈ వర్గపు ఉద్యోగులను గ్రీన్‌కాలర్ వర్గంగా వర్ణిస్తాం.

**రెడ్–కాలర్ వర్గం(రుణాలతో జీవితాలు గడిపే వర్గం):**

రైతులు, రుణ నిధుల నుంచి వేతనాలు పొందే జనులు రెడ్ కాలర్ వర్గ జనులుగా పిలువబడుతున్నారు.

**సిల్వర్––కాలర్‌వర్గం(పదవీ విరమణ అనంతరం పనిచేసే వర్గం):**

ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత కూడా వయోవృద్ధ దశలో పనిచేయడానికి సిద్ధపడిన వారిని సిల్వర్‌కాలర్ వర్గ ఉద్యోగులుగా పిలుస్తాం. మిలటరీలో సేవలు అందించే ఉద్యోగులను బ్రౌన్‌కాలర్ వర్గంగా, కొంత నైపుణ్యం కలిగి బ్లూకాలర్తో పాటు వైట్‌కాలర్డ్ ఉద్యగ విధులను నిర్వహించే వారిని పర్పుల్‌కాలర్ ఉద్యోగ వర్గంగా, పోలీస్/అగ్నిమాపక సిబ్బంది/టీచర్స్/హాస్పటల్ సిబ్బంది/క్యాబ్‌భద్రత సేవలు/బిపిఓ లాంటి ఉద్యోగ వర్గాలను గ్రేడ్‌కాలర్డ్ వర్గంగా వర్గీకరిస్తూ పిలవడం జరుగుతున్నది. వ్యక్తులు నిర్వహించే పనులను బట్టి కలర్‌కాలర్డ్ వర్గంగా నామకరణం చేసినప్పటికీ డిగ్నిటీ ఆఫ్ లేబర్‌కు గౌరవమిస్తూ అన్ని వర్గాల కలర్ కాలర్డ్ ప్రజలను సమానంగా ప్రేమిస్తూ సమసమాజ స్థాపనకు కృషి చేయడానికి ప్రయత్నం చేద్దాం.

లేఖలు

## పత్తికి మద్దతు ధర కల్పించాలి

రాష్ట్రంలో పత్తికి మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదని పెట్టిన ఖర్చులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి. రైతులు దళారుల నుంచి మోసపోకుండ చూడాల్సిన భాధ్యత కూడా అధికారులపైనే ఉంది. పత్తి కోనుగోలుపై రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు నష్టపోకుండా అక్కడక్కడ తడిసిన, చివరి పంట వరకు ప్రభుత్వమే కోనుగోలు చేయాలి.

మిద్దె సురేష్

## అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీలు మాకొద్దు... మా ప్రాణాలే మాకు ముద్దు....

ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ప్రాంతంలో పచ్చని ప్రకృతి ఒడిలో అంబుజా అనే సిమెంట్ ఫ్యాక్టరీ రామన్నపేట ప్రజలకు ఒక విష సర్పంగా మారింది. రామన్నపేట సిరిపురం కొమ్మాయిగూడెం ప్రాంతంలో నెలకొల్పబడుతున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఆ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే హానికరమైన వ్యర్థాలతో శబ్దకాలుష్యం, వాయు కాలుష్యంతో పాటు భూ కాలుష్యం కూడా గురికావడానికి ఆస్కారం ఉంది. ఈ ఫ్యాక్టరీ వల్ల వెదజల్లే కాలుష్యంతో ప్రజల ప్రాణానికి తీవ్రమైన ముప్పుకు గురికావడం జరుగుతుంది. ఈ ప్రాంతంలో ఉండే నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థినీవిద్యార్థులు కాలుష్యం వల్ల విద్యకు కూడా దూరంకావడానికి ఆస్కారం ఉంది. అదేవిధంగా ఇక్కడ వ్యవసాయం ప్రధానంగా ప్రజల జీవనం సాగిస్తారు. ఈ ఫ్యాక్టరీ కాలుష్యంవల్ల వ్యవసాయదారులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది. రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మూసి కంపుతో ఇబ్బంది పడుతున్న రైతులు ధర్మారెడ్డి పల్లి, పిల్లాయిపల్లి కాలువను పూర్తికాక అనేక సంవత్సరాలుగా రైతులు ఇబ్బంది పడుతున్నటువంటి పరిస్థితి మనమందరం చూసి ఉంటాము.

అదేవిధంగా ఈ ప్రాంతంలో చేనేత వృత్తి మీద వేలాది మంది జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ తయారవుతున్న పట్టుచీరలు, కాటన్ చీరలు, బెడ్ షీట్స్, డ్రెస్ మెటీరియల్స్ ఇలా వివిధ రకాల చేనేత వస్త్రాలు తయారుచేసే ఈ ప్రాంతంలో చాలామంది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. చీరలు వేసే క్రమంలో ఆ ఫ్యాక్టరీ నుండి వెలువడే దుమ్ము, ధూళి ఆ పోగులకు అల్లుకొని వస్త్రాల నాణ్యత మొత్తం లోపించి చేనేత పరిశ్రమ మొత్తం నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది.

అదేవిధంగా ఈ ప్రాంతంలో గీత కార్మికులు కూడా చాలా ఇబ్బందులు పడే అవకాశం ఉన్నది. ఒకవేళ ఈ సిమెంట్ ఫ్యాక్టరీ నెలకొల్పబడితే గీత కార్మికులు వారి ఉపాధి కోల్పోయే అవకాశం ఉంటుంది. ఈ సిమెంట్ ఫ్యాక్టరీ నెలకొల్పబడే పరిసరాలుప్రాంతంలో చాలామంది గొర్ల కాపర్లు గుట్టలలో పుట్టలను ఆధారంగా చేసుకొని వారి యొక్క జీవనాన్ని కొనసాగడం జరుగుతుంది. కావున రామన్నపేట మరియు పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలందరూ వేల సంఖ్యల ఉపాధి కోల్పోవటం, ఆరోగ్యం క్షీణించడం వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. కావున ఈ పరిస్థితిని అర్థం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ విషయంపై శ్రద్ధపెట్టి ప్రజల ప్రాణాలు కాపాడగలరు.

నరేష్

# విద్యార్థుల సమాచార నిధి 'అపార్'

విద్యార్థుల సమగ్ర వివరాలను ఒకే దగ్గర నిక్షిప్తం చేసేందుకు కొత్తగా వచ్చిన అపార్ ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుంది. గతంలో వరదలు వచ్చినప్పుడు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు, విలువైన పత్రాలు నీటి పాలయ్యాయి. తిరిగి వాటిని పొందడానికి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో వారి ధ్రువీకరణ పత్రాలతో పాటు విద్యాభివృద్ధి పురోగతిని డిజిటల్ లాకర్లో భద్రపరిచేందుకు ప్రభుత్వం అపార్ రూపొందించింది. విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని సేకరించి ఆటోమేటిక్ పర్మినెంట్ అకౌంట్ రిజిస్ట్రీలో భద్రపరిచి ఎప్పటికీ వుండేలా చేస్తారు. జాతీయస్థాయిలో విద్యార్థికి జీవితకాలం ఉపయోగపడే 12 అంకెల గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. దీని ఆధారంగా విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని అపార్‌లో నమోదు చేస్తారు. క్యూఆర్ కోడ్ తో గుర్తింపు కార్డు జారీ చేస్తారు. ఈ నెంబర్ ఆధారంగా విద్యార్థులు ఎక్కడి నుంచి అయినా ధ్రువీకరణ పత్రాలు పొందే వీలుంటుంది. ఆయా పాఠశాలకు సంబంధించిన పురోగతిని ఆయా పాఠశాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు అపార్‌లో నమోదుచేయడం వల్ల విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులు వేరే విద్యాసంస్థలోకి మారినప్పు డు, ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసినప్పు డు ఈ వ్యవస్థ సులభ సమాచారాన్ని అందుబాటులో ఉంచుతుం ది. పాఠశాల విద్యార్థులు మైనర్లు కావడం వల్ల చట్ట, నైతిక ప్రమాణాలను వ్యక్తిగత సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు తప్పనిసరిగా తల్లిదండ్రుల అనుమతి అవసరం. అపార్ ఐడిని రూపొందించేందుకు తల్లిదండ్రుల అనుమతి కోరుతూ సంబంధిత పాఠశాల యాజమాన్యం అనుమతి పత్రాలు సేకరిస్తారు. ఇటీవల జరిగిన పోషకుల సమావేశంలో కూడా అనుమతి పత్రాలను సేకరించిన సందర్భాలు ఉన్నాయి. తల్లిదండ్రులు ఇచ్చిన అనుమతి పత్రాలను పాఠశాలలో భద్రపరిచి దాని డిజిల్ డిజిటల్ కాపీని పాఠశాల సమన్వయకర్త ద్వారా యు డైస్ ప్లస్ పోర్టల్ లో నిక్షిప్తం చేస్తారు. జాతీయ స్థాయిలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇప్పటికే యు డైస్ ప్లస్‌లో నమోదు చేశారు. వాటికి అనుకూలం గా అపార్ నమోదు చేసుకునేందుకు ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరణతో ఆన్లైన్‌తో ధరకాస్తు చేసుకోవాలి. ఐడి వచ్చిన తర్వాత ధ్రువీకరణ కోసం తల్లిదండ్రులు నమోదు చేసుకున్న ఫోన్ నెంబర్‌కు నిర్ధారణ కోసం ఒటిపి వస్తుంది. దానిని నమోదు చేయగానే ఆన్లైన్‌లో అపార్ గుర్తింపు కార్డు జారీ చేస్తారు. విద్యార్థి బ్యాంక్ ఖాతాతో అనుసంధానం అవుతుంది. ప్రవేశ పరీక్షలు, ఉపకార వేతనాలు, ఉద్యోగ సమయంలో ఈ కార్డు కీలకం కానుంది.

కెఎస్ రెడ్డి

# చదరంగం క్రీడను ఒలింపిక్స్ జాబితాలో చేర్చలేమా !

భారత్‌లో మంచి ఆదరణ కలిగిన క్రీడ చదరంగం. ఐదు సార్లు ప్రపంచ చెస్ చాంపియన్ అయిన విశ్వనాథన్ ఆనంద్ విజయాలు భారత్‌లో చెస్ ఆట యువ భారతానికి ప్రేరణగా నిలిచిం ది. చదరంగం ఆట నాటి చతురంగ క్రీడ నుం చి వచ్చిందని నమ్ముతున్నాం. చెన్నై నగరాన్ని చెస్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా అభివర్ణిస్తారు. పిల్లల నుండి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారి లో చెస్‌పట్ల అత్యంత ప్రజాదరణ ఉన్నది. జైలులో శిక్ష పడిన లేదా అభియోగాలతో జైలుకెళ్లిన ఇన్‌మేట్స్ కూడా చెస్ ఆడతారు. చదరంగం బోర్డుపై మొత్తంగా 204 చతుర్భుజాలు (64+49+ 36+25+16+ 9+4 +1) ఉంటాయి. వీటి లో 64 గడులు మాత్రమే ఆట కు ప్రధానమైనవి. ఇవి నలుపు తెలుపు రంగు గడులుగా కలిగి ఆటగాడి మేధో చురుకుదనానికి ప్రతీకగా, ఇండోర్ క్రీడగా చెస్ (చదరంగం)క్రీడకు పేరుంది. ఎత్తులకు పై ఎత్తు లు వేయడం, రాబోయే ప్రమాదాన్ని పసిగట్టి పావులు కదపడం, ప్రత్యర్థి ఆలోచనల ను అంచనా వేసి చెక్ పెట్టి విజయ పతాకం ఎగురవేయడం ఈ క్రీడ ప్రత్యేకత. హంగే రి, బుడాపెస్ట్‌లో నిర్వహించిన 2024 చెస్ ఒలంపియాడ్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో భారత జట్లు చారిత్రాత్మకంగా ప్రధమ స్థానాల్లో నిలవడం హర్షదాయకం. ఉప్రపంచవ్యాప్తంగా 200లకు పైగా దేశాల్లో 605 మిలియన్ల చెస్ క్రీడాకారులు ఉన్నారు. వీరిలో 8 మిలియన్లు రిజిస్టర్ చేసుకున్నారు. ఇలాంటి క్రీడ కు మంచి ఆదరణ ఉంటేనే యువతలో మేధో వికాసం సిద్ధిస్తుంది. చెస్ క్రీడను అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ (ఎఫ్ఐడిఈ) లేదా వరల్ చెస్ ఫెడరేషన్‌కు కూడా అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసి) గుర్తింపు ఉన్నప్పటికీ ఒలింపిక్స్ జాబితాలో నేటికీ చదరంగం క్రీడకు చోటు దక్కలేదు. నేడు ఒలింపిక్ క్రీడల జాబితాలో 241గేమ్స్ ఉండగా, పది వేలకు పైగా క్రీడాకారులు పాల్గొంటారు. 1924 నుంచీ చెస్ క్రీడను ఒలింపిక్స్ జాబితాలో చేర్చాలనే విఫలయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. సిడ్నీ ఒలింపిక్స్2000లో చదరంగాన్ని ఎగ్జిబిషన్ క్రీడగా ఆడించినప్పటికీ ఒలింపిక్ క్రీడల జాబితాలో నేటికీ చేర్చలేదు. ఒలంపిక్ క్రీడగా చెస్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని, ఈ క్రీడను ఒలంపిక్ క్రీడగా అనుమతించాలని అన్ని రకాల క్రీడాకారు లు, చెస్ క్రీడాకారులు, క్రీడాభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. చదరంగం క్రీడ ఫలితం రావడానికి సమయం ఎక్కువ పట్టడం కూడా ఒక ప్రతిబంధకంగా, వీక్షకుల ఓపికను పరీక్షించే విధంగా మారిందని చెబుతున్నారు.



**చదరంగం క్రీడ గుర్తింపుకు ప్రతిబంధకాలు:**

నేడు చెస్ క్రీడలో కూడా భారీ మార్పులు వచ్చా యి. చెక్ క్రీడ వేగం పెరిగింది. ప్రజాదరణ కూడా విపరీతంగా పెరుగుతోంది. భారత్ లాంటి దేశాల్లో చదరంగం ఆటకు వేల సంఖ్యలో ప్రేక్షకులు కూ డా ఉంటున్నారు. ఐఒసి, ఎఫ్ఐడిఈ, సభ్య దేశాల క్రీడాశాఖామంత్రు లు, దేశాల చదరంగ సమాఖ్యలు కలిసి సమాలోచనలు చేసి సత్వరమే చెస్ ఆటను ఒలింపిక్ జాబితాలో చేర్పించాలని క్రీడాభిమానులు కోరుతున్నా రు. అత్యం త ప్రజాదరణ పొందిన క్రికెట్, చెస్, క్యారమ్ లాంటి క్రీడలు నేటికీ ఒలింపిక్స్ జాబితాలో చేరకపోవడం విచారకరం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి,
9949700037

## ఎసిబి వలలో పంచాయతీ కార్యదర్శి



ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి : లక్ష్మీ దేవి పల్లి మండలం రేగళ్ల పంచాయతీలోని పెద్దతండాలో నివాసం ఉంటున్న భూక్యా లక్ష్మణ్ వద్ద నుండి రూ.20వేలు లంచం డిమాండ్ చేస్తూ ఏసిబికి దొరికిన పంచాయతీ కార్యదర్శి పుల్లారావు ఇంటి నిర్మాణం అనుమతి కోసం రేగళ్ల పంచాయతీ కార్యాలయానికి లక్ష్మణ్ వెళ్లగా పంచాయతీ గుమస్తా వెంకన్న, కార్యదర్శి ఇంటి యజమానిని రూ.20వేలు లంచం అడిగినట్లు తెలుసుకున్న ఎసిబి అధికారులు, మంగళవారం పంచాయతీ కార్యాలయంలో లంచం తీసుకుంటున్న కార్యదర్శి గుమస్తాలను ఎసిబిడి ఎస్పి వై.రమేష్‌కు పట్టుబడ్డారు. గతంలోను ఈ పంచాయతీ సిబ్బందిపై అనేక ఆరోపణలు ఉన్నాయి.

## పేద ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే : నున్నా నాగేశ్వరరావు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పేద ప్రజల కోసం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది సిపిఎం, కమ్యూనిస్టులేనని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం పువ్వాడ ఉదయ్‌నగర్ గ్రామ పంచాయతీలో సిపిఎం రఘునాథపాలెం మండలం నాల్గవ మహాసభ నిర్వహించారు. మహాసభల సందర్భంగా సిపిఎం పతాకాన్ని సీనియర్ నాయకులు షేక్ జానిమియా ఎగురవేసి స్థూపాన్ని ఆవిష్కరించారు. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. హామీల అమలుకు పార్టీశ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడేది సిపిఎం కమ్యూనిస్టులేనని తెలిపారు. సిపిఎం నాయకులు యర్రా శ్రీకాంత్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై. విక్రం, నందిపాటి మనోహర్, దేవేందర్, యర్రా శ్రీనివాసరావు, దొంగల తిరుపతిరావు, విష్ణువర్ధన్, రమ్య, జబ్బార్, మీరా, రమేష్, సదానందం, లక్ష్మినారాయణ, ప్రవీణ్, యాకయ్య, కూచిపూడి నరేష్, రాంబాబు పాల్గొన్నారు.

## పత్తి మార్కెట్‌లో బిఆర్ఎస్ ఆందోళన

ప్రజాపక్షం/ ఖమ్మం : పత్తి మార్కెట్ కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని శాసనమండలి సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు ఆరోపించారు. సిసిఐ కేంద్రాన్ని ఖమ్మం మార్కెట్‌లో ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ప్రశ్నించారు. దళారులు ఇప్పటివరకు రైతుల వద్ద నుంచి కారుచౌకగా పత్తి కొనుగోలు చేస్తుంటే అధికారులు ఏమిచేస్తున్నారని గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుందని మధు తెలిపారు. ఇప్పుడు రైతులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోగా గిట్టుబాటు ధరకు వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేయడం లేదన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య, జెడ్పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, ఆర్‌జెసి కృష్ణ, బెల్లం వేణు, సామినేని హరిప్రసాద్, వీరునాయక్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 11న మణుగూరు ఐటిఐలో అప్రెంటిస్ మేళా : బడుగు ప్రభాకర్

ప్రజాపక్షం/మణుగూరు : ఈనెల 11న మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటిఐ జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని ఐటిఐ పూర్తి చేసుకున్న యువతి యువకుల కోసం నిర్వహిస్తున్న అప్రెంటిస్ మేళాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ అప్రెంటిస్ మేళా కోసం హైదరాబాద్ కు చెందిన ప్రముఖ కంపెనీలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఐటిఐ పూర్తి చేసి అప్రెంటిస్ చేయని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వరిలో బెరుకులుపై శాస్త్రవేత్తల పరిశీలన

ప్రజాపక్షం/కల్లూరు : కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరు కొండి గ్రామంలో వరిలో బెరుకులు ప్రజాపక్షం దినపత్రికలో వార్తపై శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. పెద్ద కోరుకొండిలోని రైతులు ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో వచ్చిన బెరుకులపై రైతులతో మాట్లాడి పొలాలలో ప్రత్యక్షంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. మన గ్రోమోర్ సంస్థ పంపిణీ చేసిన ఈ విత్తనాలను అసలా, నకిలీయ అనే దానిపై సుమారుగా 20 ఎకరాలలో ఉన్న వరి కంకులను పరిశీలించారు. న్యాయం చేయాలని రైతులు మోదుగు రామారావు, తాళ్లూరు శ్రీను తదితర రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు శాస్త్రవేత్తలకు మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శ్రీనివాసరెడ్డి, కెవికె కార్యక్రమ శాస్త్రవేత్తలు రవికుమార్, వేణు మాధవ్, ఫణి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## అపాయింట్ డే ప్రకటించి జిఒ విడుదల చేయాలి

### ఆర్టీసి జెఎసి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

ప్రజాపక్షం/ఖమ్మం : ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ఉద్యోగులుగా గుర్తిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీ మేరకు అపాయింట్ డే నిర్ణయించి జీవో విడుదల చేయాలని ఆర్టీసి జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. 11 మాసాలైనా ప్రస్తుత ప్రభుత్వం ఆర్టీసి విలీనం గురించి స్పందించడంలేదని వారు ఆరోపించారు. జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపత్రంలో 2021 వేతన సవరణ చేయాలని ఏరియర్స్, అలవెన్సులు పెంచాలని కోరారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, ప్రైవేటు బస్సులను రద్దు చేసి ఆర్టీసి నూతన బస్సులను కొనుగోలు చేయాలని, జీరో టికెట్‌కు బదులు మహిళలకు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి ప్రతి నెల రూ.350 కోట్లు విడుదల చేయాలని, చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జెఎసి నాయకులు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాటి అప్పారావు, ఖమ్మం జెఎసి చైర్మన్ పిల్లి రమేష్, నాయకులు మంచాల నాగయ్య, బేతంపూడి బుచ్చిబాబు, వెంకన్న, గడ్డం వెంకయ్య, స్వర్ణ నర్సింహారావు, ఎ. వీరయ్య, ప్రదీప్‌కుమార్, గోవర్ధన్, ప్రసాద్, బాలాజీ, రమణ, రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

# నేటి నుంచి ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే

### మొత్తం కుటుంబాలు 6,33,304
### ప్రశ్నలు 75
### ఒక్కో సర్వేయర్‌కు 150 ఇండ్లు
### 15 రోజుల పాటు సర్వే



ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక ఆర్థిక, విద్య,ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకు సంబంధించిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఎటువంటి పొరపాట్లు జరగని రీతిలో సమగ్రంగా ప్రణాళికాబద్ధంగా సర్వే నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నేతృత్వంలో అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో 633304 కుటుంబాలు ఉన్నట్లు అంచనా వేశారు. జిల్లాను 3654 ఇబిలుగా గుర్తించి 3719 మంది ఎన్యుమరేటర్లను, 314 మంది సూపర్‌వైజర్లను, ఐదుగురు నియోజకవర్గ ఇన్‌చార్జిలను నియమించారు. ఖమ్మం నియోజకవర్గానికి డిప్యూటీ సిఇఒ నాగలక్ష్మి, పాలేరుకు అదనపు డిఆర్‌డివో నూరుద్దీన్, వైరాకు డిపివొ రాంబాబు, సత్తుపల్లికి కల్లూరు ఆర్డీవో రాజేందర్, మధిరకు ఖమ్మం ఆర్డీవో నర్సింహారావును బాధ్యులుగా నియమించారు. ఈ సర్వేలో మొత్తం 75 ప్రశ్నలు ఉంటాయి. 75 ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను పొందుపర్చాల్సి ఉంది. ప్రతి ఇంటికీ 30 నిమిషాల సమయం కేటాయించాలని ఒక సర్వేయర్ రోజుకు 10 ఇండ్ల సర్వే చొప్పున 15 రోజుల్లో మొత్తం ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది. వివరాల సేకరణలో ఏమాత్రం పొరపాట్లకు తావివ్వకుండా సర్వేయర్లు పూర్తి చేయాలన్నారు. ఈ సర్వేకు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులను వినియోగిస్తుండడంతో ప్రాథమిక పాఠశాలలు బుధవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు ఒక పూట మాత్రమే పని చేయనున్నాయి. మధ్యాహ్న భోజనం తర్వాత పాఠశాలలకు సెలవు ప్రకటించనున్నారు. అనంతరం ఉపాధ్యాయులు సర్వేలో పాల్గొననున్నారు. సర్వేయర్లకు అందించే మెటీరియల్‌ను సిద్ధం చేశారు. సర్వేలో పొందుపర్చిన ప్రశ్నలు ఇబ్బందికరంగా ఉన్నాయని, చాలా ప్రశ్నలకు సంబంధించి స్పష్టత లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ పథకాలకు సంబంధించి కాలయాపన చేసేందుకే ఈ కుటుంబ సమగ్ర సర్వే అని విపక్షాలు విమర్శిస్తున్నాయి. గతంలో కెసిఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే నివేదిక ఏమైందో ఇంత వరకు తెలియకపోగా దానికి సంబంధించిన నివేదికలు కూడా వెల్లడికాకపోవడం గమనార్హం.

## టిపిటిఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: టిపిటిఎఫ్ మండల శాఖ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బానోత్ భోజ్య, ఈసం ముత్తయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె.లక్ష్మినారాయణ, జి.కుమార్ రాజా, ఎన్.రామకృష్ణ, ఎ.నాగమణి, కార్యదర్శులుగా కె.రామయ్య, టి.నెహ్రూ, బి భద్రు, బి.రవి, జిల్లా కౌన్సిలర్లుగా సిహెచ్ భద్రమ్మ, టి.బిక్షమయ్య, కె.లాలయ్య, అడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.శ్రీను, డి.నాగేశ్వరరావు, నీలావతిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శి సంపాదకులు యం.రామాచారి, టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు, టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాలు, రాష్ట్ర కౌన్సిలర్ గుమ్మడి సమయ్య, చాట్ల శ్రీను, వాసరావు తదితరులు పాల్గొన్నారు.





## కొలాబెరా కంపెనీకి 28 మంది ఎస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ బహుళజాతి కంపెనీ కొలాబెరా నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 28 మంది ఎస్‌బిఐటి విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో కొలాబెరా కంపెనీ నిర్వహించిన నియామకాలలో 120 మంది సిఎస్‌సి ఇసిఇ విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఎనలిస్టు ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు ఆరు నెలల శిక్షణ కాలంలో మూడు లక్షలు లభిస్తుందని, శిక్షణ అనంతరం హెచ్‌సిఎల్‌కు అర్హత సాధించిన వారికి నాలుగు లక్షల వార్షిక ఆదాయం అందుతుందని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎల్లప్పుడు ముందుంటామని ఆయన తెలిపారు. గత కొన్నేళ్లుగా వందలాది నియామకాలతో జిల్లాలోనే ఎస్‌బిఐటి అగ్రగామిగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొలాబెరా కంపెనీ ప్రతినిధి సోనుత్యాగి, అకాడమిక్ డైరెక్టర్లు జి.ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి.శివప్రసాద్, ఎన్.శ్రీనివాసరావు, ఎ.రవీంద్రబాబు, టిపివో సవిత, కోఆర్డినేటర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

# మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు

### 323 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
### దొడ్డు, సన్న రకం గుర్తింపుపై అధికారులకు శిక్షణ
### ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రత్యేకాధికారి కె.సురేంద్ర మోహన్





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల వద్ద నుంచి మద్దతు ధరకు నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి కె.సురేంద్రమోహన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కె.సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఖమ్మంజిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం చేపట్టిన చర్యల వివరాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ సన్న రకం ధాన్యం కింద ఏ ధాన్యాన్ని పరిగణిస్తున్నామనే అంశం రైతులకు స్పష్టంగా తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దొడ్డు రకం, సన్న రకం వడ్లకు తేడా స్పష్టంగా తెలియజేసేలా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు, క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ అందించాలన్నారు. జిల్లాలో ఉన్న మిల్లుల నుంచి బ్యాంక్ గ్యారెంటీ సమర్పిస్తామని అండర్ అఫిడవిట్ తీసుకుని ధాన్యం అలాట్‌మెంట్ చేయాలని తెలిపారు. రైస్ మిల్లుల వద్ద తాలు పేరుతో కోతలు పెట్టవద్దన్నారు. సన్న రకం ధాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే అందాలన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నులు (1.3 లక్షలు సన్నరకం, 70వేలు దొడ్డు రకం) ధాన్యం కొనుగోలు అంచనాతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 323 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిసిఎంఎస్ ద్వారా 27, డిఆర్‌డిఎ ద్వారా 138, పిఎసిఎస్ ద్వారా 158 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ఇతర మౌలిక వసతులు కల్పించామన్నారు. జిల్లా సరిహద్దులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నందున 14 చెక్ పోస్టులను అప్రమత్తం చేశామని, 24 గంటల పాటు నిఘా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, శ్రీనివాసరెడ్డి, ట్రైని కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి ఎం.ఎ.అలీమ్, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా సహకార అధికారి గంగాధర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, అదనపు డిఆర్‌డివో నూరొద్దీన్ పాల్గొన్నారు.

## రోగులకు సమర్థవంతమైన సేవలు అందించాలి

### వైద్యశాఖాధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వైద్య విభాగం ద్వారా రోగులకు సమర్థవంతమైన సేవలు అందాలని, ఆ దిశగా జిల్లాలో కార్యక్రమాలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖపై అధికారులతో అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 26 పిహెచ్‌సిలు, నాలుగు అర్బన్ పిహెచ్‌సిలలో అందుబాటులో ఉన్న మందుల వివరాలతో బోర్డులను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యశాఖ పట్ల ప్రత్యేక శ్రద్ధ జిల్లా యంత్రాంగం చేపట్టిందని ఎక్కడ చిన్న పొరపాటు, తప్పు జరిగినా కఠినంగా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీలు చేసి రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించి నవంబరు చివరి నాటికి నివేదిక సమర్పించాలన్నారు. స్కానింగ్ సెంటర్ల పనితీరు వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రతి పిహెచ్‌సిలో బయోమెట్రిక్ అటెండెన్స్ ద్వారా వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు చేయాలని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో వెళ్లే సిబ్బంది లైవ్ లోకేషన్ తీసుకోవాలని తెలిపారు. టిబి కేసులు గుర్తింపు, ప్రతి గర్భిణీ స్త్రీ ఏఎన్‌సి రిజిస్ట్రేషన్ చేయించి వారికి టీకాలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని డాక్టర్ కళావతి భాయి, జిల్లా టిబి అధికారి వి. సుబ్బారావు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో సైదులు, వైద్య ఆరోగ్యశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కార్మికవర్గ హక్కుల పరిరక్షణకు

## బడ్జెట్‌లో కేటాయింపులు చేయరా?

### 8గంటల పనిహక్కు సాధించింది ఎఐటియుసినే
### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి





ప్రజాపక్షం/బూర్గంపాడు: కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత, అసంఘటిత కార్మిక లోకం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం సారపాక కపర్ది భవన్‌లో ఎఐటియుసి బూర్గంపాడు మండల 13వ మహాసభ సింగమనేని ప్రసాద్, బర్ల వెంకటేశ్వర్లు, అకుల పద్మాల అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో వారు మాట్లాడుతూ కొట్లాడి సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా మార్చాలనే కుట్రను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తుందని, ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మి ఆదానీ, అంబానీలకు అప్పజెప్పేందుకు తీవ్ర కృషి చేస్తుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు నిధులు కేటాయింపులు జరుపలేదని, సంఘటిత రంగంలో రాష్ట్రంలో 2కోట్ల మంది కార్మికులకు ఎలాంటి ప్రయోజనము లేకుండా చేశారని, కనీస వేతనం అందటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న శ్రామిక జీవులకు ఎఐటియుసి దిక్సూచి వంటిదని, కార్మికులకు ఏ కష్టం వచ్చినా బాసటగా నిలచే సంఘం ఎఐటియుసి అని, కార్మికులు, ఉద్యోగుల హక్కులు, సౌకర్యాలకు స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే పోరాడుతోందని, 8గంటల పని విధానం, సంక్షేమ చట్టాలను సాధించి పెట్టింది ఎఐటియుసినేని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాదర్ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వెర్పుల మల్లికార్జున్, అంగన్వాడి టీచర్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెడ్డి అరుణ, సిపిఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వర్లు, పేరాల శ్రీనివాసరావు, పాండవుల భిక్షం, మాల్సురు, విరమాల్ల శివ, వెంకటేశ్వర్లు, బుజ్జమ్మ, రాధా, జ్యోతి, దీప్తి, రాజేశ్వరి, రచన, తారా, మంగమ్మ, సాజిద్, గోవర్ధన్, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సభ్యత్వ లక్ష్యాలను పూర్తిచేయాలి

### గ్రామగ్రామాన సిపిఐ వందేళ్ల ఉత్సవాలు జరుపుకుందాం
### మండల సమగ్రాభివృద్ధికి కూనంనేని ప్రత్యేక శ్రద్ధ
### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాచలం : నూతన సభ్యత్వం, పునరుద్ధరణ లక్ష్యాలను పూర్తి చేసి గ్రామగ్రామాన సిపిఐ వందేళ్ల ఉత్సవాలు జరుపుకుందామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం చుంచుపల్లి మండల పరిధిలోని రజబ్ అలీ భవనంలో జరిగిన పార్టీ విస్తృత కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో పలు అంశాల చర్చకొచ్చాయి. పార్టీ సిద్ధాంతాలు, ప్రజలకు చేస్తున్న సేవలు, కూనంనేని నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇటీవల వందలాది మంది పార్టీలో చేరారని, చేరుతున్నారని అన్నారు.
వీరికి ప్రాథమిక సభ్యత్వాన్ని అందించి శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. డిసెంబర్ 26 నాటికి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గ్రామగ్రామాన ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుందామని, ఈ సందర్భంగా పార్టీ చరిత్రను, త్యాగాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. మండల సమాగ్రాభివృద్ధికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారని, ఇప్పటికే వివిధ పథకాల్లో భాగంగా రోడ్లు, డ్రైన్లు, నీటిపథకాలు పనులు శరవేగంగా సాగుతున్నాయని, మిగతా పనులు కూడా త్వరలో మొదలవుతాయని చెప్పారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. గనిగళ్ల వీరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, పొలమూరి శ్రీనివాస్, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, మండల సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా సమగ్ర సర్వే నిర్వహించాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని నేలకొండపల్లి తహాశీల్దార్ మానిక్‌రావ్ సూచించారు. మండలం లోని వివిధ గ్రామాలలో మంగళవారం స్టిక్కరింగ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...మండలం లోని సర్వే ను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నిష్పక్షపాతంగా ఎన్యుమరేటర్ల వ్యవహరించాలని అన్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్నం నుంచి సర్వే ప్రారంభించాలని సూచించారు. సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో మొత్తం 160 మంది ఎన్యుమరేటర్ల ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఆలస్యం మధుసూధన్ రావు, బుద్దారం ఎన్యుమరేటర్ ఇటిక్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.
ఫొటో ఉంది : 05పీహెచ్ : 16. మాట్లాడుతున్న దృశ్యం...

## గిరిజనుల హక్కులను కాలరాసేందుకు కేంద్రం కుట్ర

### హక్కుల కోసం పోరాడటమే ధర్మాకు నిజమైన నివాళి
### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గిరిజనులకు ఉన్న హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అందుకు ప్రజాస్వామిక వాదులు, గిరిజన సంఘాలు ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకులు గుగులోత్ ధర్మానాయక్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఖమ్మంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం అధ్యక్షతన రాష్ట్ర స్థాయి గిరిజన సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో గిరిజనులకు ఉన్న హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలపై మనువాద సంస్కృతిని బలవంతంగా రుద్ది గిరిజనుల ఉనికికే ప్రమాదం వచ్చే విధంగా నేటి పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు.సనాతన ధర్మం పేరుతో కులాల నిచ్చెన మెట్ల వ్యవస్థను ప్రతిష్టించే ప్రయత్నం జరుగుతుందన్నారు. గిరిజనులు హక్కులు సాధించాలంటే గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకులు, అమరజీవి గుగులోత్ ధర్మాని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, సోమయ్య, గుగులోత్ ధర్మా సతీమణి కౌసల్య, కొడుకు, కుమార్తె రవికిరణ్, బానోత్ విజయబాయి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ధర్మానాయక్, శ్రీరాం నాయక్, ఆలిండియా బంజరా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ రాంచందర్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బండిరమేష్, పొన్నం వెంకటేశ్వరరావు, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి, జిల్లా కార్యదర్శి బోడ వీరన్న పాల్గొన్నారు.

### గిరిజన, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం

# సిపిఐ నిరంతర పోరాటాలు

### * సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య



ప్రజాపక్షం/మణుగూరు : గిరిజన, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం సిపిఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని, దీనికి అండగా గిరిజన సమాఖ్య నిలవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య పిలుపునిచ్చారు. మంగళవారం మణుగూరు సిపిఐ కార్యాలయంలో కుటుంబరావు అధ్యక్షతన మణుగూరు మండల మహాసభ జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య హాజరై మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, పేదవర్గాలు ప్రజలు అంతా కలిసి మెలిసి అన్నదమ్ముల్లాగా జీవిస్తున్నామని, అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల వర్గాల కోసం సిపిఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, ఈ పినపాక నియోజకవర్గంలో ఏజెన్సీ గిరిజన గ్రామాలకు సరైన రోడ్లు, విద్యుత్ సౌకర్యం కూడా లేకపోయిందని, సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆనాడు ఎమ్మెల్యే, ఎంపిలను గెలిపించుకొని గ్రామాల్లో విద్యుత్, రోడ్లు, భవనాలు, స్కూల్స్ బిల్డింగ్స్ ఇలా అనేకం అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రతి మారుమూల ప్రాంతాలు అభివృద్ధిలో సిపిఐ పాత్ర మరువలేనిది అన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ప్రజాపక్షం/గుండాల : సంక్షేమ హాస్టల్ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కె షాహిద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను సదర్శించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో విద్యావ్యతిరేక విధానాలకుపాల్పడుతున్నటువంటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే విద్యార్థి ఉద్యమాలు చేపడతామన్నారు. విద్యార్థులకు దుప్పట్లు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. గత పాలకుల నిర్లక్ష్యంతో సమస్యల వసతి గృహాలుగా మారాయని విమర్శించారు. గంగాధరి వినయ్, పవన్, రవివర్మ, నాసీర్ పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా అభివృద్ధి సమీక్షలో ఎంపి కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన వరంగల్ జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి పాల్గొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... దేవునూరు, నారాయణగిరి, ముప్పారం, ఎర్రబెల్లి గ్రామాల రైతులకు చెందినటువంటి పట్టా భూములను ఫారెస్ట్ అధికారులు అటవీ భూములుగా పరిగణిస్తూ ఆయా రైతులను పంట పొలాల్లోకి అనుమతించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. గతంలో కలెక్టర్ స్వయంగా సర్వే నిర్వహించి వాటిని పట్టా భూములుగా పరిగణించినప్పటికీ ఫారెస్ట్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. ఫారెస్ట్ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా ఇన్చార్జి మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన ఏడు గ్రామాల మధ్య గుండా నేషనల్ హైవే 163 రోడ్డు నిర్మాణం జరిగిందని, దీంతో గ్రామాలు రెండుగా విడిపోవడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలు వివిధ పనుల నిమిత్తం రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారని తెలియజేశారు. ఆయా గ్రామాలకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించాలని, అవసరమైన గ్రామాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు లేదా అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని, హైవేలకు ఆనుకొని ఉన్న గ్రామాలకు లైటింగ్ ఏర్పాటు చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నేషనల్ హైవే అథారిటీకి రిప్రజెంటేషన్ పంపించి త్వరితగతిన సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ధర్మసాగర్ రిజర్వాయర్, దేవనూరు గుట్టలను కలుపుతూ ఎకో టూరిజంగా అభివృద్ధి చేస్తామని గతంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు అభివృద్ధి చేయాలని కోరారు. అందుకు సంబంధించి త్వరలో కన్సల్టెన్సీ నియమించి డిపిఆర్ తయారు చేయవలసిందిగా కోరారు. గతంలో ధర్మసాగర్ మండలం, ఎలుకుర్తి వద్ద సైనిక్ స్కూల్ మంజూరు అయినప్పటికీ ఏళ్లు గడుస్తున్నా ఇంకా సైనిక్ స్కూల్ ప్రారంభం కలవడం లేదని అన్నారు. వెంటనే సైనిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి లేక పంపి త్వరితగతిన పనులు పూర్తి చేసే విధంగా చూడాలని ఎమ్మెల్యే కోరారు. నష్కల్ నుండి వరంగల్ నగరానికి రెండు రైల్వే బైపాస్ లైన్లు, ఒకటి నగరానికి నార్త్ వైపు నుండి మరొకటి సౌత్ వైపు నుండి రైల్వే డిపార్ట్మెంట్ ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే ఒఆర్ఆర్ మంజూరు కావడం జరిగిందని నగరం అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ఈ సమస్యను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అలైన్మెంట్ మార్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే విధంగా, కేంద్ర ప్రభుత్వానికి లేక పంపాలని ఎమ్మెల్యే కోరారు ఎమ్మెల్యే కడియం శ్రీహరి చెప్పిన సమస్యలపై ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఆ పనులు పూర్తి అయ్యే విధంగా చూ స్తామని హామీ ఇచ్చారు.

**సైనిక్ స్కూల్ పనులు ప్రారంభించాలి : ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

సమావేశంలో ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో రాజధాని వరంగల్ నగర అభివృద్ధిపై గౌరవ సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. వరంగల్‌కు మంజూరైన సైనిక్ స్కూల్ పనులు ప్రారంభించాలని గతంలో ఢిల్లీలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ గారిని కలిసి లేఖను అందజేసినట్లు తెలియజేశారు. సైనిక్ స్కూల్ పాత పద్ధతిలోనే పనులు ప్రారంభించాలని కోరారు. కేంద్రం నుండి ప్రధానమంత్రి మిత్రా ఫండ్స్ తీసుకువచ్చి అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీలో సర్కార్ విఫలం

సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



ప్రజాపక్షం/ కమలాపూర్: 1925 డిసెంబర్ 26 న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ లో సిపిఐ పార్టీ ఆవర్భవించి బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని అంతరాలు లేని సమాజం నిర్మాణం కై దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల కోసం ప్రజా ఉద్యమాలను చేపట్టిన పార్టీ సిపిఐ పార్టీ అని, అలాంటి ఉద్యమ పార్టీకి ప్రజలు అండగా ఉంటూ పార్టీని ఆదరించాలని హన్మకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె బిక్షపతి విజ్ఞప్తి చేశారు. కమలాపూర్ కమ్యూనిటీ హాల్ నందు సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం ధర్ముల రామ్మూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ.... దేశంలో భూ సంస్కరణ అమలు చేయాలని, దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు, భూ పోరాటాలు నిర్వహించి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందని గుర్తు చేశారు. కుల, మతాలకు అతీతంగా అందరూ సమానంగా ఉండాలని, విద్య, వైద్యం కూడు, గూడు, ఉపాధి అందే విధంగా అన్ని వర్గాల హక్కుల కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను అమలు చేయడం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా సిపిఐ పార్టీకి ప్రజలు సహకరిస్తూ జరగబోయే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ యన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు రెండు లక్షల రుణ మాఫీ అర్హులైన అందరికి అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అంతేకాకుండా రైతులు పండించిన ధాన్యాన్ని ఐకెపి సెంటర్లలో పోసి 25 రోజులు గడుస్తున్నప్పటికి ధాన్యాన్ని కొనక సంబంధించిన అధికారులు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేసి రెండు లక్షల రుణమాఫీని వెంటనే అర్హులకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రెట్టింపు ఆదాయాన్ని సమకూరుస్తాయని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించిందని బిక్షపతి మండిపడ్డారు. అంతేకాకుండా ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచినప్పటికి పేదవాడు... పేదవాని గానే ఉంటున్నాడు. ధనికులు... ధనికులగానే ఉంటున్నారంటే అందుకు ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండల కార్యదర్శి నకిర్త ఓదెలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, సిపిఐ మండల నాయకులు కొలుగూరి బాలరాజు, జేరిపోతుల లచ్చయ్య, చిగురు రవి, మహేందర్, ఇసంపల్లి ఐలయ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## 6, 7తేదీల్లో ఇంటింటి సర్వే



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు 6, 7 తేదీల్లో ఇండ్ల జాభితా (హౌస్ లిస్టింగ్) తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం నుండి హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంపిఒలు, సూపర్ వైజర్లుతో ఐడిఒసి కార్యాలయం నుండి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 6, 7 తేదీల్లో గ్రామ, మున్సిపాలిటీలో ఇంటింటి జాభితా ప్రారంభం చేయాలని తెలిపారు. రెండు రోజుల్లో ఇంటింటి జాభితా గణనలో ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలని, సర్వే పూర్తి అయిన తదుపరి మార్కర్ పెన్ తో తేదీ వేయాలని సూచించారు. 8వ తేదీ నుండి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం కావాలని తెలిపారు. ఈ ప్రక్రియ 15 రోజుల్లో పూర్తి చేయుటకు పభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 12 మండలాలు, భూపాలపల్లి మున్సిపల్ పరిధి కలిపి 1,31,030 ఇండ్లు సర్వే నిర్వహణకు 993 ఎన్యూమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సిపిఓ బాబూరావు, డిపిఓ నారాయణ రావు, ఆర్డిఓ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన సింగరేణి రాజేశ్వర్‌రెడ్డి

జిఎంను కలిసిన ఎఐటియుసి నాయకులు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: భూపాలపల్లి ఏరియా సింగరేణి జిఎంగా రాజేశ్వర్ రెడ్డి నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ లు నూతన జిఎం రాజేశ్వర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విధుల్లో చేరిన జిఎంకు వారు శుభాకాంక్షలు తెలిపారు. భూపాలపల్లి ఏరియాలో ఉన్న కార్మిక సమస్యలపై జిఎంతో కాసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురిజపల్లి సుధాకర్ రెడ్డి, మధు గాని విజేందర్, గంగసారపు శ్రీనివాస్, బ్రాంచ్ కమిటీ నాయకులు నూకల చంద్రమౌళి, రవికుమార్, తాళ్ల పోషం, రాజారాం, దోర్నాల తిరుపతి, కరిముల్లా, ఎల్ శంకర్, పి శ్రీనివాస్, సదయ్య, రమేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ సమర్థవంతంగా జరగాలని, దొడ్డురకం, సన్నరకం ధాన్యం వేరువేరుగా ఏర్పాటుచేసి కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణపై ఐకెపి, పిఎసిఎస్ నిర్వాహకులకు సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్‌ను కలెక్టర్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోళ్ల కేంద్రాలను పర్యవేక్షించాలని, ఒపిఎంఎస్ ఎంట్రీ చేయడంలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై దృష్టిపెట్టినందున కొనుగోళ్ల కేంద్రాలలో సజావుగా జరిగే విధఃగా చర్యలు తీసుకోవాలన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.500 బోనస్ ప్రకటించినట్లు ప్రతి రైతుకు తెలియజేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, జనగామ, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఒలు గోపి రామ్, డిఎస్ వెంకన్న, డిఆర్‌డిఎ పిడి వసంత, తహసీల్దార్లు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

## పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్



ప్రజాపక్షం/ధర్మసాగర్ : ప్రభుత్వ భూములలో పేదలు గుడిసెలు నిర్మించుకున్న వారందరికీ పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో ధర్మసాగర్ గ్రామంలో సర్వే నంబర్ 1058 లోని ప్రభుత్వ భూమిలో గత 18 సంవత్సరాల క్రితం నిలువ నీడ, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు గుడిసెలు వేసుకుని చిన్న చిన్న రేకుల షెడ్లతోటి జీవనం కొనసాగిస్తున్నారని వారందరికీ పట్టాలు ఇవ్వాలని ధర్మసాగర్ మండల తహసిల్దార్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మద్దెల ఎల్లేష్ మట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ప్రభుత్వం పట్టించకపోవడంతో నిరుపేదలు నిలువ నీడ లేక, తినడానికి తిండి లేక, సరియైన వైద్య సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుచున్నారని, ఈ ప్రభుత్వంలోనైనా ప్రతి పేద వాడిని గుర్తించి వారికి కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఐ ధర్మసాగర్ మండల సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చిన ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మాలోత్ శంకర్ నాయక్, సిపిఐ సీనియర్ నాయకులు సింగారపు కొమురయ్య, వల్లెపు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో చట్ట ప్రకారం న్యాయం



ప్రజాపక్షం/హనుమకొండ : జిల్లా పరిధిలో నమోదైన ఎస్సి,ఎస్టి కేసులలో చట్ట ప్రకారం న్యాయం జరిగేవిధంగా కృషి చేస్తామని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి కేసుల న మోదు వివరాలు, వాటి పురోగతి, తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై కమిటీ సభ్యులు, పోలీస్, రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామ న్నారు. మానిటరింగ్ సభ్యులకు గుర్తింపు కార్డు లను అందజేస్తామన్నారు. మహనీయుల జయంతి కార్యక్రమాలను జిల్లా కలెక్టరేట్ లో నిర్వహిస్తామన్నారు. కమిటీ సమావేశంలో చర్చించిన అన్ని అంశాలను, సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టి కి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, చుంచు రాజేందర్, హరి జవహర్ లాల్ నాయక్, రడపాక పరంజ్యోతి, సింగారపు రవిప్రసాద్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్, ఓయాసిస్ సంస్థ ప్రతినిధి ప్రకాష్, హనుమకొండ, పరకాల ఆర్‌డిఒలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, ఎసిపిలు కిషోర్ కుమార్, తిరుమల్, దేవేందర్ రెడ్డి, ఎస్సి సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, తహసీల్దార్లు జ్యోతివరలక్ష్మి దేవి, బావ్ సింగ్, చల్లా ప్రసాద్, సదానందం, జగన్ మోహన్‌రెడ్డి, నాగరాజు, పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు సాధించే వరకూ పోరాటం..

ఆల్ ఇండియా ఒబిసి జెఎసి చైర్మన్ సాయిని నరేందర్




ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : తెలంగాణలోని బిసి సంఘాలు చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా తెలంగాణ ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను నియమించి సమగ్ర కుల జనగణన జరిపి తద్వారా స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ముందుకు వచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆల్ ఇండియా ఒబిసి జాక్, తెలంగాణ పూలే యువజన సంఘాల సమాఖ్యలు కృతజ్ఞతలు తెలిపారు. హన్మకొండ జిల్లా కేంద్రం బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన బిసి సంఘాల సమావేశంలో ఆల్ ఇండియా ఒబిసి జెఎసి చైర్మన్ సాయిని నరేందర్, వైస్ చైర్మన్ పటేల్ వనజ, తెలంగాణ పూలే యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షులు తాడిశెట్టి క్రాంతికుమార్‌లు మాట్లాడుతూ డెడికేటెడ్ కమిషన్ ను స్వాగతిస్తూనే ఆ కమీషన్ పనితీరుపై బి.సి సమాజం అప్రమత్తంగా ఉండి సర్వే సక్రమంగా జరిగి, బిసి స్థితిగతులు నమోదు అయ్యేటట్లు చూడాలని అన్నారు. వేల సంవత్సరాల అణచివేత, వందల సంవత్సరాల పోరాటం, ఎంతో మంది త్యాగాలు అయినా విముక్తి కానీ బిసి సమాజానికి కొంత మేలు చేసే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుల జనగణన జరిపి తద్వారా స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే కొరకు జరిగే ప్రక్రియలో భాగంగా నియమించిన డెడికేటెడ్ కమిషన్ మేలు చేస్తుందని బిసి సమాజం ఆశాబావంగా ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వేణుమాధవ్, టి జె ఎస్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది చిల్లా రాజేంద్రప్రసా ద్, సగర సంఘం నాయకులు నలుబాల రవికుమార్, వివిధ సంఘాల నా యకులు నలుబోల అమరేందర్, పి వెంకటచారి, తాటికొండ సద్గుణ, కా సుల సరోజన, ఎర్రోజు అశ్విని, కర్రే చంద్ర శేఖర్, అనిశెట్టి సాయితేజ, మా మిడి రాఖీ, మాధవి స్వప్నరాణి, స్వప్న, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచకప్ కరాటే పోటీలకు 'మిలీనియం' విద్యార్థుల ఎంపిక



ప్రజాపక్షం/హసన్ పర్తి : ముచ్చర్ల గ్రామంలోని మిలీనియం హైస్కూ విద్యార్థులు వరల్డ్ కప్ కరాటే పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6 నుంచి 10 వరకు గోవాలో జరిగే వరల్డ్ కప్ కరాటే కాంపిటీషయన్‌కు వెళ్తున్న సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ ఫాదర్ మైఖేల్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పిఇటి నాగరాజు అభినందించారు. ఈ సందర్భంగా కరాటే కోచ్ చోటాఖాన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎండి యాకూబ్‌పాషా మాట్లాడుతూ.. 33 దేశాలు పాల్గొంటున్న ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. షోటోకాన్ కరాటే వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ సలీమ్‌పాషా, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి గురుకుల విద్యార్థులు కృతజ్ఞతలు



ప్రజాపక్షం/ములుగుప్రతినిధి: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, బాలుర ములుగు విద్యార్థులు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు 40శాతం పెంచినందుకు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని అన్ని విద్యాసంస్థలకు తెలంగాణ ప్రభుత్వం డైట్ చార్జీల పెంపుదల ప్రతిపాదనల సందర్భంగా ప్రిన్సిపాల్ ఏ ఝాన్సీ రా ణి, వైస్ ప్రిన్సిపాల్ మమత, కె సంజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లే కార్డులతో ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ సిఎంకి కృతజ్ఞతలు తెలిపారు.

## జనార్ధన్ కుటుంబాన్ని పరామర్శించిన నారాయణ




ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: సిపిఐ జనగామ జిల్లా కార్యవర్గ సభ్యులు మంగళంపల్లి జనార్ధన్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ పరామర్శించారు. మంగళవారం జనగామలోని సంజయ్‌నగర్ చమాన్ వద్ద గల జనార్ధన్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. జనార్ధన్ చనిపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, ఆది సాయన్న, చొప్పరి సోమయ్య, బాబుతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శిక్షణ ముగించుకున్న కులగణన సర్వే బృందం

ప్రజాపక్షం/నెక్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న బిసి కులగణనలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ ,ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించుటకు పకడ్బందీగా ప్రభుత్వం ఉపాధ్యాయులకు, శిక్షణ ఇచ్చారు. గ్రామాలలో సర్వే సమయంలో వీరికి గ్రామాలలో సహాయకులుగా ఇజి ఎస్, వెలుగు (ఐకెపి), అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ సిబ్బంది పంచాయతీ, కార్యదర్శులు, తదితర శాఖల నుండి గ్రామాల్లో సర్వే సమయంలో సహకరిస్తారు. శిక్షణ పొందిన వారికి మంగళవారం నెక్కొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా సర్వే సామాగ్రి అందించారు. 39 గ్రామపంచాయతీలలో యప్టిషన్లుతో సహా 110మంది ఈ సర్వే చేయనున్నట్లు అధికార తెలిపారు. మీరు కాక పదిమంది రిజర్వుగా అందుబాటులో ఉంటారని ఎంపిడిఒ తెలిపారు. ఉపాధ్యాయులు ఉదయం పాఠశాలలలో విద్యాబోధన చేసి మధ్యాహ్నం భోజన అనంతరం సర్వే నిర్వహిస్తారు. సరే సమగ్రంగా జరగాలంటే ఉపాధ్యాయులు అయితేనే బాగుంటుందని ప్రభుత్వం చివరి నిమిషంలో నిన్న తీసుకుంది ఈసర్వే ఈనెల 6 బుధవారం నుండి ప్రారంభం కానుంది.

## నారాయణ హై స్కూల్‌లో ప్రీమియర్ లీగ్ ప్రారంభం



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హఖుమకొండలోని నారాయణ హై స్కూల్ వరంగల్ ఒలంపియాడ్ బ్రాంచ్ నక్కలగుట్టలో మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ వంగల అలేఖ్య ఆధ్వర్యంలో నారాయణ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిజిఎం రిజ్వానా మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థి యొక్క మానసిక, శారీరక ఆరోగ్యం ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని అని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో క్రీడ పోటీలలో పాల్గొనాలని మాట్లాడుతూ, క్రీడలలో గెలుపు ఓటములు అనేది సహజమని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం రిజ్వానా, ప్రిన్సిపల్ వంగల అలేఖ్య, కోఆర్డినేటర్స్ సాయి కృష్ణ, హారిక, శిరీష, అకాడమీ డీన్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్స్ షాహిని, కరుణశ్రీ, ఏవో నాగరాజు, పిఈటి చిర్ర సుమన్ గౌడ్ తదితర ఉపాధ్యాయుల బృందం పాల్గొనడం జరిగిందని తెలిపినారు.

## ఎబివి డిగ్రీ కళాశాలలో బంగారు చైన్ చోరీ

ప్రజాపక్షం/జనగామ టౌన్: బంగారు చైన్ చోరీకి గురైన సంఘటన ఎబివి డిగ్రీ కళాశాలలో చోటు చేసుకుంది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎబివి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ గదిలోకి విద్యార్థి పేరుతో గుర్తుతెలియని దుండగుడు చొరబడ్డాడు. లైబ్రరీ రికార్డ్ అసిస్టెంట్ ఉపేందర్‌పై దాడిచేసి మెడలోని రెండు తులాల గోల్డ్ చైన్‌ను ఎత్తుకెళ్లాడు. అంగవైకల్యుడైన ఉపేందర్ ప్రతిఘటించడంతో దాడిచేసి పరారయ్యాడు. గాయాలైన ఉపేందర్‌ను కళాశాల యాజమాన్యం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులకు కళాశాల యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/ కమలాపూర్: కమలాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇటీవల ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిలువ ఉంచిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం మ్యాచర్ వచ్చినప్పటికీ రైస్‌మిల్లుల యాజమాన్యం అలాట్‌మెంట్ చేయకపోవడం తో రైతులు తెచ్చిన ధాన్యం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది. వెంటనే ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోని మిల్లులకు అలాట్‌మెంట్ చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, లేని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులకు హెచ్చరిస్తున్నారు ఈనెల 3న ప్రచురింపబడిన ధాన్యం కొనుగోళ్ళలో నిర్లక్ష్యం ఎందుకు..... అనే వార్త కథనానికి స్పందించిన రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్‌డివో నాగ పద్మజ, డిసిఎస్‌ఓ కొమురయ్య, డిటిసిహెచ్‌ఓ రమేష్, ఎంఆర్‌ఓ సురేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి జాలి లక్ష్మారెడ్డి, , ఏపిడి ప్రకాష్, ఏటిఎం నారాయణ, జిల్లా మండల అధికారులు మంగళవారం ఐకెపి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని అన్నారు. 48 గంటలతలో రైతుల ఖాతాలలో డబ్బులు వేస్తామని అన్నారు.

## ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలి

ప్రజాపక్షం/వర్ధన్నపేట : సరైన తేమ శాతం (17 కన్నా తక్కువ) తో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించబడిన రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కమిషనర్ టీ. వినయ్ క్రిష్ణారెడ్డి ఐఏఎస్ అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. తూకం విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, దళారులకు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేయవలసిన త్రాగు నీరు, టాయిలెట్లు, ఇతర సదుపాయాలపై, రైతుల నుండి ధాన్యం కొనుగోలు, ధాన్యం డబ్బుల చెల్లింపులు మొదలైన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. డిఆర్‌ఓ కౌసల్యాదేవి, డిసిఎస్‌ఓ కిష్టయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



## మత్స్యకారుల అభివృద్ధి లక్ష్యంగా...

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత చేప పిల్లల కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలు మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలోని పెద్ద చెరువులో చేప పిల్లలను వదిలిపెట్టి మాట్లాడారు. చెరువులే, చేపలే జీవనాధారం సాగిస్తున్న మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణి చేసి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు నందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేశ్‌చంద్ర, ఎంపీడీవో యాకుబ్‌నాయక్, తహసీల్దార్ లాల్‌బహదూర్, సింగిల్‌విండో ఛైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూస బాలకిషన్, గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, నిదాన్‌పల్లి మాజీ సర్పంచ్ గుత్తా నర్సిరెడ్డి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శంకరయ్య, మాజీ ఉప సర్పంచ్ సురేష్ పాల్గొన్నారు.

## సమయపాలన పాటించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఇంటర్మీడియట్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సమయ పాలన పాటించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భానునాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాలలో విద్యార్థులకు అధ్యాపకులు స్టడీ అవర్స్ నిర్వహించి ఉత్తీర్ణతశాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ళ యాదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి భక్తులు సహకరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** శబరిమలకు సమీపంలో నారాయమతోడు వద్ద అయ్యప్పస్వామి భక్తుల కోసం నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి భక్తులు సహకరించాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ జాతీయ అధ్యక్షులు అయ్యప్పదాస్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శబరినగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చే అయ్యప్ప భక్తులకు సేద తీరేలా గదులు, నిత్య అన్నదానం చేపట్టి భక్తుల ఆకలి తీర్చే ఉద్దేశ్యంతో స్వంత భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి సహకరించిన దాతల పేర్లను శిలాఫలఖంపై ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ కార్యదర్శి బేతి తీర్మల్ రావు, కోఆర్డీనేటర్ రాచర్ల రమేష్, మాజీ కార్యదర్శి శంకర్ చౌదరి, కార్యదర్శి భాస్కరాచారి, జిల్లా అధ్యక్షులు రంగు ముత్యంరాజు, నరేష్, శ్రీనివాస్, నవీన్, సత్యనారాయణ, బెలిదే శ్రీనివాస్, బచ్చు శ్రీను పాల్గొన్నారు.

## గ్రామస్థుల వినతికి కలెక్టర్ స్పందన



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల పెద్ద కాపర్తి గ్రామంలోని శ్రీతిరుమలనాథుని ఆలయ భూములు, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సోమవారం రోజున జిలా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి వినతి పత్రం సమర్పించిన వినతి పత్రానికి ఆమె వెంటనే స్పందించింది. మంగళవారం రోజున దేవాదాయ శాఖ డివిజన్ ఇన్స్‌పెక్టర్ బి సుమతి, ఈవో అంబటి నాగిరెడ్డిలు కలెక్టర్ ఆదేశాల మేరకు వివరాలను తెలుసుకోవడానికి పెద్దకాపర్తికి క్షేత్ర స్థాయికి తరలివచ్చారు. ఆలయ భూములను పరిశీలించి ఆ ప్రాంత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఆలయ భూములను సర్వే చేయించి హద్దులు నిర్దేశిస్తామని అన్నారు. సంబంధిత భూములలో ఎవరు కూడా ఎలాంటి పనులు చేయకూడదని, తవ్వకాలు జరుపకూడదని ఎవరైన మా ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వారి వెంట గ్రామ ప్రముఖులు పొట్లపల్లి చిన్నస్వామి, పొట్లపల్లి నర్సింహ్మా, చేకూరి గణేష్, బాలగోని రాజు, ముద్దసాని రమణారెడ్డి, ఏర్పుల రాకేష్, మాచర్ల యాదగిరి, బత్తుల శ్రీరంగం, కురు సత్తయ్య, పున్న విష్ణు, ఏర్పుల దామోదర్ ఉన్నారు.

## సర్వేలో అలసత్వం తగదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల సర్వేలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు అలసత్వం వహించవద్దని సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఆర్సీ గార్డెన్స్‌లో నిర్వహించిన మున్సిపాలిటికి చెందిన సర్వే సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో సర్వే పనులను అధికారులు, ఉద్యోగులు పనులు సజావుగా జరిగిపోతున్నాయని, మిర్యాలగూడ మున్సిపాలిటీలోనే వేగం అందుకోవడం లేదన్నారు. ఈనెల 6 నుంచి ఎన్యూమరేటర్ బ్లాక్‌లోని ఇండ్లను గుర్తించి స్టిక్కర్లు వేయాలని అన్నారు. పని జరగడం లేదన్న మాట రావద్దన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమీషనర్ యూసుఫ్, టీపీవో సోమయ్య, టీపీఎస్ అంజయ్య, ఐసీడీఎస్ పీవో రేఖల మమత, రెవెన్యూ ఆఫీసర్ జ్ఞానేశ్వరి, ఎంఈవో బాలునాయక్, మెప్మా టీఎంసీ బక్కయ్య తదితరులు పాల్గన్నారు.



# బునాదిగాని కాల్వపనులు వెంటనే చేపట్టాలి

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/అడ్డగూడూర్ :** వంద సంవత్సరాల పార్టీ ఆవిర్భావం దినోత్సవం ఘనంగా నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం అడ్డగూడూరు మండలంలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26, 1925 సంవత్సరంలో కాన్పూర్ నగరంలో పార్టీ ఆవిర్భావం జరిగింది. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న పార్టీ, తెలంగాణ సాయుధ రైతాంగం పోరాటానికి నాయకత్వం వహించి భూస్వాముల గుండెల్లో గుబులు పుట్టించి అడ్డగూడూరు 600 ఎకరాల భూమిని పేదలకు పంపిణీలో కీలకపాత్ర పోషించిన పార్టీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి అధికారంలోకి రావడానికి పాటుపడింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బిసి కులగణకు, ఎస్సీ వర్గీకరణకు సిపిఐ పార్టీ మద్దతుగా ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వంద సంవత్సరాల సిపిఐ ఆవిర్భావం దినోత్సవం డిసెంబర్ 30న ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే ఆవిర్భావ దినోత్సవ సభకు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**బునాదిగాని కాల్వపనులు వెంటనే చేపట్టాలి**

బునాదిగాని కాల్వకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు చేపట్టాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం చెడిపల్లి రవీందర్ అధ్యక్షతన జరిగిన సిపిఐ మండలకౌన్సిల్ ముఖ్యకార్యాకర్తల సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బునాదిగాని కాల్వకోసం నిధులు విడుదల జీఓ ఇచ్చారు. నిధులు విడుదల చేసి పనులు వెంటనే చేపట్టాలని కోరారు. రైతు భరోసా డబ్బులు రైతులఖాతాలో జమ చేయాలని, రైతులకు ఏ షరతు లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చేడే చంద్రయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్, సిపిఐ మండల కార్యదర్శి చేడే బిక్షం, వ్యవసాయ జిల్లా కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జిట్ట రాములు, వివిధ గ్రామాల గ్రామ శాఖ కార్యదర్శులు సోలిపురం నాగిరెడ్డి, రేఖల శ్రీనివాస్, కందుకూరి వెంకన్న, బొనగ సుదర్శన్ రెడ్డి, బెల్లి శ్రీకాంత్, గూడెల్లి యాదయ్య, సుక్క సోమయ్య పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాటం : నరసింహ్మా

**ప్రజాపక్షం/ మునుగోడు :** గ్రామీణ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొలుగూరి నరసింహ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని పులిపలుపుల గ్రామంలో జరిగిన పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఉండి ఇల్లు లేని వారికి ఇండ్లు మంజూరు చేయాలని అదేవిధంగా ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి కోరారు. వికలాంగులకు వృద్ధులకు ఒంటరి మహిళలకు వితంతువులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారి పెన్షన్లను రెట్టింపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న రైతులందరికీ రెండు లక్షల పైన ఉన్న రుణాలను వెంటనే మాఫీ చేయాలని పత్తి కొనుగోలు కేంద్రాలలో తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు పండించినటువంటి వరి ధాన్యానికి దొడ్డువడ్లు, సన్న వడ్లు తేడా లేకుండా అందరికీ క్వింటాళ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశం గ్రామ శాఖ కార్యదర్శి బొలుగురి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు కాయితి వెంకన్న, గ్రామశాఖ సహాయ కార్యదర్శులు కొంపల్లి రాములు, గుండెబోయిన భాస్కర్,జనగాం శంకర్, పందుల యాదయ్య, మునుగోటి సత్యనారాయణ, సింగం యాదయ్య, కంభంపాటి యాదయ్య, కొంపల్లి మారయ్య, కంభంపాటి శంకరయ్య, అనంతుల శ్రీను, దోటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# తేమశాతం తక్కువ ఉన్నా కొనుగోలు

### రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ డిఎస్ చౌహన్



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** సరైన తేమ శాతం (17 శాతం కన్నా తక్కువ)తో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ డిఎస్ చౌహన్ అన్నారు.సోమవారం ఆయన నల్లగొండ జిల్లా నార్కట్ పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం కుప్పలను, తేమశాతాన్ని తేమ కొలిచే యంత్రం ద్వారా పరిశీలించారు. దొడ్డు రకం, సన్నరకం వివరాలను అడిగి తెలుసుకున్నారు.కాగా నార్కట్‌పల్లి ప్రాంతంలో మొత్తం దొడ్డు ధాన్యమే వస్తుందని సెంటర్ ఇంచార్జీ కమిషనర్‌కు తెలియజేశారు. ధాన్యాన్ని గన్ని బ్యాగులలో తూకం వేసే గంట ముందు కుప్పలన్నింటిని ఆరబెట్టి పంపించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యాన్ని శుభ్రం చేసే యంత్రాలు, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అడగగా, 15 మంది రైతులు నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. చెల్లింపులు ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తీసుకుంటున్నది లేనిది కనుక్కున్నారు. అన్‌లోడ్ సమస్యలు, హమాలీలు, లారీల సమస్యలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఆదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు జిల్లాలో ప్రతిరోజు ధాన్యం పంపిన వెంటనే ఆన్ లోడ్ చేసుకుంటున్నారని, ఎలాంటి సమస్యలు లేవని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సన్నధాన్యం కేంద్రాలు 80 పైగానే ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. మిల్లర్లతోపాటు, ప్రభుత్వం తరపున సైతం ధాన్యాన్ని నిల్వ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలుపగా, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున సైతం ధాన్యాన్ని నిలువ చేసుకుంటున్నామని అన్నా రు. గతంలో సిఎంఆర్ సకాలంలో చెల్లించిన మిల్లర్లందరికీ రొటేషన్ పద్ధతిలో సిఎంఆర్ ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన సూచించా రు. ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసేందుకు అవసరమైతే ధాన్యం శుభ్రం చేసే యంత్రాలను కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ ,డిసిఓ పత్యా నాయక్ తదితరులున్నారు.

## సిద్ధాంతాలకు కట్టుబడినవారే నిజమైన కమ్యూనిష్టులు

**ప్రజాపక్షం/చిట్యాల :** నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి కడవరకు నిలిచే వారే నిజమైన కమ్యూనిష్టులని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. ఆ కోవకు చెందిన వారే గోపగోని నర్సింహ్మా అని అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు, విశాలాంధ్ర బస్సు డ్రైవర్ స్వర్గీయ గోపగోని(డిక్కి) నర్సింహ్మా స్మారక స్థూపాన్ని సోమవారం రాత్రి ఆయన ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిగిన కమ్యూనిష్టులు మాత్రమే నిరంతరం సామాజిక స్పృహతో ప్రజల హక్కుల సాధన కోసం పోరాడుతారని గుర్తు చేశారు. నర్సింహ్మా సిపిఐ కార్యకర్తగా, సింగిల్ విండో డైరక్టర్‌గా, గ్రామ పంచాయతి వార్డు సభ్యులుగా ప్రజలకు సేవలందించారని శ్రవణ్‌కుమార్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు లొడంగి సైదులు, గ్రామ శాఖ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు గోపగోని కిరణ్, అశోక్, బొడిగె సతీష్, గోపగోని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

### జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు :** భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ప్రజల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు ఉద్యమాలు నిర్వహించిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సిపిఐ శతవార్షికోత్సవాల సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండలో జరుగు రాష్ట్ర తొలి బహిరంగ సభను జయప్రదం చేయాలని నెల్లికంటి సత్యం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో నిర్వహించిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కాంగ్రేస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రేస్ ప్రభుత్వాన్ని కోరారు. ఇల్లు లేని ప్రతి పేద వాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని , అర్హులైన వారందరికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, నూతన ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి కొర్రీలు లేకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , మండల పార్టీ కార్యదర్శి నల్ప రాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు , మండల పార్టీ కార్యవర్గ సభ్యులు తిప్పర్తి రాములు , బరిగెల వెంకటేశ్ , దోటి వెంకన్న, గంట రమేష్ , వెంకన్న పాల్గొన్నారు.

## ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఈ నెల 8న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు రావు ఆదేశించారు. మంగళవారం మిని మీటింగ్ హాల్‌లో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సంబంధిత జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, అర్ అండ్ బి, ట్రాన్స్ పోర్ట్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, పంచాయితీ, ఎక్సైజ్, మత్స్య శాఖ, వైద్య శాఖ, మిషన్ భగీరథ, ట్రాన్స్ కో, డిపిఆర్ఓ,సివిల్ సప్లై, వ్యవసాయ శాఖ, ట్రాఫిక్ తదితర శాఖల ఏర్పాట్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు అధికారులు సంపూర్ణ సమన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. భద్రత ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తును పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను, అగ్నిమాపక పరికరాలను, సేవలను అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖను, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖను, రోడ్ల మరమ్మత్తుల పనులను అర్ అండ్ బి, అధికారులు, శానిటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయితీ శాఖ, ఈ ఏర్పాట్లన్నీ ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సీఈఓ శోభారాణి, భువనగిరి ఎసిపి రవి కిరణ్ రెడ్డి, ట్రాఫిక్ ఎసిపి ప్రభాకర్ రెడ్డి, యాదాద్రి దేవస్థానం ఎసిపి సైదులు,డిఆర్డిఏ నాగిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎంపి చామలపై చవాకులు మానుకోవాలి

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిపై మాజీ ఎంఎల్ఏ చిరుమర్తి లింగయ్య అవాక్కులు చవాక్కులు మానుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పర్వతం వేణు అన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి లింగయ్య మొదటి సారి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు రాజకీయంలో ఢిల్లీ స్థాయిలో చామల కిరణ్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి గెలుపు కోసం ఎంతో కృషి చేసిన విషయం మర్చిపోవద్దు అన్నారు.

# ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిన కెసిఆర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** దశాబ్దాల పాటు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అభివృద్ధికి మార్గ సూత్రాలు రూపొందించకుండా కాంట్రాక్టు కమిషన్ లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి మొత్తం తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మాజీ సిఎం కెసిఆర్ విధ్వంసం చేశాడని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ విమర్శించారు. కెసిఆర్ దుర్మార్గాలు అరికట్టడం కొరకే ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ జన సమితి కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని అని తెలిపారు. తెలంగాణ జన సమితి ప్రజాస్వామ్య రాజకీయాల కోసం సామాజిక న్యాయం కొరకు ప్రజలను సమీకరిస్తుందన్నారు. ఈ నెల 9న నల్లగొండలో జరిగే తెలంగాణ జన సమితి జిల్లా ప్లీనరీ పునస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మార్జున్ మాట్లాడుతూ మిగులు బడ్జెట్ వున్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కెసిఆర్‌దేనన్నారు. జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ 9వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు పార్టీ ప్లీనరీ సమావేశం. అనంతరం సాయంత్రం 4 గంటల నుండి తెలంగాణ ఉద్యమకారులు ,ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు, పౌర సమాజంతో కోదండరాం మాట, ముచ్చట ఉంటుందని జిల్లాలోని ఉద్యమకారులు , ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్, కార్యదర్శి పులి పాపయ్య, ఉపాధ్యక్షులు ఎల్ క్రాంతి కుమార్, పెరిక యాదయ్య, ఆర్ఎస్ ప్రకాష్ నాయుడు ,దైద ప్రేమ్ కుమార్ , ఎన్ బచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

**ప్రజాపక్షం/నల్లగొండ :** పోలీస్ శాఖలో పనిచేస్తూ చనిపోయిన పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తామని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్మూడ్ రిజర్వ్ విభాగం లో పనిచేస్తూ అనారోగ్య కారణంగా మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ రతన్ లాల్ కుటుంబ సభ్యులు, కుమారుడికి రెండు లక్షల రూపాయల చెక్కు అందజేశారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ చనిపోయిన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ది సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేస్తామని చెప్పారు. పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో చనిపోయిన పోలీస్ కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

**ఆర్మూడ్ రిజర్వ్ కానిస్టేబుళ్ల కు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి..**

జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆర్మూడ్ రిజర్వడ్ విభాగంలో పనిచేస్తున్న ఎనిమిది మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్‌పి తన కార్యాలయంలో పట్టీలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. .ఈ కార్యక్రమంలో ఆర్.ఐ సంతోష్ జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజ్, సోమయ్య,సిబ్బంది పాల్గొన్నారు.



## అభివృద్ధే లక్ష్యంగా ముందుకు...



**ప్రజాపక్షం/దేవరకొండ :** నియోజకవర్గంలోని ప్రజలు ప్రమాదవశాత్తు బాధపడుతూ మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న నిరుపేద కుటుంబాలకు చేయూతనిస్తూ, ప్రభుత్వం సిఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటుందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 68 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన దాదాపు రూ. 17లక్షల విలువ గల చెక్కులను లబ్దిదారులకు ఎంఎల్ఏ బాలునాయక్ పంపిణి చేశారు. ప్రజారోగ్యానికి సిఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ ఎంపిపి జాన్‌యాదవ్, మాజీ జడ్పిటిసి అరుణసురేష్‌గౌడ్, బుజ్జి, వెంకటయ్య, కృష్ణయ్య, మండల పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య, నాగభూషణం, బద్య, వెంకటేష్‌గౌడ్, యుగంధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాంసింగ్, హరికృష్ణ, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు రావొద్దు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రాష్ట్ర సివిల్ సప్లయ్ కమీషనర్ చౌహాన్‌ను, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిలను కోరారు. మంగళవారం వారిని ఎమ్మెల్యే నల్లగొండ జిల్లా కేంద్రంలో కలిసి మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో రైతులు ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా మండలాల్లో నూతన ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా రైస్ మిల్లుల్లో రైతులకు తగిన గిట్టుబాటు ధర దక్కేలా చూడాలని, అన్నిరకాల ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.



# విద్యార్థి మృతితో నిర్మల్‌లో ఉద్రిక్తత పరిస్థితులు...

## విద్యార్థిమృతి ఘటనపై కలెక్టర్ సీరియస్..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి షేక్ అయాన్ మృతి చెందడం బాధాకరమని,ఘటనకు సంబంధించి నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు.మంగళవారం నిర్మల జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ అయాన్ మృతి చెందడంతో ఘటనకు సంబంధించి ఆర్డీఓ రత్న కాళ్యాణి ఆధ్వర్యంలో విచారణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.విచారణ కమిటీ నివేదిక ఆధారంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సంతోష్,ఉపాధ్యాయుడు టి.రమేష్,పీఈటీ పెంటన్న,హెల్త్ సూపర్వైజర్ సుజాత లను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ వైద్యం కోసం వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ సుపత్రి లో పలు వార్డులను పరిశీలించి రోగులతో ఆసుపత్రి పనితీరుపై రోజువారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది అటెండెన్స్ ను పరిశీలించగా డాక్టర్స్, సిబ్బంది అందరూ విధులలో ఉన్నారని డాక్టర్స్ బయోమెట్రిక్ అటెండెన్స్ ద్వారా వారి విధివిధానాలను పరిశీలించడం జరుగుతుందని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పీహెచ్సీ ఆస్పత్రి ఆవరణలో ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటింటి సర్వే



**ప్రజాపక్షం/బాన్సువాడ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను అధికారులు పక్కాగాచేపట్టాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం ఎస్ఆర్ఎన్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లు, పరిశీలకులకు సబ్ కలెక్టర్ కిరణ్మయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటి సర్వే చేపట్టేటప్పుడు కుటుంబ సభ్యుల వివరాలు తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఎంపిడివో బషీరుద్దీన్, ఎంఈవో నాగేశ్వరరావు, ఎంపిఓ సత్యనారాయణ రెడ్డి, విజయ్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి:** భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్, చేంగల్, బాబాపూర్, పల్లికొండ తదితర గ్రామాల్లో ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలపై కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిస్థాయి లక్ష్యానికనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలన్నారు. రైతుల ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి లారీలలో లోడ్ చేసి నిర్ధేశిత రైస్‌మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ వెంటాదివెంట జరిగేలా పర్యవేక్షణ జరుపాలన్నారు. వెంట డీఆర్‌డీఓ సాయగౌడ్ తదితరులున్నారు.

## నీట్‌లో జాతీయ ర్యాంకు సాధించిన విద్యార్థినికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** నీట్‌లో జాతీయస్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థినికి జిల్లా ఎస్పి శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామానికి చెందిన ఆదివాసి విద్యార్థిని మానేపల్లి శిరీష ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి ర్యాంకు సాధించి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల నందు సీటు పొందింది. ఎంబిబిఎస్ సీట్ సాధించినా వైద్య వృత్తి చదువుటకు ఆర్థికపరంగా ఇబ్బందులు ఉన్నాయని ఇతర పోలీసు అధికారులు తో తెలవడంతో 25,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి డి.వి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. చదువుకు పేదరికం అడ్డురాదని అందుకు శిరీష గొప్ప ఉదాహరణ అని అభినందించారు. అనంతరం శాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, కొలవర్ సంఘం జాతీయ అధ్యక్షులు సుంకే కృష్ణయ్య, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు పోచయ్య పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/శివ్వంపేట :** జిల్లాలో శాంతిభద్రతల విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం శివ్వంపేట పోలీస్ స్టేషన్‌ను ఎస్పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకోవడానికి సీసీఎస్, ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామన్నారు. గ్రామాలలో పెట్రోలింగ్ ను మరింత ముమ్మరం చేస్తున్నామని ఆయన తెలిపారు. శివ్వంపేటలో జరిగిన మైనర్ బాలిక మిస్సింగ్ కేసును చేదించేందుకు మూడు, నాలుగు బృందాలను రంగంలోకి దించామని, అందుకు సహకరించిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగ కృష్ణ, తూప్రాన్ ఎస్ఐ శివానందం, శివ్వంపేట ఇంచార్జి ఎస్ఐ రాజు, ఎఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి, సాయిలు, కానిస్టేబుల్ జానీ, పాల్గొన్నారు.

### బంధువులు ఆందోళనకు స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్
### విద్యార్థి తండ్రికి ఔట్సోర్సింగ్ లో ఉద్యోగం...
### ఎంజెపి పాఠశాల సిబ్బందిపై సస్పెన్షన్ వేటు..







**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** అస్వస్థతకు గురై విద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎంజెపి పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి ఫయాజ్ హుస్సేన్(14) ఉదయం బేస్ బాల్ ఆడుతూ అస్వస్తతకు గురికాగా గమనించిన ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని పరీక్షించిన వైద్యులు విద్యార్థి మృతి చెందినట్లు తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు మాత్రం అనుమానాలు ఉన్నాయి అంటూ పాఠశాల ముందు నా బటాయించి ఆందోళన చేయడం ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడడంతో భారీ బందోస్తు ఏర్పాటు చేశారు పూర్తి వివరాలు తెలవాలంటే పట్టణంలోని మినీ ట్యాంకు వద్ద ఆందోళన చేయడంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఏలాంటి సంఘటన జరగకుండా బందోస్తునిర్వహించారు.

**బంధువుల ఆందోళన...**

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందున్న జాతీయ రహదారిపై మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. జ్యోతిబాపూలే పాఠశాల సిబ్బంది కారణమని ఆరోపిస్తూ జాతీయ రహదారిపై బైఠాయించారు. పాఠశాల సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్, పాఠశాల సిబ్బంది వచ్చి సమాధానం చెప్పే వరకు కదిలేది లేదని బైఠాయించారు. దీంతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈవో రవీందర్ రెడ్డి, సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

**మృతుని కుటుంబానికి న్యాయం చేయండి : శ్రీహరి రావు**

విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించారు. బాధితునికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.ఫిట్స్ రావడంతో విద్యార్థి మృతి బాధాకరం, వారి తండ్రికి అవుట్ ఉద్యోగం ఇస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్. మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మల్ కేంద్రంలోని తొమ్మిదవ తరగతి చదువుతున్న ఫయాజ్ హుస్సేన్ తెల్లవారుజామున ఫిట్స్ కారణంగా చనిపోవడం చాలా బాధాకరమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని లోలం గ్రామానికి చెందిన విద్యార్థి ప్రతిరోజు లాగే మంగళవారం తెల్లవారుజామున నిద్రలేచిన తర్వాత గ్రౌండ్స్‌కి వెళ్లి కాసేపటికే తనకు పుట్టిందని వీటికి సమాచారం అందించగా వెంటనే మెడికల్ రూమ్ లోకి తీసుకొని వెళ్లలోగా అతనికి ఫిట్స్ వచ్చిందని, ఆయాజ్ హుస్సేన్ కుటుంబానికి రెండు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేసియాతో పాటు ఔట్సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని మంతి హామీ ఇచ్చారు. హాస్టల్లో విద్యార్థులు అనారోగ్యంగా ఉంటే వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పంపించాలని అధికారులకు సూచించారు.

**ఎంజెపి పాఠశాల సిబ్బందిపై సస్పెన్షన్ వేటు..**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎంజెపి పాఠశాలలో మంగళవారం ఉదయం 9వ తరగతి విద్యార్థి ఫయాజ్ హుస్సేన్ మృతి చెందగా విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ తిరుపతి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మృతికి గల కారణలను తెలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థి మృతి కారణమైన ప్రిన్సిపల్ సంతోష్ తోపాటు, మిగతా నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి మృతి పట్ల సంతాపం తెలిపారు.

## కలుషిత ఆహారం తిని యువతి మృతి



**ప్రజాపక్షం/బోథ్:** బోథ్ మండలం పొచ్చెర క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న సెయింట్ థామస్ పాఠశాలలో కిచెన్ పని చేస్తున్న పూల్ కొలి బైగా(19) అనే యువతి కలుషిత ఆహారం తిని మృతి చెందింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈమె ఈనెల 2న నిర్మల్ జిల్లా కేంద్రంలోని గ్రిల్ నైన్ మల్టీకుషన్ రెస్టారెంట్‌లో బోజనం చేసింది. పాఠశాలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు నిర్మల్ జిల్లా కేంద్రంలో షాపింగ్ చేసి రాత్రి బోజనం చేశారు. అనంతరం అదే రోజు రాత్రి బోజనం చేసిన వారందరికి కడుపు నొప్పితో పాటు వాంతులు విరేచనాలు అయ్యాయి. దీంతో బోథ్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అయితే మృతురాలు సహితం 2వ తేదీ రాత్రి నుంచి చికిత్స తీసుకుంటూనే ఉంది. అయితే సోమవారం రాత్రి వాంతులు విరేచనాలు తగ్గకపోగా మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. దీంతో ఆ పాఠశాల ప్రిన్సిపల్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## 'పటాన్‌చెరువు' చెరువులు.. పర్యాటక కేంద్రాలు

### రూ.28.36 కోట్లతో పటాన్‌చెరువు సాకి, తిమ్మక్క, ముత్తంగి ఏన్నం చెరువుల అభివృద్ధి
### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/పటాన్చెరు:** పటాన్‌చెరువు డివిజన్ పరిధిలోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, ముత్తంగి గ్రామ పరిధిలోని ఎన్నం చెరువులను 28.36 కోట్ల రూపాయలతో పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని పటాన్‌చెరు వుశాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిహెచ్ ఎంసి, హెచ్ ఎండిఏ చెరువుల విభాగం ఉన్నతాధికారులు ,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి తిమ్మక్క, చెరువు, సాకి చెరువు, ఎన్నవం చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరువు డివిజన్ పరిధిలో చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ నేపథ్యంలో డివిజన్ పరిధిలోని ప్రధాన చెరువులైన తిమ్మక్క చెరువు, ను ఏపిఆర్ గ్రూప్ సౌజన్యంతో 3.46 కోట్ల రూపాయలతో సాకి చెరువును ఇంకార్ గ్రూప్ సౌజన్యంతో8 కోట్ల రూపాయలతో ముత్తంగి ఎన్నం చెరువును హెచ్ ఎండిఏ ద్వారా ఆరు కోట్ల 90 లక్షల రూపాయలతో అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. సాకి చెరువు కట్టపైన జిహెచ్ఎంసి చెరువుల విభాగం ద్వారా 10కోట్ల రూపాయలతో సీసీ రోడు నిర్మాణ పనులు ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ప్రతి చెరువు కట్ట పైన సెంట్రల్ సిస్టం ,గ్రీనర్ వాకింగ్ ట్రాక్ పిల్లలు ఆడుకునేందుకు పార్క్, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంబిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పోరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, హెచ్ ఎండిఏ చెరువుల విభాగం డి.ఈ రామారావు, జిహెచ్ ఎంసి చెరువుల విభాగం డి.ఈ నళిని ,తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్,పాల్గొన్నారు.

## సమగ్ర ఇంటింటి సర్వే పకడ్బందీగా చేయాలి

### కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు 6,7,8 తేదీల్లో ఇండ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం నుండి హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, సూపర్ వైజర్లుతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6, 7,8 తేదీల్లో గ్రామ, మున్సిపాలిటీలో ఇంటింటి జాబితా ప్రారంభం చేయాలని తెలిపారు. రెండు రోజుల్లో ఇంటింటి జాబితా గణనలో ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలని, సర్వే పూర్తి అయిన తదుపరి మార్కర్ పెన్ తో తేదీ వేయాలని సూచించారు. 8వ తేదీ నుండి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం కావాలని తెలిపారు. ఈ ప్రక్రియ 15రోజుల్లో పూర్తి చేయుటకు పభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 21 మండలాలు, 2, లక్షల 13,950 ఇండ్లు సర్వే నిర్వహణకు 1571 ఎన్యూమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వే నిర్వహణకు గ్రామీణ ప్రాంతాల్లో 1468 మంది, పట్టణ ప్రాంతంలో 256 మందితో కలిపి మొత్తం 1724 మంది ఎన్యూమరేటర్లను నియమించామని, తెలిపారు. పర్యవేక్షణకు గ్రామీణ ప్రాంతాలకు 160 మంది, పట్టణ ప్రాంతానికి 26 మంది, మొత్తం 186 మందిని నియమించినట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లగా పీఎస్ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, విఓఎస్ లను నియమించినట్లు తెలిపారు. సర్వే పూర్తయిన ప్రతీ ఇంటికి అంటించిన స్టిక్కర్‌లో చెరిగిపోకుండా మార్కర్ పెన్‌తో తేదీలు వేయాలని సూచించారు. ఏ రోజుకారోజు వివరాలను ఆన్లైన్ చేయడానికి డేటా ఎంట్రీ సిబ్బందిని నియమించాలని అన్నారు. సర్వే చేసే ప్రాంతాల్లో ఒక రోజు ముందుగానే విస్తృత సమాచారం ఇచ్చి ప్రజలు సర్వేకు అవసరమైన అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కల్పించాలని తద్వారా నిర్దేశిత సమయంలో సర్వే పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు.

## కలప దుంగలు పట్టివేత



**ప్రజాపక్షం/ ఇచ్చోడ :** అక్రమంగా రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన కలప దుంగలను మంగళవారం సాయంత్రం స్థానిక అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. స్థానిక అటవీశాఖ అధికారి పుండలిక్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుండి గ్రామ శివారంలో అక్రమంగా రవాణా చేయడానికి స్మగ్లర్లు కలప దుంగలను నిల్వ ఉంచారని ముందస్తు సమాచారం అందడంతో అటవీశాఖ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిం చారు. గుండి గ్రామ శివారంలో గల ఓ రైతు పత్తి పంట పొలంలో సుమారు రూ. 35 395 విలువ గల కలప దుంగలను గుర్తించి, వాటిని స్వాధీనం పర్చుకున్నామని పేర్కొన్నారు. స్వాధీన పర్చుకున్న కలప దుంగలను ఇచ్చోడ కలప డిపోకు తరలించామని ఆయన వివరించారు. కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



### కలెక్టర్ అభిలాష్ అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు.మంగళవారం సోన్ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి సందర్శించి,ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆయన పరిశీలించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని సూచించారు.త్రాగునీరు టెంట్,తూకపు,తేమ యంత్రాలు,గన్ని బ్యాగ్స్,టార్పాలిన్‌లు,అందుబాటులో ఉంచాలని సూచించారు.కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం కేటాయించిన మిల్లులకు తరలించాలని,ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని,అన్ని రకాల రిజిస్టర్ లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్,తహసిల్దార్ మల్లేష్,డిఎస్ఓ కిరణ్ కుమార్,డిఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్,రైతులు,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## దళారులచేతిలో మోసపోవద్దు: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ముధోల్:** దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని చించాల, వెంకటాపూర్, విట్టోలి, బోరేగాం, వడ్తాల, చింతకుంట, కారేగాం, గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించే ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. రైతు అమ్మిన పంటకు గిట్టుబాటు ధర లభించాలంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే ఆశ్రయించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ షిందే ఆనంద్ రావు పటేల్, పిఏసిఎస్ చైర్మన్ తీగల వెంకటేష్ గౌడ్,డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ జడ్పీటీసీ లు నర్సాగౌడ్,వసంత రమేష్, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు తాటివార్ రమేష్, మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియలో... అధికారులు సమన్వయంతో పని చేయాలి



**ప్రజాపక్షం/మంచిర్యాల/కాగజ్ నగర్ :** ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అధికారులకు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని కౌటాల మండలం సాండ్‌గాం గ్రామ రైతు వేదికలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుపై రైతులు, వ్యవసాయ, విస్తరణ అధికారులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, సహకార శాఖ అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో 34 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈనెల 15వ తేదీ తరువాత దాన్యం వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి జొన్నరకం ధాన్యం రాకుండా సరిహద్దు ప్రాంతాలైన వాంకిడి, హడ్కలి, వెంకట్రావుపేట, గూడెం వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని, మండల ప్రత్యేక అధికారులు కొనుగోలు ప్రక్రియపై పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆక్మసిక తనిఖీ



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** అందోల్ మండలం డాకూరు, నాదులాపూర్ లలో గ్రామీణాభివృద్ధి సంస్థ ఐకెపి ఆద్వర్యంలో నెలకొల్పిన దాన్యం కొనుగోలు కేంద్రాలను నాదులాపూర్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం, ఆక్మసిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి తాము పండించిన వరి దాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు దర పొందాలన్నారు. సరైన తేమ శాతం ఉన్న దాన్యాన్ని తూకం వేయాలని రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన దాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీసారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఏలాంటి ఇబ్బందులు తెలెత్తకుండా అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. వరి కోత యంత్రం వేగం (RPM) ఎంత పెట్టి వరి కోస్తున్నారని యంత్ర జమానిని ప్రశ్నించారు? కొత సమయంలో మిషన్ ఆర్పీఎం 18 కన్నా ఎక్కువగా ఉండేలా చూడాలని తద్వారా రైతుల ధాన్యాంలో తాలు చెత్త లేకుండా నాణ్యమైన ధాన్యం వచ్చే అవకాశం ఉందని రైతులక సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్ ,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని జ్యోతి అదనపు పిడిడి ఆర్‌డిఓ జంగారెడ్డి ,ఐ.కే.పి సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యాలయంలో కనీస సౌకర్యాలకు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట్:** లక్షెట్టిపేట్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో తహశీల్దార్ దిలీప్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిత్యం రకరకాల సర్టిఫికెట్స్ కొరకే కాకుండ భూముల రిజిస్ట్రేషన్ కొరకు వచ్చే వారికి కార్యాలయంలో కనీసం వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, కనీసం తాగడానికి మంచి నీరు కూడ లేని పరిస్థితి నెలకొందన్నారు. విశ్రాంతి హాల్ టాయిలెట్స్ ప్రహరీ గోడ, విశ్రాంతి భావనం తదితర కనీస వసతులు కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కమిటి సభ్యులు మేదరి దేవవరం, లింగంపెల్లి బానుచెందర్, రచర్ల రవికుమార్ లు పాల్గొన్నారు

## క్రీడ



# టీమిండియా బలమే బలహీనతగా మారింది!

సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఘోర పరాజయంతో టీమిండియా బ్యాటింగ్ వైఫల్యంపై తీవ్ర చర్చ జరుగుతోంది. కొన్నేళ్లుగా స్పిన్ పిచ్లపై టీమిండియా బ్యాటర్లు తేలిపోతున్నారు. ఒకప్పుడు టీమిండియాకు స్పిన్ ప్రధాన ఆయుదం. స్వదేశంలో స్పిన్ పిచ్లపై ప్రత్యర్థి జట్లను చిత్తు చేసి.. ఆ తర్వాత ప్రత్యర్థి స్పిన్నర్లపై భారీగా పరుగులు చేసి విజయాలు అందుకునేది. కానీ ఇదంతా గతం. ఇప్పుడు టీమిండియా బలమే బలహీనతగా మారింది. మన స్పిన్ ఉచ్చు మనకే చుట్టుకుంటోంది. శ్రీలంక గడ్డపై వన్డే సిరీస్ ఓటమి.. న్యూజిలాండ్తో టెస్ట్ సిరీస్ పరాజయం ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. న్యూజిలాండ్తో స్పిన్ పిచ్లపై ఆడిన చివరి రెండు టెస్ట్లో టీమిండియా 156, 245, 263, 121 పరుగులు మాత్రమే చేసింది. అంతేకాకుండా స్పిన్ బౌలింగ్లో 24.4 సగటుతో 37 వికెట్లు కోల్పోయింది. రిషభ్ పంత్(66), వాషింగ్టన్ సుందర్(44.5) మినహా మిగతా బ్యాటర్లు స్పిన్కు తడబడ్డారు. విరాట్ కోహ్లీ(16.75), రోహిత్ శర్మ(10.5) దారుణంగా విఫలమయ్యారు. ఒకప్పుడు సచిన్, గంగూలీ, ద్రవిడ్, లక్ష్మణ్ వంటి ఆటగాళ్లు స్పిన్ను సమర్థవంతంగా ఆడేవారు. 2020 వరకు స్పిన్ బౌలింగ్లో టీమిండియాకు తిరుగులేదు. కానీ ఆ తర్వాతి నుంచి పరిస్థితి మారిపోయింది. అయితే దేశవాళీ క్రికెట్ ఆడకపోవడమే ఇందుకు కారణమని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.
తీరిక లేని షెడ్యూల్ కారణంగా స్టార్ ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఆడటం లేదని, దాంతోనే స్పిన్ బౌలింగ్ ఆడే సామర్థ్యం తగ్గిపోయిందంటున్నారు. రోహిత్ శర్మ చివరగా 2015లో, విరాట్ కోహ్లీ 2013లో రంజీ ట్రోఫీ ఆడారు. గాయాల బారిన పడే ప్రమాదం ఉందని టీమిండియా మేనేజ్మెంట్ కూడా వారిపై ఎలాంటి ఒత్తిడి చేయలేదు. వాస్తవానికి టీమిండియా టెస్ట్ సీజన్ ప్రారంభానికి ముందే భారత స్టార్ ఆటగాళ్లందరినీ దేశవాళీ క్రికెట్ ఆడించాలని హెడ్ కోచ్ గంభీర్ భావించాడు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్కు ఈ విషయాన్ని చెప్పి.. దులీప్ ట్రోఫీ ఆడించాలని సూచించాడు. దులీప్ ట్రోఫీ ఆడాలని రోహిత్, కోహ్లీ, అశ్విన్ను అగార్కర్ అడిగితే ఆసక్తి లేదని చెప్పారని వార్తలు వచ్చాయి. 42 రోజుల విశ్రాంతిని స్టార్ ఆటగాళ్లు కుటుంబ సభ్యులతోనే గడిపారు. దులీప్ ట్రోఫీలో స్టార్ ఆటగాళ్లు ఆడి ఉం పరిస్థితి మరోలా ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దూకుడు కూడా టీమిండియా బ్యాటర్ల వైఫల్యానికి ప్రధాన కారణం. టీ20 ఫార్మాట్ ఎక్కువగా ఆడుతుండటంతోనే ఈ సమస్యకు ప్రధానంగా తెలుస్తోంది.

# విరాట్ కోహ్లీ బయోపిక్‌లో రామ్‌చరణ్!





టీమిండియా మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పుట్టిన రోజు సందర్భంగా ఓ ఆసక్తికర న్యూస్ వైరల్గా మారింది. విరాట్ కోహ్లీ బయోపిక్కు నిర్మించేందుకు బాలీవుడ్కు చెందిన ఓ బిగ్ ప్రొడక్షన్ హౌస్ ప్లాన్ చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో విరాట్ కోహ్లీ పాత్రను టాలీవుడ్ హీరో, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పోషిస్తారని, అతి త్వరలోనే ఈ బయోపిక్కు సంబంధించి అధికారిక ప్రకటన రానుందని సమాచారం. అయితే గతంలోనే ఈ వార్తలు చక్కర్లు కొట్టగా.. రామ్ చరణ్ టీమ్ ఖండించింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. కోహ్లీ బయోపిక్కు సంబంధించి ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేసింది. అయినా ఈ వార్తలకు బ్రేక్ పడటం లేదు. కోహ్లీ బర్త్ డే సందర్భంగా మరోసారి ఈ బయోపిక్ వార్త వైరల్గా మారింది. ఒకవేళ కోహ్లీ బయోపిక్ తీసినా.. తన సతీమణి బాలీవుడ్ హీరోయిన్ అనుష్క శర్మ సాయంతో అతనే తన పాత్రను పోషిస్తాడని, కోహ్లీకి కూడా మంచి యాక్టింగ్ స్కిల్స్ ఉన్నాయని అతని ఫ్యాన్స్ అంటున్నారు. తమ బయోపిక్కు అనుష్క శర్మనే నిర్మిస్తుందని, ఇతరులకు ఎందుకు అవకాశం ఇస్తుందని ప్రశ్నిస్తున్నారు. అంతర్జాతీయ క్రికెట్కు దూరమైన తర్వాతే విరాట్ కోహ్లీ బయోపిక్ వచ్చే అవకాశం ఉంది. మంగళవారం(నవంబర్ 5)తో కోహ్లీ 36వ ఏట అడుగుపెట్టాడు. ఈ సందర్భంగా కోహ్లీకి సహచర, మాజీ క్రికెటర్లతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నారు. అయితే విరాట్ కోహ్లీ ప్రస్తుతం పేలవ ఫామ్తో ఇబ్బంది పడుతున్నారు. న్యూజిలాండ్తో ఇటీవల ముగిసిన మూడు టెస్ట్ సిరీస్లో విరాట్ కోహ్లీ దారుణంగా విఫలమయ్యాడు. 6 ఇన్నింగ్స్లో కలిపి 93 పరుగులే చేశాడు. కోహ్లీ, రోహిత్ వైఫల్యం కారణంగా టీమిండియా మూడు టెస్ట్ సిరీస్లో క్లీన్ స్వీప్ అయ్యింది. నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియా వేదికగా జరిగే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా ఐదు టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్లో విరాట్ కోహ్లీతో పాటు ఇతర సీనియర్లు సత్తా చాటితేనే జట్టులో కొనసాగుతారు.లేకుం సీనియర్లను పక్కనపెడుతారని ఇప్పటికే బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

## కోహ్లీ ఫస్ట్ సెంచరీకి గంభీర్ ఫిదా..



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సాధించిన తొలి అంత ర్జాతీయ శతకానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఫిదా అయ్యాడు. టీమిండియా హెడ్ కోచ్గా బాధ్యతలు చేపట్టకముందు గంభీర్.. తరుచూ విరాట్ కోహ్లీనే విమర్శించేవాడు. మైదానంలో ఈ ఇద్ద రూ గొడవపడిన సందర్భాలు ఉన్నాయి. ఐపీఎల్లో రెండు సార్లు ఈ ఇద్దరూ కొట్టుకోవడానికి సిద్ధమయ్యారు. గత ఐపీఎల్ సీజన్లో ఇద్దరూ తమ గొడవలకు ఫుల్స్టాప్ పెట్టి ఒక్కటయ్యారు. ప్రస్తుతం టీమిండియా హెడ్ కోచ్గా గౌతమ్ గంభీర్.. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కలిసి పని చేస్తున్నారు. మధ్యలో ఈ ఇద్దరు గొడవపడినా.. ఒకప్పుడు చాలా సన్నిహితంగా ఉండేవారు. ఢిల్లీకి చెందినవారే కావడంతో వారి మధ్య మంచి సాన్నిహిత్యం ఉండేది. కోహ్లీకి పెదన్నలా గంభీర్ వ్యవహరించేవాడు. కెరీర్ ఆరంభంలో అతనికి గంభీర్ అండగా నిలిచాడు. కోహ్లీ సాధించిన తొలి అంతర్జాతీయ శతకానికి ఫిదా అయ్యి తన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందజేశాడు. 15 ఏళ్ల క్రితంలో 2009లో భారత్లో శ్రీలంక పర్యటించి నప్పుడు నాలుగో వన్డేకు గాయంతో యువరాజ్ సింగ్ దూరమయ్యాడు. ఆ సిరీస్లో బెంచ్ ఆటగాడిగా కొనసాగుతున్న కోహ్లీకి యువరాజ్ సింగ్ స్థానంలో అవకాశం దక్కింది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అప్పటి సహచర ఆటగాడు గౌతమ్ గంభీర్తో కలిసి సాధికారికంగా బ్యాటింగ్ చేసిన కోహ్లీ.. అంతర్జాతీయ క్రికెట్లో తన తొలి శతకాన్ని అందుకున్నాడు.





## 'పుష్ప' క్రేజీ పోస్టర్ తో ట్రైలర్ అప్డేట్..

ప్రస్తుతం పాన్ ఇండియా సినిమా ఆడియెన్స్ ఓ రేంజ్ లో ఎదురు చూస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పుష్ప 2 ది రూల్ కోసం అందరికీ తెలిసిందే. మరి ఎన్నో అంచనాలు ఉన్న ఈ సినిమాలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్ గా నటిస్తున్నారు. అలాగే ఈ చిత్రాన్ని దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తుండగా ఇక నెక్స్ట్ అప్డేట్ గా మేకర్స్ ట్రైలర్ నే విడుదల చేయనున్నారని ఆల్రెడీ టాక్ ఉంది. అయితే లేటెస్ట్ గా ఓ సాలిడ్ పోస్టర్ ని మేకర్స్ ఇపుడు అల్లు అర్జున్ పాత్ర పుష్ప, వెర్సటైల్ నటుడు ఫహద్ ఫాజిల్ భన్వర్ సింగ్ షెకావత్ పై రిలీజ్ చేశారు. మరి ఇద్దరూ కూడా ఒకరినొకరు ఎదురెదురుగా చూసుకుంటున్న ఈ సీన్ సినిమాలో ఇద్దరి నడుమ ఈగో వార్ ఏ లెవెల్లో ఉంటుందో చూపించేలా కనిపిస్తుంది. ఇక దీనితోనే అతి త్వరలో ట్రైలర్ బ్లాస్ట్ రాబోతుంది అని మేకర్స్ కన్ఫర్మ్ చేసేసారు. ఇక దీనితో అవైటెడ్ ట్రైలర్ కోసం ఇపుడు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ భారీ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు అలాగే ఈ డిసెంబర్ 5న సినిమా గ్రాండ గా పాన్ ఇండియా భాషల్లో రిలీజ్ కాబోతుంది.

## రీల్





## 'మెకానిక్ రాకీ'నుండి సాంగ్ ప్రోమో

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మెకానిక్ రాకీ' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్కు రెడీ అయ్యింది. ఈ సినిమాను పూర్తి మాస్ యాక్షన్ ఎంటర్టైనర్గా చిత్ర యూనిట్ రూపొందించగా, ఈ సినిమా ప్రమోషన్స్ను వేగవంతం చేశారు మేకర్స్. తాజాగా ఈ సినిమా నుండి రెండో సింగిల్ సాంగ్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. 'ఐ హేట్ యు మై డాడీ' అంటూ సాగే ఈ పాటలో విశ్వక్ సేన్ సినిమాలో తన తండ్రిపై చాడీలు చెబుతున్నట్లుగా ఈ పాట లిరిక్స్ ఉన్నాయి. ఇక ఈ పాటను సింగర్ రామ్ మిర్యాల తన వాయిస్తో ఆకట్టుకునేలా పాడారు. ఈ పాటకు సనారె చక్కటి లిరిక్స్ అందించగా, జేక్స్ బిజోయ్ అదిరిపోయే బీట్తో సంగీతం అందించాడు. ఈ పాటను నవంబర్ 6న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఇక ఈ సినిమాలో అందాల భామలు మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్లు హీరోయిన్లుగా నటిస్తున్నారు. రవితేజ ముళ్లపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను రజనీ తాళ్లూరి ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని నవంబర్ 22న గ్రాండ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది.



## కమల్ 'థగ్ లైఫ్' టీజర్ రెడీ

యూనివర్సల్ హీరో కమల్ హాసన్ హీరోగా నటించిన సినిమా భారతీయుడు 2 తో ఈ ఏడాది పలకరించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా తర్వాత మరో ఐకానిక్ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్లో ఎన్నో ఏళ్ళ తర్వాత చేస్తున్న భారీ సినిమానే థగ్ లైఫ్. మరి అనౌన్స్మెంట్ నుంచే మంచి బజ్ ని తెచ్చుకున్న ఈ సినిమాలో అనేకమంది స్టార్స్ కూడా కనిపించనున్నారు. అయితే ఈ సినిమా నుంచి మేకర్స్ ఇపుడు ఇంట్రెస్టింగ్ అప్డేట్ ని అందించారు. ఈ సినిమా తాలూకా టీజర్ కట్ ని అయితే ఈ నవంబర్ 7న ఉదయం 11 గంటలకు రిలీజ్ చేస్తున్నట్టు కన్ఫర్మ్ చేశారు. మరి తమ థగ్స్ పరిచయం చేస్తున్నాం అన్నట్టు ఈ ప్రకటన ఇవ్వగా ఆరోజు కమల్ హాసన్ బర్త్ డే కానుకగా ఈ సినిమా టీజర్ ని ఇస్తున్నట్లు తెలిపారు. మరి ఈ టీజర్ ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ భారీ సినిమాకి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే కమల్, ఆర్ మహేంద్రన్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## ఏకపక్ష నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ స్పీకర్తో మంచి చర్చ జరిగిందని, ఆయన తమ పట్ల సహృదయంతో వ్యవహరించారని,తాము చెప్పిందంతా ఓపికతో విని, ఈ అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ఆప్ ఎంపి సంజయ్ సింగ్, డిఎంకె ఎంపి ఎ.రాజాలు మాట్లాడుతూ స్పీకర్తో తమ సమావేశం ఫలప్రదమైందని, తమ సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్కు తాము వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. వినతిపత్రంపై మహమ్మద్ జావేద్, ఇమ్రాన్ మసూద్ (కాంగ్రెస్), రాజా (డిఎంకె), అసదుద్దీన్ ఓవైసీ(ఎఐఎంఐఎం), సంజయ్ సింగ్(ఆప్), కళ్యాణ్ బెనర్జీ(టిఎంసి)లు సంతకాలు చేశారు. జెపిసి సమావేశాల తేదీలను నిర్ణయించడం, ఎవరిని సాక్షులుగా పిలవాలని నిర్ణయించడంపై చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ఒకోసారి సమావేశం వరుసగామూడు రోజులు జరిగాయన్నారు. ఈ అంశాలపై నిర్ణయం తీసుకునే ముందు సభ్యలతో లాంఛనంగా సంప్రదించాలని జెపిసి చైర్మన్క సూచించాల్సిందిగా స్పీకర్ను కోరారు. ఒకవేళ తమను పట్టించుకోకపోతే జెపిసి నుంచి శాశ్వతంగా తప్పుకోవాల్సి వస్తుందని చెప్పినట్లు సమాచారం. ఈ అంశంపై వారిని ప్రశ్నించగా, చర్చల వివరాలను వెల్లడించబోమని ప్రతిపక్ష ఎంపిలు మీడియాతో అన్నారు. భవిష్యత్తులో జెపిసి సమావేశాలకు హాజరవుతారా? అని ప్రశ్నించగా, స్పీకర్ పరిశీలిస్తానని చెప్పినందున తప్పక హాజరవుతామన్నారు.

# ధాన్యం దిగుబడిలో తెలంగాణ సరికొత్త రికార్డు

### 150 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికి అవకాశం
### మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరి ధాన్యం దిగుబడిలో తెలంగాణ సరికొత్త రికార్డ్ సృష్టించబోతోందని మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి , తుమ్మల నాగేశ్వర రావులు తెలిపారు. ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే 150 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, యావత్ భారత దేశంలోనే ఇంత దిగుబడి రావడం ఇదే మొదటిసారి కానుందన్నారు. ధాన్యం కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సహచర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ లతో పాటు ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,తుమ్మల నాగేశ్వరరావు రావులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , తుమ్మల నాగేశ్వరరావులు మాట్లాడుతూ రైతులు 60.80 లక్షల ఎకరాలలో వరి సాగు చేయగా 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చాని ప్రభుత్వం అంచనా అని తెలిపారు. ఇందులో కోనుగోలు కేంద్రాల కు 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉండగా అందులో 47 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలుగా,44 లక్షలు దొడ్డు రకం ఉంటాయన్నారు. ఖరీఫ్ నుండి సన్నాలకు బోనస్ గా క్వింటా ఒక్కొంటికిరూ. 500లు ప్రకటించిన నేపథ్యంలో రైతులు సన్నాల వైపు మొగ్గు చూపరన్నారు. దిగుబడిలో సన్నాలు 47 లక్షల అంచనాయో ఇందుకు నిదర్శనమని మంత్రులు చెప్పారు. ధాన్యంఈ మొత్తం కొనుగోలుకు గాను రూ.30 వేల కోట్లు అవసరం కాగా ఇందులో ఇప్పటికే ప్రభుత్వం రూ.20 వేల కోట్లు విడుదల చేసిందని, పరిస్థితులను బట్టి అప్పటికప్పుడు అదనంగా నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నమన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యంకొనుగోలు విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అదే సమయంలో రైతులు అయోమయంలో పడకుండా ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ రైతాంగంలో అవగాహన కలిపించాలని మంత్రులు ప్రజాప్రతినిధులకు సూచించారు. కొనుగోలులో ఎక్కడా రాజీ పడేది లేదని ముమ్మాటికీ ఇది రైతు పక్ష పాత ప్రభుత్వమని రైతులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అత్యధికంగా రికార్డ్ స్థాయిలో పంట దిగుబడి ఆయిన నేపథ్యంలో కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వానికి అప్రతిష్ట రాకుండా చూడాలని ప్రజాప్రతినిధులను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో 7572 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణా బియ్యానికి బీహార్,పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో మంచి డిమాండ్ ఉందని ,రెండుమూడు బయటి దేశాలు కుడా తెలంగాణా బియ్యాన్ని దిగుమతి చేసుకునేందుకు ఆసక్తి కనపరుస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే కొనుగోళ్లు జరుగుతున్నాయని ,తేమ శాతంలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు.ప్రకృతి విపత్తులతో అవాంతరాలు సంభవిస్తే అధిగమించేందుకు అధికారులనూ సన్నద్ధం చేయాలని పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి డి.యస్ చౌహాన్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ధాన్యంకొనుగోలులో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి తోడ్పాటునందించాలని ఆయన ఉద్బోధించారు.రైస్ మిల్లుల పరిశ్రమ కు ప్రభుత్వం చేయుత నిస్తుందన్నారు.సిఎంఆర్ బియ్యం మిల్లింగ్ చార్జీలు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు..సన్నాలకురూ. 10 నుండి రూ. 50లు, దొడ్డ రకానికి రూ.10 నుండి రూ.40లకు పెంచమన్నారు .నిబంధనల మేరకే బ్యాంక్ గ్యారెంటీ పెట్టమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.అంతేగాకుండా కేవలం 10 నెలల వ్యవధి లోనే రూ.11,537.40 కోట్ల ఋణాబారాన్ని తగ్గించుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

# ఖైదీల దుస్థితిపై రాష్ట్రపతి సంభాషణే నివేదిక విడుదలకు స్ఫూర్తి

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్

**న్యూఢిల్లీ :** ఖైదీల దుస్థితిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన దయాగుణ సంభాషణ చాలా ఆసక్తిని రేకెత్తించిందని, ఆ సంభాషణే సుప్రీంకోర్టు నివేదిక ప్రచురణకు ప్రేరేపించిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్ వెల్లడించారు. ఆయన మంగళవారం 'భారతదేశంలో జైళ్ల జైల్ మాన్యువల్స్ మ్యాపింగ్ చేయడం, సిఫారసు కోసం చర్యలు, రద్దీని తగ్గించడం' అనేఅంశానికి సంబంధించి రూపొందించిన ఒక నివేదికను విడుదల చేసిన సందర్భంగా ప్రసంగించారు. రాష్ట్రపతి భవన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో డివై.చంద్రచూడ్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2022 రాజ్యాంగ దినోత్సవాల సందర్భంగా ప్రత్యేకించి విచారణ ఖైదీలు, ఖైదీల దుస్థితిని వివరిస్తూ ఆమె చేసిన ప్రసంగం తనను ఎంతగానో కదిలించిందని, అందుకు సిజెఐ డివై.చంద్రచూడ్ తన కృతజ్ఞతలను తెలియజేశారు. 'రాష్ట్రపతి చేసిన ప్రసంగమే సుప్రీంకోర్టులో చర్చకు దారితీసి ఈ రోజు నివేదిక విడుదలకు కారణమైంది. ఈ నివేదిక రాష్ట్రపతి విజన్‌ను ప్రతిబింబిస్తోంది. అయితే ఈ నివేదికను ఆమె విడుదల చేయడమే సముచితం' అని ఆయన పేర్కొన్నారు. 'రాష్ట్రంలోని వివిధ శాఖలు కూడా రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాలు సాధించడానికి ఇది ఒక ఉదాహరణగా నిలుస్తుందని తాను ధైర్యంగా చెప్పగలను' అని సిజెఐ చెప్పారు. ఖైదీలపై నివేదికలో భాగంగా రాష్ట్రపతి 'దేశానికి న్యాయం 75సంవత్సరాల భారతదేశ సుప్రీంకోర్టుపై ప్రతిబింబాలు' మరియు 'లీగల్ ఎయిడ్ త్రూ లా స్కూల్స్..ఎ రిపోర్ట్ ఆన్ ది వర్కింగ్ ఆఫ్ లీగల్ ఎయిడ్ సెల్స్ ఇన్ ఇండియా' నివేదికను విడుదల చేశారు. ఈ ప్రచురణలు అన్నీ పారదర్శకతకు పరికరాలుగా నిలిచి వన్నెతెస్తాయని డివైచంద్రచూడ్ చెప్పారు.

## మోదీ ఎత్తులు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించాలన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన నల్లా నర్సింహులు పాత్రను ప్రజలు మరువలేరన్నారు. నల్లా నర్సింహులు 31వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జనగామలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న నల్లా నర్సింహులు విగ్రహానికి నారాయణ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పాలకుర్తి నల్లా నర్సింహులు విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మతోన్మాధంతో బిజెపి చేస్తున్న దాడులు ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. అధికారంలో ఉండడమే లక్ష్యంగా మోదీ ఎత్తులు వేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్లా నర్సింహులు పోషించిన పాత్ర మరువలేమన్నారు. తెలంగాణ ప్రజలు నల్లా నర్సింహులు త్యాగాన్ని ఎప్పటికి మరువలేరన్నారు. ప్రజాస్వామ్యం ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని, రాజకీయ నాయకులు పార్టీలు మారినప్పుడు పదవులకు రాజీనామ చేయాలన్నారు. దేశ రక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటాలు, కృషిని ప్రజలు గుర్తించాలన్నారు.

**సాయుధ పోరాటంలో నల్లా పాత్ర ఎనలేనిది : ఎర్రబెల్లి**

తెలంగాణ రైతాంగ పోరాటంలో నల్లా నర్సింహులు పోషించిన పాత్ర ఎనలేనిదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటం జరిగగా అనేక మంది అశువులు బాశారన్నారు. 4వేల మంది అమరలు కాగా 10లక్షల ఎకరాల భూమి పంచబడిందన్నారు. నల్లా నర్సింహులు విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయడంతో పాటు పాఠ్యపుస్తకాల్లో ఆయన పోరాటానిన పాఠ్యాంశంగా చేర్చాలని పాశం యాదగిరి అన్నారు. ఒక బిసి నాయకుడిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎనలేని పాత్ర పోషించాడ న్నారు. తెలంగాణ టైగర్‌గా నల్లా నర్సింహులు పేరుందన్నారు. ఆయనను తెలంగాణ సమాజం ఎప్పటిక మరువదన్నారు.



**జనగామలో నల్లా నర్సింహులుకు నివాళ్లు**

జనగామలోని కలెక్టరేట్ ముందు ఉన్న నల్లా నర్సింహులు విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. నల్లా నర్సింహులు కుటుంబ సభ్యు లు, పార్టీ నాయకులతో ఆయన నివాళ్లు అర్పించి పూలు చల్లారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, జిల్లా సహాయ కార్య దర్శి ఆది సాయన్న, చొప్పరి సోమయ్య, మోటే శ్రీశైలం, ఎండి దస్తగిరి, విగ్రహ కమిటీ అధ్యక్షులు మాచర్ల సారయ్య, ఉపాధ్యక్షులు పోగు శ్రీనివాస్, మాజీ కల్నల్ డాక్టర్ బిక్షపతి, జనార్దన్, రాజ్‌కుమార్, వన్నాల శ్రీరాములు, మేడారపు సుధాకర్, పెనుగోండ రమేష్, బైరు భార్గవ్, బిర్రు సోమేశ్వర్, అబ్బాస్, రమేష్, సుదర్శన్, మంజుల యాకయ్య, సాంబయ్య, చింతకింది అరుణ, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'రాజ్యాంగబద్ధమే'

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం తెలియజేసింది. 'మేం ఉత్తరప్రదేశ్ మదర్సా చట్టం చెల్లుబాటును సమర్థిస్తున్నాం. పైగా రాష్ట్రానికి శాసనపరమైన సామర్థ్యం లేనప్పుడు మాత్రమే శాసనాన్ని కొట్టివేయవచ్చు అని' చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సి.జె.ఐ) డివై.చంద్రచూడ్ తీర్పును వెల్లడిస్తూ చెప్పారు. సర్వోన్నత న్యాయస్థానం తాజాగా వెలువరించిన ఈ తీర్పు మూలంగా ఉత్తరప్రదేశ్‌లోని 17లక్షల మంది విద్యార్థులకు, 10,000 మంది ఉపాధ్యాయులకు పెద్ద ఊరట లభించింది. ఉత్తరప్రదేశ్‌లో 16,000 మదర్సాలు ఉన్నాయి. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం అక్టోబరు 22న తన తీర్పును రిజర్వ్ చేసింది. తీర్పును రిజర్వ్ చేయడానికి ముందు దాదాపు రెండు రోజుల పాటు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ కెఎం. నటరాజ్‌తో పాటు అంజుమ్ కదారి సహా 8మంది పిటిషనర్ల తరఫు న్యాయవాదుల వాదనలను సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారించింది. మార్చి 22న అలహాబాద్ హైకోర్టు 2004 ఉత్తరప్రదేశ్ మదర్సా విద్యా చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించింది.ఈ చట సెక్యులరిజం సూత్రాలను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. ఈ అంశంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఏప్రిల్ 5న స్టే విధించింది. కాగా, సుప్రీం కోర్టు ఇచ్చిన ప్రస్తుత తీర్పుతో 16,000 మదర్సాల కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయి.

**'సుప్రీం' కీలకతీర్పుపై ముస్లిం మత నాయకులు, ప్రతిపక్షనేతల హర్షం**

ఉత్తరప్రదేశ్ మదర్సా విద్యా చట్టం రాజ్యాంగబద్ధమేనంటూ మంగళవారం నాడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్యధర్మాసనం ఇచ్చిన తీర్పును ముస్లిం మత నాయకులు, ప్రతిపక్ష పార్టీల నేతలు స్వాగతించారు. సెమినారీలను అనుమానంగా చూడటం తప్పు అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తలుచుకుంటే మదర్సాలను కొంతమేరకు అభివృద్ధి చేయవచ్చన్నారు. అందుకు దీనికి సంబంధించిన వారితో ప్రభుత్వం కూర్చుని చర్చలు జరిపితే తప్పకుండా ప్రయోజనం ఉంటుందన్నారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సీనియర్ సభ్యులు మౌలానా ఖాలిద్ రషీద్ ఫారంగి మహలి మాట్లాడుతూ ఇప్పుడు మదర్సాలను పూర్తి స్వేచ్ఛతో నడిపించవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జమైత్ ఉలామాహింద్ కు చెందిన రషీది మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడమేనని హర్షం వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా షియా పర్సనల్ లా బోర్డ్ అధికార ప్రతినిధి మౌలానా యాసూబ్ అబ్బాస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మదర్సాలు ముఖ్యమైన పాత్రను పోషించాయన్నా రు. మదర్సాలు మన దేశానికి ఎంతోమంది ఐఎఎస్, ఐపిఎస్, మంత్రులు, గవర్నర్లను ఇచ్చిందని ప్రస్తుతించారు. బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) చీఫ్ మాయావతి మాట్లాడుతూ మదర్సాల భవిష్యత్‌పై నెలకొన్న అనిశ్చితికి సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ కీలక తీర్పుతో తెరపడిందన్నారు. ఈ తీర్పు ఉత్తరప్రదేశ్ మదర్సాలు కార్యక్రమాలను సజావుగా కొనసాగించేందుకు దోహదపడుతోందన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి ఫఖ్రుల్ హాసన్ మాట్లాడుతూ బిజెపిపై ఆరోపణాస్త్రాలు సంధించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామం తర్వాత మదర్సాలు చట్టబద్ధంగా ఏర్పాటయ్యాయన్నారు. అధికార బిజెపి మదర్సాలను నమ్ముకున్న వర్గాలకు రాజ్యాంగ హక్కులను దూరం చేయాలని కుటిల ఆలోచన చేసిందని మండిపడ్డారు. 'ఈ మదర్సాలలో ఇస్లామిక్ స్టడీస్‌తో పాటు హిందీ, ఇంగ్లిషు, కంప్యూటర్ స్టడీస్ నేర్పిస్తున్నారు' అని ఫఖ్రుల్ హాసన్ తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com